ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 182 పేజీలు: 10+4 వెల: 6.50

## 70 దేశాలకు సుంకాలు పెంచిన ట్రంప్

9లో

## జీతం 15 వేలు.. ఆస్తులు 30 కోట్లు!


ఉత్తమ నటులు: షారుఖ్ ఖాన్ (జవాన్)


ఉత్తమ నటుడు: విక్రాంత్ మస్సే (12 ఫెయిల్)


ఉత్తమ నటి : రాణి ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే)


ఉత్తమ దర్శకుడు: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)

## ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి

### 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు

### టాలీవుడ్‌కు 7 జాతీయ అవార్డులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** కేంద్ర ప్రభుత్వం 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా 12త్‌ఫెయిల్‌ను ఎంపికచేసింది. జాతీయ ఉత్తమనటుడి అవార్డుకుగాను ఇద్దరికి ప్రకటించింది. షారూక్‌ఖాన్‌కు జవాన్ చిత్రానికిగాను లభించింది. అలాగే 12త్ ఫెయిల్ చిత్రంలో హీరో విక్రాంత మస్సేకు


ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి


ఉత్తమ యాక్షన్ స్టంట్ కొరియోగ్రఫీ: హనుమాన్


ఉత్తమ బాలనటి: సుకృతి వేణి (గాంధీతాత చెట్టు)

ఉత్తమ నటుడి అవార్డులు వరించాయి. ఉత్తమనటిగా హిందీచిత్రం మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వేలో నటించిన రాణిముఖర్జీ ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగుచిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్‌కేసరికి అవార్డు వరించింది. ఉత్తమ యాక్షన్ స్టంట్ కొరియో >>2



## నేడు క్రీడా పాలసీ ఆవిష్కరణ

### భావిభారత ఆటగాళ్లకు మార్గదర్శి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు1:** దేశ క్రీడా రంగానికి దిక్సూచిగా.. ఒలింపిక్స్ పతకాల వేటకు ఆట మైదానంగా.. భావి క్రీడాకారులకు మార్గదర్శిగా.. ఘనమైన గత వారసత్వపు పరిమళాలను మరింతగా వ్యాపింపజేసేందుకు హైదరాబాద్ వేదిక కాబోతోంది. ప్రతి క్రీడాకారునిలో ప్రతిభకు మరింతగా >>2



## సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

### షెడ్యూలు విడుదల చేసిన ఇసి

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** ఉపరాష్ట్రపతి ఎన్నికకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్, కౌంటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈమేరకు వచ్చే నెల 9న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపింది. ఇందుకోసం ఆగస్టు >>2

# సిఎం చేతిలో 'కాళేశ్వరం'

### 4న కేబినెట్ పరిశీలనకు ఘోష్ నివేదిక

### నోట్ తయారీకి కమిటీ ఏర్పాటు

### బ్యారేజి వైఫల్యాలపై చర్యలు సూచించిన కమిషన్!


శుక్రవారం సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కు జస్టిస్ ఘోష్ నివేదికను అందజేస్తున్న అధికారులు. చిత్రంలో డి.సిఎం భట్టి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు1:** కాళేశ్వరంపై పిసి ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం అధికారులు అందించారు. నీటిపారుదల శాఖ సెక్రెటరీ ప్రశాంత్ పాటిల్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు కమిషన్ నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. నీటిపారుదల శాఖ సెక్రటరీ, న్యాయ శాఖ సెక్రటరీ, జిఎడి సెక్రటరీ సభ్యులుగా నియమిస్తూ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని ఈ నెల 4న రాష్ట్ర కేబినెట్‌కు సమర్పించనుంది. మొత్తంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాళేశ్వరం కమిషన్ నివేదిక అందింది. రెండు కాపీలను అందజేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ న్యాయ విచారణ పూర్తి చేసి నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేశారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అనేక వైఫల్యాలు ఉన్నాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు బాధ్యులని నివేదికలో >>2


రేవణ్ణ

## అత్యాచారం కేసులో మాజీ ప్రధాని మనవడు

### రేవణ్ణను దోషిగా నిర్ధారించిన ప్రత్యేక కోర్టు

### నేడు శిక్ష ఖరారు

9లో

## బనకచర్లను అడ్డుకొని తీరుతాం

### కేంద్రం సపోర్టు ఉన్నదనే లోకేష్ మాటలు: హరీష్ రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు1:** కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యంతో ఎపి మంత్రి నారా లోకేశ్ బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని చెబుతున్నారని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టును కట్టి తీరుతామని లోకేశ్ మాట్లాడుతుంటే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి అని ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖమంత్రి, కాంగ్రెస్‌నాయకులు ఎవరూ మాట్లాడటంలేదని విమర్శించారు. ఏదో లోపాయికారి ఒప్పందం చేసుకున్నందు >>2

# ఏపాపం ఎరుగను..

### పిల్లలను దత్తతకు ఏర్పాటు చేశానంతే

### పోలీసు విచారణలో నిజాలు వెల్లడించని డా.నమ్రత

### 'సృష్టి' ఫెర్టిలిటీ కేసులో మొదలైన విచారణ


శుక్రవారం పోలీసు విచారణకు వచ్చిన డా. నమ్రత

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మొదటి రోజు విచారణలో భాగంగా డాక్టర్ నమ్రత ఎలాంటి పశ్చాతాపం లేకుండా సంతానం లేని దంపతులకు 'మేము పిల్లలను దత్తతకు అరేంజ్ చేస్తాం' అంటూ బహిరంగంగానే చెప్పినట్టు సమాచారం. ఈ వ్యాఖ్యలు ఆమెపై ఉన్న ఆరోపణలను మరింత బలపరిచే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమ సరోగసీ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్న నమ్రతను కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకుని, గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నార్త్ జోన్ డిసిపి కార్యాలయంలో గోపాలపురం పోలీసులు విచారణ ప్రారంభించారు.

ముఖ్యంగా చైల్డ్ ట్రాఫికింగ్ ఆరోపణల నేపథ్యంలో విచారణ సాగినట్లు సమాచారం. అయితే పోలీసులు అడిగిన చైల్డ్ ట్రాఫికింగ్, సరో గసీ పేరుతో పిల్లల విక్రయాలు అనే తీవ్రమైన ఆరోపణలపై స్పందించిన ప్రశ్నలకు డాక్టర్ తగిన సమాధానాలు ఇవ్వలేదని తెలుస్తోంది. చాలాసార్లు ఆమె నోరుమెదపక మౌనంగా ఉన్నట్లు సమాచారం. తాను ఎలాంటి తప్పు చేయలేదు అనే సమాధానాన్ని మాత్రమే మళ్లీ మళ్లీ చెప్పినట్టు పోలీసులు వెల్లడించారు.

**ఆశా వర్కర్ల పాత్రపై ఆరా..**

ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఏజెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల పాత్రపై పోలీసులు ఆరా తీశారు. ఒక్కొక్క దంపతుల వద్ద ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారని, మొత్తం ఎంత మంది తల్లిదండ్రులకు సరోగసీ పేరుతో పిల్లలను విక్రయించారని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు సంబంధించిన విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ బ్రాంచ్‌లపై పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

# మెదక్‌లో 'అదితి'

### ఫార్మా రంగంలో వినూత్న సాంకేతికత

### తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఈ పథకం అమలు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** దేశంలో ఫార్మా పరిశ్రమల రంగంలో ప్రపంచ ఇంధన సామర్థ్య సాంకేతికతలను ప్రోత్సహించడానికి తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాలను అదితి పథకం కింద కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ (బిఇఇ) ఎంపిక చేసింది. వీటిలో బడ్డి, మద్గావ్, అహ్మదాబాద్, బీదర్ తోపాటు, తెలంగాణలోని మెదక్ కూడా ఉంది. మెదక్‌లో ఫార్మా రంగంలో అత్యాధునిక ఇంధన సాంకేతికతలను అందించడం ద్వారా ఎంఎస్ఎంఇ రంగానికి తాము తీసుకున్న రుణాలపై వడ్డీ రాయితీ అందించడం ద్వారా ఆర్థికంగా మరింత ఊతం ఇవ్వడం కోసం బిఇఇ మెదక్‌ను ఎంపిక చేసింది. ఇంధన సమర్థ్య చర్యల అమలులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల చురుకైన పాత్రను విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా గుర్తించింది. అదే సమయంలో ఫార్మా రంగంలో అదితి పథకాన్ని మెదక్‌లో అమలుచేయనుంది.

దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేసేందుకు ముందుకు వచ్చి భారతదేశ స్వచ్ఛమైన పారిశ్రామిక వృద్ధిలో అదితి పథకాన్ని ఒక మలుపుగా మార్చాలని పిలుపునిచ్చింది. దేశ వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ రంగాన్ని బలోపేతం చేయడం, స్థిరమైన పారిశ్రామిక పద్ధతులను ప్రోత్సహించడానికి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అసిస్టెన్స్ ఇన్ డిప్లాయింగ్ ఎనర్జీ ఎఫిషియంట్ టెక్నాలజీ ఇన్ ఇండస్ట్రీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (అదితి) పథకం రూపకల్పన చేసి దాని అమలుకోసం రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఇందులోభాగంగా పరిశ్రమల స్థాపనలో ఇంధనసామర్థం టెక్నాలజీ >>2


శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్ రెడ్డి

# యాదాద్రి థర్మల్-1 జాతికి అంకితం

### రూ. 970 కోట్ల సమీకృత టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన

### నిర్దేశిత సమయంలో అన్ని యూనిట్ల నుంచి విద్యుదుత్పాదన: డి.సిఎం భట్టి

**మిర్యాలగూడ, ఆగస్టు 1 ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పాదనలో భాగంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఒకటిలోనే 800 మెగావాట్ల విద్యుత్ సామర్థంకలిగిన 1వ యూనిట్‌ని శుక్రవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జాతికి అంకితం చేశారు. అనంతరం 970కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సమీకృత టౌన్ షిప్ పనులకు శంకుస్థాపన చేసి వనమహోత్సవం కింద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైటిపిఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష అనంతరం >>2

# కేంద్రం మెడలు వంచైనా బిసిలకు 42% రిజర్వేషన్లు

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలి

### ఆందోలులో కొనసాగిన జనహిత పాదయాత్ర


శుక్రవారం ఆందోలులో జరిగిన పాదయాత్రలో మీనాక్షి నటరాజన్‌కు కాంగ్రెస్ జెండాను అందచేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**జోగిపేట,ఆగస్టు 1, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం మెడలు వంచైనా రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు సాధిస్తామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకునే దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చేందుకు ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసినట్లు ఆయన స్పష్టం చేసిందని, ఆమేరకు రిజర్వేషన్లు సాధించి తీరుతామని స్పష్టం చేశారు. టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర శుక్రవారంనాడు సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గంలోని సంగుపేట నుంచి జోగిపేట పట్టణం వరకు చేపట్టారు. ఈ సందర్భంగా జోగిపేటలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలను బిజెపి మోసం చేస్తుందని ఆరోపించారు. బిసి రిజర్వేషన్లపట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే 5,6,7 తేదీలలో తాము ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమాలకు రాష్ట్ర బిజెపి నేతలు తమతో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. >>2

## 1950 ఇందిరమ్మ ఇళ్లు రద్దు

### కేటాయించిన సెక్రటరీలపై వేటు

6లో



## గొర్రెల గోల్‌మాల్ వెయ్యి కోట్లు పైనే!

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో వెలుగుచూసిన గొర్రెల స్కాంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) శుక్రవారం నాడు సంచలన ప్రకటన విడుదల చేసింది. ఈ స్కాంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగానే గోల్‌మాల్ జరిగిందని ఇడి వెల్లడించింది. ఈ స్కాంలో 700 కోట్ల రూపాయల మేరకు అక్రమాలు జరిగాయని ఎసిబి నిర్ధారించి దీనిపై విచారణ చేస్తుండడం తెలిసిందే. ఏడాదిన్నరగా ఈ కేసును విచారిస్తున్న ఎసిబి ఇప్పటి వరకు 17 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు నిందితుల వాంగ్మూలం సేకరించి, దీనిపై కోర్టుకు నివేదిక ఇచ్చింది. అసలు నిందితుడు ఇక్రముద్దీన్ ఇంకా పట్టుబడలేదు. ఇదే సమయంలో ఇడి రంగంలో దిగి సమాంతరంగా ఈ కేసును విచారించడం మొదలుపెట్టి ఇందులో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా గోల్‌మాల్ జరిగిందని తేల్చింది. గొర్రెల పంపిణీ స్కాంపై ఏడు నెలల క్రితం కేసు నమోదు చేసిన ఇడి >>2



శుక్రవారం జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఐఐటి స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

# మెదక్‌లో 'అదితి'

>> లను అమలు చేయడంలో సహాయం చేసేందుకు గత నెల 15న పానిపట్ నుండి ప్రారంభించబడిన ఈ పథకాన్ని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ) అమలు చేస్తోంది. ఇది లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్‌ఎంఇ రంగానికి ఆర్థిక వెన్నెముకగా నిలవనుంది. జాతీయ స్థాయిలో ఈ పథకం అమలులో భాగంగా అన్ని రాష్ట్రాలు ఈపథకం అమలుపై తక్షణమే దృష్టి సారించి తగు చర్య తీసుకోవాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, బిఇఇ డైరెక్టర్ జనరల్ ఆకాష్ త్రిపాఠి చెప్పారు. ఈ పథకం విజయవంతమయ్యేలా ల నిర్వాహకులు వారి పరిశ్రమలకు ప్రయోజనాలను పెంచుకోవడానికి ఈ అవకాశాన్ని మొదటి నుండే ఉపయోగించుకోవాలని అన్ని రాష్ట్రాలను కోరుతున్నామన్నారు. రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌లో రూ. 875 కోట్లు వడ్డీ రాయితీగా కేటాయించబడ్డాయన్నారు. ఇంధనసమర్థవంతమైన సాంకేతికతల అప్‌గ్రేడ్‌ల కోసం రాయితీ ఫైనాన్స్‌ను సులభతరం చేయడానికి రూ.50 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ చొరవ ఎంఎస్‌ఎంఇల ద్వారా గణనీయమైన రుణాలతో సహా రూ. 9 వేల కోట్లకు పైగా మొత్తం పెట్టుబడులను ప్రభావితం చేస్తుందని భావిస్తున్నామన్నారు. ఎంఎస్‌ఎంఈ రంగానికి ఈ పథకం సమగ్ర మద్దతును అందిస్తుందన్న ఆయన ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్స్ (ఐజిఇఎ), వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్ట్స్ (డిపిఆర్‌లు) నుండి ఫైనాన్సింగ్ సహాయం మరియు పర్యవేక్షణ మరియు ధృవీకరణ (ఎం అండ్ వి) వరకు కొలవగల ఇంధన ఆదా, తగ్గిన ఖర్చులు మరియు మెరుగైన ఉత్పాదకతను నిర్ధారిస్తుందని తెలిపారు. ఎస్‌డిఎల పాత్ర కీలకంరాష్ట్ర స్థాయిలో ఈ పథక అమలు ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.



బీహార్‌లో ఓటర్ల ప్రత్యేక సవరణకు నిరసనగా ఢిల్లీలో ప్రదర్శన జరిపిన కాంగ్రెస్ ఎంపీలు ఖర్గే, ప్రియాంక, డిఎంకె ఎంపి బాలు తదితరులు

# సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

>> 7న ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 21 లోపు నామినేషన్ల సమర్పించవచ్చని ఈసీ ప్రకటించింది. ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ ఆగస్టు 7, నామినేషన్ల సమర్పణకు తుది గడువు ఆగస్టు 21, నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఆగస్టు 22, నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఆగస్టు 25, పోలింగ్ సెప్టెంబర్ 9 (ఉదయం 10 నుంచి సాయంత్రం 5వరకు), కౌంటింగ్‌తోపాటే ఫలితాలను వెల్లడిస్తారు. కాగా సెప్టెంబర్ 9 ఎలక్టోరల్ కాలేజ్ ఖరారు.
మరోవైపు ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎలక్టోరల్ కాలేజీ జాబితా ఖరారైనట్లు ఇప్పటికే ఇసి ప్రకటించింది. అలాగే నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి ఇసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఎలక్టోరల్ కాలేజీ జాబితా కొనుగోలుకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. త్వరలోనే ఎలక్టోరల్ కాలేజీ జాబితా ప్రకటిస్తామని తెలిపింది.
ఇక ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహణకుగాను రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి మోడీ ఇటీవల నియమితులయ్యారు. న్యాయ మంత్రిత్వ శాఖను సంప్రదించడంతో పాటు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ సమ్మతి మేరకు ఇసి నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్ సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.
ఇదిలా ఉండగా, ఉపరాష్ట్రపతి పదవికి ఎన్‌డిఎ కూటమి ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వస్తున్నాయి. జెడియు నేత, కేంద్రమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్‌ను ఎంపిక చేసే అవకాశాలున్నట్లు ప్రచారం మొదలైంది. అయితే, దీన్ని బిజెపి విశ్వసనీయ వర్గాలు తోసిపుచ్చాయి. తదుపరి ఉప రాష్ట్రపతిగా బిజెపి చెందిన నేతనే ఎన్నుకోనున్నట్లు వెల్లడించాయి. విపక్షాలు కూడా ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్ట నున్నాయని ప్రచారం జరుగుతోంది.
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ అనూహ్యంగా పదవికి రాజీనామా చేశారు. కాగా బీహార్‌నుంచే వచ్చిన ప్రస్తుత రాజ్యసభ ఉపఛైర్మన్ హరివంశ్‌నారాయణ్‌కే పదవి దక్కుతుందని చెపుతున్నారు. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్రం ఈనిర్ణయం తీసుకోవచ్చని బలంగా వినిపిస్తోంది. బిజెపి వర్గాలనుంచి అయితే ఈసారి ఖచ్చితంగా బిజెపికి చెందిన వారినే ఎన్నుకోవాలని పట్టుదలతో ఉన్నట్లు పేర్కొంటున్నారు. రెండేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ధన్‌ఖడ్ ముందుగానే వైదొలిగారు. అనారోగ్య కారణాలతో తప్పుకుంటున్నట్లు రాష్ట్రపతికి లేఖ రాసిన ఆయన తక్షణమే రాజీనామా అమల్లోకి వచ్చేలా చూడాలని కోరారు. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదం లభించగా తాజాగా ఇసి ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది

# కెటిఆర్, జగదీష్‌రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు1:** ఫేక్ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారని ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న (చింత పండు నవీన్) ఎంఎల్‌సి ఎన్నికల సమయంలో కెటిఆర్, జగదీష్ రెడ్డిపై ఫిర్యాదు చేయగా, మేడిపల్లి పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టి వేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, జగదీష్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం కెటిఆర్, జగదీష్ రెడ్డిపై నమోదైన కేసును కొట్టివేసింది. పోలీసులు తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు ఎలాంటి ఆధారాలు లేవని కెటిఆర్, జగదీశ్వర రెడ్డి తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఫేక్ వీడియోలపై ఎలాంటి ఆధారాలు లేవని కేసును కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

# అడ్డుకొని తీరుతాం

>> వల్ల వారు మాట్లా డటం లేదని ఆయన ఆరోపించారు. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవట్లేదని పేర్కొన్నారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామన్నారు. గోదావరి-బనకచర్ల అజెండాలో ఉంటే తాము ఉమ్మడి రాష్ట్రాల సమావేశానికి రాబోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్రానికి లేఖ రాస్తే, ముఖ్యమంత్రి, అధికారులు మాత్రం ఇటీవల హాజరయ్యారని గుర్తుచేశారు. రాత్రికిరాత్రి ఢిల్లీకి వెళ్లి... మొదటి అంశమే బనకచర్ల ఉన్నప్పటికీ సమావేశంలో పాల్గొని, కమిటీ వేయడానికి అంగీకరించారని ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ధైర్యం చూసుకొని లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతామని చెబుతున్నారనిఅన్నారు. కాంగ్రెస్, బీజేపీ మౌనం కారణంగానే చంద్రబాబు బనకచర్లపై బుల్డోజింగ్ విధానంతో వెళుతున్నారని విమర్శించారు. మేం బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతుంటే, అసలు బనకచర్ల కడితే కదా అడ్డుకునేది అని రేవంత్ రెడ్డి చెబుతుండటం విడ్డూరంగా ఉందని అన్నారు.

# భగవంత్ కేసరి

>> గ్రఫీలో హనుమాన్ సినిమా అవార్డు దక్కించుకోగా, ఉత్తమ గేయరచయితగా బలగంలో 'ఊరు పల్లెటూరు' పాటకుగాను కాసర్ల శ్యామ్ అవార్డును సొంతంచేసుకున్నారు. ఉత్తమ తమిళ చిత్రంగా పార్కింగ్‌కు అవార్డు వరించింది. తొలుత నాన్ ఫీచర్ చిత్రాల కేటగిరీ అవార్డులను కేంద్రం ప్రకటించింది.
ఉత్తమ మ్యూజిక్ దర్శకత్వంలో తమిళచిత్రం వాతి జివి ప్రకాష్‌కుమార్.
ఉత్తమ నేపథ్యయ సంగీతం : యానిమల్ హర్షవర్ధన్ రామేశ్వర్
బెస్ట్‌మేకప్: సామ్‌బహాదూఊర్ (హిందీ) శ్రీకాంత్ దేశాయ్
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: 2018: ఎవ్విర్‌వన్ ఈజ్ ఏ హీరో (మళయాళం) మోహన్‌దాస్
బెస్ట్ ఎడిటింగ్: పూక్కాలమ్(మలయాళం)మిథున్ మురళి
బెస్ట్ సౌండ్ డిజైన్: హింది యానిమల్‌లో సచిన్ సుధాకరన్, హరిహరన్‌మురళీధరన్
బెస్ట్ స్క్రీన్‌ప్లే ఒరిజినల్: బేబి(తెలుగు) సాయిరాజేశ్ నీలం
బెస్ట్ స్క్రీన్‌ప్లే(ఒరిజినల్) పార్కింగ్(తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్
ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్‌ఏక బందా కాఫీహై(హిందీ) దీపక్ కింగ్రానీ
ఉత్తమ సినిమాటోగ్రఫీ: దికేరళ స్టోరీ(హిందీ) వసంతను మొహపాత్రో
ఉత్తమ నేపథ్యగాయని: జవాన్‌లో (చెలియా పాటకు శిల్పారావు
ఉత్తమ నేపథ్యగాయకుడు : బేబి (పివిఎన్‌ఎస్ రోహిత్)
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: గాంధీ తాత చెట్టు(సుకృతివేణి), జిప్సీ(మరాఠి)కబీర్‌ఖందారి నాల్-2, త్రిషథోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్‌దీప్‌లు ఎంపికయ్యారు.
ఉత్తమ సహాయ నటి: ఉల్లుకు(మళయాళం) ఊర్వశి, నష్(గుజరాతి) జానకీ బోడివాలా
ఉత్తమ సహాయనటుడుగా పూకానకలం(మలయాళం), విజయరాఘవన్, పార్కింగ్(తమిళం), ముత్తుపెట్టాయ్ సోముభాస్కర్‌లను వరించింది.
ఉత్తమ బాలలచిత్రం: నాల్ (మరాఠి)
ఉత్తమ జాతీయ సమగ్రత సామాజిక విలువలచిత్రం: శామ్ బహాదూర్(హిందీ)
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: రాకీ ఔర్ రాణికి ప్రేమ్‌కహాని(హిందీ)
ఉత్తమ పరిచయ దర్శకుడుగా : ఆత్మపాంప్లెట్(మరాఠి)చిత్రం ఆశిష్ బెండే
ఉత్తమ ఫీచర్ ఫిలింగా : 12త్ ఫెయిల్
ఇక నాన్‌ఫీచర్ ఫిలింకేటగిరీలో క్రానికల్ ఆఫ్ ప్యాటీమాన్ మళయాళచిత్రం నేకల్, ఒడియాచినరతం ది సీ అండ్‌సెవెన్ విలేజెస్, కన్నడ చిత్రం సన్‌ఫ్లవర్స్ వోర్‌ది ఫస్ట్‌వన్స్‌టునో బెస్ట్ స్క్రిప్ట్ అవార్డును సొంతంచేసుకున్నాయి. బెస్ట్ వాయిస్ ఓవర్‌కు ది సేక్రెడ్ జాక్ ఇంగ్లీషు చినరతం, బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్ హిందీచినరతం ది ఫస్ట్ ఫలిమ్, ఇంగ్లీషు చిత్రం బెస్ట్ ఎడిటింగ్‌కు మూవీంగ్‌ఫోకస్, బెస్ట్ సౌండ్ డిజైన్‌కు హిందీచిత్రం దుందగిరి కేపూల్, బెస్ట్ సినిమాటోగ్రఫీకి తమిళ చిత్రం లిటిల్ వింగ్స్, బెస్ట్ డైరెక్షన్ విభాగంలో హిందీ చిత్రం ది ఫస్ట్ ఫిలిమ్, బెస్ట్ ఎడిటింగ్‌లో ఇంగ్లీస్ చిత్రం మూవింగ్ ఫోకస్, బెస్ట్ ఆర్ట్, కల్చర్ చిత్రంగా ఇంగ్లీష్ చిత్రం టైమ్‌లెస్ తమిళనాడు, బెస్ట్ బయోగ్రాఫికల్ సినిమాగా ఒడిశాకు చెందిన మాబావు, మాగావ్, లెంటినో ఓవో ఎలైట్ అన్‌ది ఈస్టర్న్ హోరిజన్(ఇంగ్లీష్), ఉత్తమ పరిచయ దర్శకుడుగా మిజో చిత్రం మావ్ ది స్పిరిట్‌డ్రీమ్స్ ఆఫ్ చెరా, బెస్ట్ నాన్‌ఫీచర్‌ఫిలిమ్‌గా ఫ్లవరింగ్‌మ్యాన్ హిందీచిత్రానికి దక్కాయి.

# జాతికి అంకితం

>> ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైటిపిఎస్‌లోనే యూనిట్ 1 ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ నందించే యూనిట్‌ను జాతికి అంకితం చేయడం సంతోషకరమన్నారు. 2025 జనవరి 21న 2వ యూనిట్‌ను జాతికి అంకితం చేసిన అనంతరం స్టేజ్ వన్‌లోని అన్ని యూనిట్లు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పాదన చేస్తుండగా స్టేజి2కు సంబంధించిన యూనిట్‌లలో నిర్దేశిత లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి జనవరి 2026లో జాతికి అంకితం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్ణి త సమయాన్ని నిర్దేశించుకుని నిర్ణయించుకున్న కార్యాచరణ ప్రకారం నిర్దిష్ట కాల పరిమితి మేరకు క్యాలెండర్ రూపొందించుకొని పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలోనే రెండు యూనిట్లు పూర్తి చేయడం గాక, ఈ ఏడాది ఆఖరి నాటికి మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ యూనిట్ పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలపై పడే భారాన్ని తగ్గించాలని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ విద్యుత్ ఉత్పాదనతోపాటు వైటిపిఎస్‌లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిర్దేశించిన సమయంలో అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ అందించేందుకు వైటిపిఎస్ అధికారులు పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించుకోవాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత పాఠశాల ఏర్పాటు, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఆసుపత్రి నిర్మాణం, అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందికి క్వార్టర్స్ కట్టిస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదల పౌరసర శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడే విష్ణుపురం డబల్ రైల్వే లైన్ మంజూరు చేశానని, 93 కిలోమీటర్ల రైల్వే పనులకు సరైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రానందున పనులు ఆలస్యం అయ్యాయని, అవి ఇప్పటివరకు పూర్తి కానందున వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పవర్ ప్లాంటుకు అవసరమైన రహదారులను పూర్తి చేసేందుకు 280 కోట్ల రూపాయలు మంజూరు చేయడం కాకుండా వాటికి క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు.

# సిఎం చేతిలో 'కాళేశ్వరం'

>> జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వ్యవస్థాగత విధానాలకు విరుద్ధంగా వ్యక్తుల ఇష్టానుసారం పనులు జరిగాయని, ఉన్నతస్థాయి ఒత్తిడులకు తలొగ్గి నిబంధనలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

**ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి హస్తినకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రాత్రి ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) లా, హ్యూమన్ రైట్స్ అండ్, ఆర్‌టిఐ విభాగం2025 ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న న్యాయ విభాగం కాంక్లేవ్‌లో పాల్గొనబోతున్నారు. 'రాజ్యాంగ సవాళ్ల దృక్పథం, మార్గాలు' అనే థీమ్‌తో ఈ సదస్సు కొనసాగనుంది. భారత రాజ్యాంగంలో నీతి, పరిణామ పాత్రపై న్యాయ నిపుణులు, విద్వాంసులు, విద్యార్థులు ఈ చర్చలో భాగస్వాములు కానున్నారు. ఈకార్యక్రమానికి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభాపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పాల్గొననున్నారు. సుమారు 1,200 మంది న్యాయనిపుణులు, కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలుహాజరవుతున్న ఈ కాంక్లేవ్‌కు నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. తెలంగాణ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యంవహిస్తున్న అభిషేక్ సింఘ్వీ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగనుంది.

**హైకోర్టులో సిఎం రేవంత్‌రెడ్డికి ఊరట**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన ఒక కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. గత ఏడాది జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బిజెపి నాయకుడు కాసం వెంకటేశ్వర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయన నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం దావా వేశారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఆ సభలో అన్నారని వెంకటేశ్వర్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు, కేసు విచారణను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొందరు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసింది. రేవంత్ రెడ్డి ప్రసంగానికి సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పింగులను కూడా కాసం వెంకటేశ్వర్లు కోర్టుకు సమర్పించారు. ప్రజాప్రతినిధుల కోర్టులో కొనసాగుతున్న విచారణను నిలిపివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఆయనకు అనుకూలంగా శుక్రవారం తీర్పు వెలువడింది.

# కమ్యూనిస్టులు ఉప్పులాంటి వారు

## కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వారి ఉద్యమాలు తోడ్పడ్డాయి: సిఎం రేవంత్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఆగస్టు 1 ప్రభాతవార్త:** అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టులు ఉపయోగపడతారో లేదో విశ్లేషించలేను కానీ, అధికారంలో ఉన్నవారిని దించడానికి మాత్రం పనికొస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నవ తెలంగాణ దినపత్రిక 10వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'తప్పు చేసేవాళ్లను గద్దె దించడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారు. అబద్దాల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని..రాజకీయాల్లోకి వచ్చినప్పుడే నిర్ణయించుకున్నా. కమ్యూనిస్టులు ఉప్పు లాంటివారు. ఎన్ని మసాలాలు ఉన్నా..ఉప్పు లేకపోతే వంటకు రుచి రాదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఉపయోగపడ్డాయి. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే..ఆనాడు విద్యుత్ ఉద్యమాలను లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది కమ్యూనిస్టు సోదరులని నమ్ముతున్నా. 2023లో మేము అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగానో..పరోక్షంగానో వీరభద్రం చేసిన పాదయాత్రలు, పోరాటాలు కారణం కావొచ్చు. ప్రజా పాలనను కొనసాగించడానికి కూడా మీ సహకారం కావాలి" అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్వతంత్ర సంగ్రామ కాలంలో దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపి అందరినీ ఒక వేదికపైకి తేవడంలో పత్రికలు అపారమైన కృషి చేశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి ఇప్పుడు కొన్ని వింత పోకడలు పాత్రికేయ రంగానికి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించడంలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో నడిచే పత్రికల పాత్ర మరువలేనిది. ఇప్పుడు పాత్రికేయ రంగంలో కొన్ని వింత పోకడలు వచ్చాయి.

**వారి చెంపలు పగులగొట్టాలనుకుంటా: సోషల్ మీడియా జర్నలిస్టులకు సిఎం హెచ్చరిక**

జర్నలిజం డెఫినేషన్ మారిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జర్నలిజం వృత్తిలో ఉన్నవాళ్లు తమ బాధ్యతను మరవకూడదన్నారు. సోషల్ మీడియా పేరుతో జర్నలిజంలోకి వస్తున్నా వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను వేరే చేయాలని..వాళ్లను నేరుగా కూర్చోబెట్టాలని పాత్రికేయులకు సిఎం విజ్ఞప్తి చేశారు. వాళ్లు, మీరు ఒక్కటి కాదన్న భావనను ప్రజలకు కల్పించాల్సిన అవసరం ఉందని సిఎం స్పష్టం చేశారు. 'ఈ రోజు మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఎవరు పడితే వారు జర్నలిస్ట్ అని గొప్పలు చెప్పుకుంటున్నారు. పెన్ను పేపర్ ఇస్తే ఎబిసిడిలు కూడా రాయలేని వారు కూడా నేను జర్నలిస్టుని అంటారన్నారు. మనమేదో లోకువ అయినట్టు, వాళ్లేదో పెత్తనాన్ని చెలాయించడానికి వచ్చినట్లు మన కళ్లలోకి చూస్తుంటారు. నన్నుచూసి ఇంకా తల వంచుకుంటలేవు అని చూస్తుంటాడు. స్టేజీ దిగిపోయి చెంపలు పగులగొట్టాలని నాకు అనిపిస్తది. కానీ, పరిస్థితులు, హోదా అడ్డంవస్తుంది' అని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# 42% రిజర్వేషన్లు

>> ఇకపోతే తాము ఊరికే ఈ పాదయాత్ర చేపట్టడంలేదని, ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్న తపనతోనే తాము ఈ జనహిత పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. ఇది గుర్తించని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉండి పాదయాత్రలు చేపట్టడమేంటని ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. పాదయాత్రలు కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేస్తామన పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తే, ఒక్క కెసిఆర్ ఫ్యామిలీకి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

**దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్ రాహుల్ ధ్యేయం: ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్**

తెలంగాణలో బిసిలకోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 42శాతం రిజర్వేషన్ల ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా ఇలాంటి మార్పు తీసుకురావాలని తమ అధినాయకుడు రాహుల్‌గాంధీ ధ్యేయంగా పెట్టుకున్నారని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడికి వెళ్లినా తెలంగాణ మోడల్ గురించే మాట్లాడతారని ఆమె తెలిపారు. 42శాతం రిజర్వేషన్లకోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, దీనికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే వెన్నంటి ఉంటుందని, అందుకని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

**రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి: మంత్రి వివేక్**

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలని మంత్రి వివేక్ ప్రజలను అభ్యర్థించారు. గత కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు తీరని అన్యాయం చేసిందని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒకటిన్న సంవత్సరంలోనే అరలక్షకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. త్వరలో మరికొన్ని ఉద్యోగాలుకూడా భర్తీ చేయనుందన్నారు.

**మాటిస్తే నిలబెట్టుకునే సంస్కృతి కాంగ్రెస్‌ది: మంత్రి దామోదర్ రాజనర్సింహా**

కాంగ్రెస్ ప్రజలకు ఒక హామీ ఇచిందంటే దానిని తప్పకుండా నిలబెట్టుకుంటుందని, అలాంటి సంస్కృతి కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారంనాడు జోగిపేటలో జనహిత పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల ప్రభుత్వమని, తాము ఎల్లప్పుడు ప్రజా సంక్షేమంకోసమే పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పార్లమెంటు సభ్యులు సురేష్‌శెట్కార్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, త్రిష తదితరలు పాల్గొన్నారు.

# వారం - వర్జ్యం

02-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
అష్టమి ఉ.7.23
విశాఖ పూర్తి
వర్జ్యం : ఉ.9.57-11.44
దు.తె.5.49-7.28
రాహుకాలం - ఉ.9.00-10.30

# వార్తాఫలం

**మేషం:** తండ్రి తరపు నుండి ఆస్తి లాభం పొందే సూచన, కోర్టు వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృషభం:** వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ఆటంకాలు తొలుగుతాయి.

**మిథునం:** కష్టానికి ఫలితం దక్కుతుంది. పెండింగ్ పనులు పూర్తికాగలవు. పట్టుదలతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

**కర్కాటకం:** గృహనిర్మాణాలు వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు సాగిస్తారు. అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి.

**సింహం:** ఉద్యోగ, విద్యావకాశాలు లాభిస్తాయి. ఆర్థికపరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**కన్య :** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** షేర్లు, భూముల క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృశ్చికం:** కొత్త ఒప్పందాలలో తొందరపాటు వద్దు. కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** వ్యవహారాలు నిదానంగా పూర్తిచేస్తారు. సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మకరం:** వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఉద్యోగులకు కొంత ప్రోత్సాహం లభిస్తుంది.

**కుంభం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**మీనం :** నూతన పరిచయాలు పెరుగుతాయి వాయ్వహారాలలో ఆటంకాలు ఎదురైన ధైర్యంతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేడు క్రీడా పాలసీ ఆవిష్కరణ

>> సానబెట్టి విశ్వ వేదికపై మన క్రీడాకారులు దేశ పతాకాన్ని గర్వంగా ఎగురవేసేందుకు వీలుగా వారికి అవసరమైన వసతులు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం క్రీడా విధానాన్ని (స్పోర్ట్స్ పాలసీ) రూపొందించింది. ప్రముఖ క్రీడాకారుల సమక్షంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణ క్రీడా విధానాన్ని శనివారం ఆవిష్కరించనున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కోటి జనాభా లేని దేశాలు ఒలింపిక్స్‌లో నాలుగైదు బంగారు పతకాలు దక్కించుకుంటుంటే వంద కోట్ల పైచిలుకు జనాభా ఉన్న మన దేశం మాత్రం ఒక్క స్వర్ణ పతకం గెలుచుకోవడం కష్టమవుతోంది. దశాబ్దాలుగా ప్రభుత్వాలు సరైన క్రీడా పాలసీని రూపొందించుకోకపోవడం, క్రీడాకారులు, కోచ్‌లకు సరైన ప్రోత్సాహం కల్పించకపోవడం, మౌలిక వసతులు లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. దీనిని సమూలంగా మార్చేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. అందుకే తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని రూపొందింపజేశారు. క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, చదరంగం వంటి క్రీడల్లో తెలంగాణకు ఘనమైన చరిత్ర ఉంది.. 2002 నేషనల్ గేమ్స్, 2024 ఇంటర్ కాంటినెంటల్ కప్ వంటి పెద్ద ఈవెంట్లకు తెలంగాణకు ఆతిథ్యమిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూనే మరింతగా తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటేలా నూతన పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. అయిదు ప్రధానాంశాలుగా తెలంగాణ నూతన క్రీడా పాలసీ రూపొందించారు.

# గొర్రెల గోల్‌మాల్ వెయ్యి కోట్లు పైనే!

>> అధికారికంగా శుక్రవారం నాడు తొలిసారిగా ప్రకటన విడుదల చేస్తూ ఇందులో అనుకున్నదానికంటే ఎక్కువగానే అక్రమాలు వెలుగు చూశాయని తెలిపింది. ఈ స్కాంకు సంబంధించి బుధవారం నాడు జరిపిన సోదాల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వద్ద గతంలో ఓఎస్‌డిగా పనిచేసిన కల్యాణ్ వద్ద తనిఖీలు చేసి 200పైగా బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పాస్ పుస్తకాలు జప్తు చేసినట్లు ఇడి అధికారులు తెలిపారు. సోదాల అనంతరం 31 సెల్‌ఫోన్లు. 20 సిం కార్డులు జప్తు చేసినట్లు ఇడి అధికారులు వెల్లడించారు. జప్తు చేసిన బ్యాంకు ఖాతాలు, సెల్ ఫోన్లు, సిం కార్డులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌లో వాడినట్లు ఇడి అధికారులు తెలిపారు. గొర్రెల పంపిణీ స్కాంకు సంబంధించి గతంలో కాగ్ ఇచ్చిన నివేదికలో కేవలం ఏడు జిల్లాలోనే 253.93 కోట్ల రూపాయల మేరకు అక్రమాలు జరిగినట్లు వుందని, అయితే ఈ స్కాం 33 జిల్లాలలోనూ వెలుగు చూసిందని. అన్నింటిని కలిపితే ఈ స్కాం విలువ వెయ్యి కోట్ల రూపాయలను దాటిందని ఇడి అధికారులు తెలిపారు. గొర్రెల పంపిణీ పథకంలో లబ్దిదారులకు వెళ్లాల్సిన నిధులు ప్రైవేటు వ్యక్తులు తమ సొంత ఖాతాల్లో మళ్లించుకున్నారని ఇడి పేర్కొంది. చాలాచోట్ల గొర్రెలను కొనుగోలు చేయకుండానే కొన్నట్లు, రైతులకు ఇవ్వకుండానే పంపిణీ చేసినట్లు తప్పుడు లెక్కలు రాసినట్లుగా విచారణలో తేలిందని ఇడి వెల్లడించింది. 2017లో గొర్రెల పంపిణీ పథకం మొదలవగా ఇందుకోసం నాలుగు లక్షల 25 వేల యూనిట్లను రైతులకు అందించిన ట్లు రికార్డులు వున్నాయని, వాస్తవంలో కొంతమేరకు పంపిణీ చేసి అంతకు పదింతలు ఇచ్చినట్లు తప్పుడు లెక్కలు రాసినట్లు ఇడి తేల్చింది.



# డెంగ్యూ సోకి ఆస్పత్రిలో చేరిన ప్రముఖ నటి రాధిక

**చెన్నై, ఆగస్టు 1:** ప్రముఖ నటి రాధిక శరత్‌కుమార్ అస్వస్థతకు గురికావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఆమెకు డెంగ్యూ సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జ్వరం తీవ్రస్థాయికి చేరడంతో ఆమెకు ప్రత్యేక చికిత్సలు అవసరమని వైద్యులు ఆమెను ప్రస్తుతం పరిశీలనలో ఉంచారు. ఆమె వెంట కుమార్తె రాయనేమిథున్ తోడుగా ఉన్నారు. ఆమె స్వయంగా తల్లికి అందుతున్న వైద్యం వివరాలను మీడియాకు తెలిపారు. అమ్మకు డెంగ్యూ సోకిందని, ప్రస్తుతం కోలుకుంటున్నారని అభిమానులు ఆకాంక్షలు, ఆశీస్సులతో ఆమె సత్వరమే ఇంటికి వచ్చేస్తారని పేర్కొన్నారు. ఈనెల ఐదవ తేదీ వరకూ ఆమెను ఆసుపత్రిలో చికిత్స అందిస్తామని, సమగ్రపరిశీలన తర్వాతనే ఆమెను డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు. రాధిక శరత్ కుమార్ తెలుగు, తమిళ, మలయాళ కన్నడభాషల్లో వందల చిత్రాల్లో నటించి అగ్రనటిగా పేరుపొందారు. తెలుగులో చిరంజీవితోనే 15కిపైగా సిని మాల్లో నటించారు. టివి సీరియన్ నిర్మాతగా కూడా ఆమె సక్సెస్ అయ్యారు. ఇటీవలి కాలంలో ఆమె రాజకీయాల్లోకి కూడా ప్రవేశించారు.

# తెలుగు సినీరంగానికి 7 జాతీయ అవార్డులు రావడం సంతోషం

తెలుగు చిత్ర పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి

తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులతో తెలుగు సినీపరిశ్రమను ప్రోత్సహిస్తున్నాం

సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 1:** 71వ జాతీయ చలనచిత్ర అవా ర్డులలో తెలుగు చిత్ర పరిశ్రమకు ఏడు అవార్డులు లభించడం పట్ల తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందులో ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి ఎంపిక కావడం, తెలంగాణలోని పల్లె ఆప్యాయతను కళ్లకు కట్టినట్లు చూపిన బలగం సినిమాలోని పాటలకు కాసర్ల శ్యామ్‌కు జాతీయ అవార్డు లభించడం పట్ల మంత్రి వారికి అభినం దనలు తెలిపారు. బేబీ, హను మాన్ చిత్రాలకు రెండేసి అవార్డులు.

గాంధీ తాత చెట్టు చిత్రానికి సుకృతి వేణి ఉత్తమ బాలనటిగా ఎంపికవడం తెలుగు సినీ పరిశ్రమ ప్రతిభను చాటిచెప్తున్నది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మొదటి సారి సినీ పరిశ్రమను తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులతో సత్కరించి, ప్రోత్సాహానికి శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు.

రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినీ రంగాన్ని నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. అవార్డులు వరించిన చిత్రాలకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, అవార్డు వచ్చేలా సమష్టి కృషి చేసిన వారి బృందం మొత్తానికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

**జాతీయ అవార్డు సాధించిన ఊరు పల్లెటూరు టీమ్‌కు కెటిఆర్ అభినందనలు**

బలగం సినిమాలోని ఊరు పల్లెటూరు పాటకు బెస్ట్ లిరిక్స్ విభాగంలో జాతీయ అవార్డు సాధించిన ప్రముఖ గేయ రచయిత కాసర్ల శ్యామ్‌కు, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్‌కు, బలగం టీమ్‌కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలి పారు. తెలంగాణలోని పల్లెవాసనకు పట్టం కట్టి ఆ పరిమళాలను విశ్వవ్యాప్తంగా వెదజల్లిన బలగం సినిమాకు నేషనల్ అవార్డ్ దక్కడం నాలుగు కోట్ల రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణ మన్నారు.. దూరమవుతున్న మానవ సంబంధాలను తట్టిలేపిన గొప్ప సినిమాలోని ఊరు పల్లెటూరు పాట కుటుంబాలను ఏకం చేయడమే కాదు మూడు తరాలను దగ్గర చేసిందన్నారు. 'బలగం'లోని ప్రతి ఒక్క సభ్యునికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఫాల్కన్ గోల్‌మాల్ కేసులో కీలక పరిణామం

రూ.18.14 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఇడి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీంలతో అమాయకులను నిండా ముంచి వెయ్యి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఫాల్కన్ ఇన్వాయిస్ కంపెనీ గోల్‌మాల్ వ్యవహారం లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సంస్థకు సంబంధించి 18.14 కోట్ల రూపాయల విలువ చేసే 12 స్థిరాస్తులను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ శుక్రవారం నాడు జప్తు చేసింది. ఈ కంపెనీ 792 కోట్ల రూపాయలను కొల్లగొట్టినట్లు పోలీసులు చెబుతుండగా ఇది వెయ్యి కోట్ల రూపాయలకు పైగా వుంటుందని బాధితులు చెబుతున్నారు. మొదట దీనిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా ఆ తరువాత ఈ కేసును సిఐడికి బదలాయించారు. 7056 మంది బాధితు ల నుంచి 4215 కోట్ల రూపాయలను వసూలు చేసిన ఫాల్కన్ గత ఫిబ్రవరి నెలలో బిచాణా ఎత్తేయడం తెలిసిందే. చాలామంది బాధితులకు న్యాయం జరగకపోవడంతో పోలీసులపైనా ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలో దిగి ఈ సంస్థ స్థిరాస్తులను శుక్రవారం జప్తు చేసింది.


BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL- II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABID'S, HYDERABAD
OA. No 378/2025

Between:
M/S. ICICI BANK LTD.
Rep. by its Authorized officer ...Applicant
A N D
SRI TANNIRU BALA ASHOK ...Defendonts

To,
(SOLE DEFENDANT) SRI TANNIRU BALA ASHOK
S/o Tanniru Srinu, H.No. 1-5-69/ 1, Phanigiri Colony, Kothapet, Hyderabad 500 060

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

Please take the summons in the above O.A. filed by the Applicant for recovery of Rs.30,00, 970/-( Rs. Thirty Laks, Nine Hundred and Seventy Only) 11-04-2025 against the Defendant. The Hon 'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vaartha" Telugu daily newspaper having circulation at Kothapet/ Dilshuk Nagar, Hyderabad, Telangana" edition and posted the Matter on 04-09-2025.
In accordance with sub- section (4) of section 19 of the Act, you the defendants are directed as under;
1) To show cause within Thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
2) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial No IIIA of the original application;
3) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
4) You shall not transfer by way of sale , lease or ,except in the ordinary course of his business and properties specified or disclosed under serial number III A of the original application without the prior approval of the Tribunal;
5) You shall be liable to account for the sale proceeds realized by the sale of secured assets of other assets and properties in the ordinary course of the business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 04-09-2025 at 10.30 A.M at Debts Recovery Tribunal -II, 1st Floor, Triveni Complex, Abids Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should Not be granted.
Take Notice that in case of default the application will be heard and determined in your absence.
tc Given under my hand and seal of this Tribunal on this the 28th Day of July 2025

Registrar
Debts Recovery Tribunal-II
1st Floor, Triveni Complex, Abids, Hyderabad.



BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT : HYDERABAD
O.A. No. 328 of 2025
ICICI BANK LIMITED ...Applicant
AND
MOHAMMED SHANAWAZ ...Defendant(s)

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Mohammed Shanawaz
S/o. Mohammed Faqruddin
Age: 37 years; OCC: Private Service R/o. 5-14-115/3, Plot No. 7-1, Indira Nagar, Moula- Ali Secunderabad- 500040, Telangana
Phone No. 8008232198
Also at :
Mohammed Shanawaz
S/o. Mohammed Faqruddin Age : 37 years; OCC: Private Service, C/o. Cognizant Technology Solutions India Private Ltd., DLF Building Gachibowli Hyderabad - 500 032, Telangana
Email id: shah23245@gmail.com
Phone No. 8008232198

Please take the summons in the above O.A. No. 328 of 2025 filed by the Applicant for Recovery of money of Rs. 28,03,768.96 Ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA TELUGU NEWSPAPER", Daily Newspaper Hyderabad District Edition newspaper and posted the matter to.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants, are directed as under;
i)To show cause within thirty days of the service of summons as to why the relief prayed for should not be granted;.
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary cotirse of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by the sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 04.09.2025 at 10.30 am at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 29th Day of July,2025.
(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad.


# సిఎం రేవంత్ ఫొటోతో హాజరు నమోదు

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసిన కలెక్టర్

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులు విధులకు గైర్హాజరు కాకుండా పేషియల్ రికగ్నిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. దీంతో మొబైల్ యాప్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల అటెండెన్స్ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, విధులకు హాజరైన పంచాయతీ కార్యదర్శి స్పాట్ నుంచి సెల్ఫీని తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ, కొందరు ఫేషియల్ రికగ్నేషన్ యాప్లో ప్రతిరోజూ ఒకే ఫోటో పెడుతుండటంతో అనుమానం వచ్చిన అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. చాలామంది పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరుకాకుండా తమ అసిస్టెంట్లకు తమ పాస్‌పోర్టు ఫోటోలతో పాటు మొబైల్ ఫోన్లను ఇచ్చి కార్యాలయాలకు హాజరైనట్లు ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. తాజాగా, జగిత్యాల జిల్లాలో ఓ పంచాయతీ కార్యదర్శి ఏకంగా సిఎం రేవంత్‌రెడ్డి ఫోటోనే అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. దీంతో బుగ్గారం మండల పరిధిలోని చందయాపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి రాజన్నను విధులు నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శుక్రవారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# నేటి నుంచి పాలిసెట్‌లో ఇంటర్నల్ స్లైడింగ్

5న సీట్ల కేటాయింపు.. 6న కాలేజీల్లో చేరాలి

సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా నేటి(శనివారం) నుంచి ఇంటర్నల్ స్లైయిడింగ్‌కి అవకాశం కల్పించారు. వితిన్ ద కాలేజీలో ఇంటర్నల్ స్లైయిడింగ్‌కి ఈ నెల 3 వరకు అవకాశం కల్పించారు. ఇంటర్నల్ స్లైయిడింగ్‌కి ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 5న సీట్ల కేటాయింపు చేయనున్నట్లు సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్ల కేటాయింపు చేసిన వారు ఈ నెల 6లోగా కాలేజీల్లో చేరాలని సూచించారు. పాలీసెట్-2025 కౌన్సెలింగ్ ఫైనల్ ఫేజ్‌లో 18,267 మందికి సీట్ల కేటాయింపు చేశారు. పాలీ సెట్-2025లో 80,949 మంది అర్హత సాధించగా వారిలో మొదటి విడతలో 20,811 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు.. ఫైనల్ ఫేజ్‌లో 9828 ఆప్షన్లు ఇచ్చారు. 18,267 మంది(62శాతం)కి సీట్లను కేటాయించగా మరో 11,182 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 115 ప్రభుత్వ, ప్రైవేట్ డిప్లమా కాలేజీల్లో 29,449 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం సీట్లలో మొదటి విడతలో 62 శాతం సీట్లు కేటాయించారు. 59 ప్రభుత్వ కాలేజీల్లో 14,209 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 11,455 సీట్లను(82శాతం) కేటా యించారు. 56 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 15,240 సీట్లు అందుబాటులో ఉంటే.. వాటిలో 7188 సీట్లను(47.1 శాతం) కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 728 సీట్లను కేటాయించారు.

## డిఇఒలుగా ఐఎఎస్‌లకు అదనపు బాధ్యతలు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మూడు జిల్లాలకు ఐఎఎస్ అధికా రులను జిల్లా విద్యాశాఖాధికారి(డిఈవో)గా అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు అడిషనల్ కలెక్టర్లకు డిఈవోలుగా అదనపు బాధ్య తలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన మెమో నంబర్ 1136ను సిఎస్ జారీ చేశారు. 2019 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన దీపక్ తివారీని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డిఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

2019 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన ఖుష్బూ గుప్తాని ఆదిలాబాద్ జిల్లా డిఈవోగా అదనపు బాధ్యతలిచ్చారు. 2021 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్‌కుమార్‌కి జనగాం జిల్లా డిఈవోగా అదనపు బాధ్యతలు ఇస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు ఐఎఎస్ అధికారులు కూడా ఆయా జిల్లాల్లో లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్లుగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు.

## జూలైలో ఎక్సైజ్ అధికారుల దాడులు.. పెద్దఎత్తున పట్టుబడిన మత్తుపదార్థాలు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** జులైలో నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు, ఎన్‌ఫోర్స్ మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో 376 కేజీల గంజాయిని, 518 గంజాయి మొక్కల్ని, 405 గ్రాముల ఎండిఎం ఏ డ్రగ్స్, 32 గ్రాముల హెరాయిన్, 755 గ్రాము లు ఓపియమ్ నల్లమందు, 28 గ్రాములు చెరస్, 1.7 కేజీల అల్ప్రాజోలంనే కాకుండా మొదటి సారిగా మ్యాజిక్ మష్రూమ్స్‌ను పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

**రెండు వేర్వేరు కేసుల్లో 6.750 కేజీల గంజాయి స్వాధీనం**

ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన రెండు వేర్వేరు కేసుల్లో 6.750 కేజీల గంజాయని అధికారులు పట్టుకున్నారు. ఎస్‌టిఎఫ్ టీమ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది దూల్‌పేటలో కార్వాన్ రోడ్డు నుంచి రహీం పురవరకు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నట్లు గ్రహించి వారి వద్ద నుంచి 2.494 కేజీల గంజాయితో పాటు పాటు రెండు సెల్‌ఫోన్లు, రెండు స్కూటీలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ఇంత వరకు ఏడుగురిపై ఏడిగిరికేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అమర్ సింగ్, ధనంజయ్‌లను అరెస్టు చేయగా తుల్జాసింగ్, కిషన్ వంశీ సోనుభాయ్ తప్పించుకున్నట్లు ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు. అదేవిధంగా మరో కేసులో ఎక్సైజ్ అధికారులు 4.250 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఎస్ఎల్‌బిసి మృతదేహాల వెలికితీతలో నిర్లక్ష్యం తగదు

నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వండి

తెలంగాణ సిఎస్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి దుర్ఘటనలో గల్లంతైన కార్మికుల మృతదేహాలను వెలికితీతలో నిర్లక్ష్యం తగదని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కార్మికుల మృతదేహాల వెలికితీత విషయంలో ఎందుకు ఉదాశీనతతో వ్యవహరిస్తున్నారని నిల దీసింది. నాలుగువారాల్లో మృతదేహాల వెలికితీత చర్యలు చేపట్టి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుకి ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదంలో గల్లంతైన కార్మికులను ఇంతవరకూ ఎందుకు బయటకు తీయలేదంటూ ప్రశ్నించింది. మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన కమిషన్ చర్యలు చేపట్టింది. మృతుల కుటుంబాలకు ఇంకా పరిహారం చెల్లించలేదని లాయర్ రామారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం తవ్వకాలలో ఫిబ్రవరి నెలలో అపశ్రుతి దొర్లింది. ఎనిమది మంది కార్మికులు గల్లంతుకాగా అందులో ఇద్దరి మృతదేహాలు మాత్రమే ఇప్పటి వరకు వెలికితీయడంతో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ప్రమాద ఘటనలో చిక్కు కున్న 8 మంది కార్మికులు మృతి చెందారు. ఘటన జరిగిన నెల రోజుల తర్వాత రెండో మృతదేహాన్ని బయటకుతీసి పోస్ట్‌మార్టం చేసి కుటుంబ సభ్యులకు అంద జేశారు. ఇంకా ఆరుగురి మృతదేహాల ఆచూకీ లభించలేదు. ఘటన జరిగి 150 రోజులు అయినా ఇప్పటికీ కనీసం శవాలను ప్రభుత్వం కనిపెట్టలేకపోయింది. టన్నెల్ లోపల ప్రమాదకర పరిస్థితులు, భారీగా మట్టి పేరుకుపోవటం, నీటి ఊట ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు నీటిపారుదలశాఖ చెపుతూనే మరోవైపు లైడార్ సర్వేతో ఎస్ఎల్‌బిసి తవ్వకంకు సన్నద్ధం అవుతుండటంతో మానవ ప్రాణాలను ఏమాత్రం లెక్కచేయకుండా వ్యవహరిస్తున్న వైఖరిపట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో 94,155 మంది చేరిక

గత యేడాది కంటే పెరిగిన అడ్మిషన్లు..

20వ తేదీ వరకు అడ్మిషన్లకు అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 2025-26లో మొదటి సంవత్సరంలో 94,155 మంది చేరారు. జులై 31 వరకు 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 94,155 మంది చేరారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఇప్పటి వరకు అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లను పెంచాలని ఇంటర్ విద్య డైరక్టర్ ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఇంటర్ విద్యాధికారులు, జూనియర్ లెక్చరర్లు, ఇతర సిబ్బంది అడ్మిషన్లను పెంచేలా చర్యలు తీసుకున్నట్లు ఇంటర్ విద్య శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఈ ఏడాది ఇప్పటి వరకు అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది 83,844 మంది ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరగా.. ఈ ఏడాది ఇప్పటికే 94,155 మంది చేరారు. ఈ ఏడాది 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,47,588 మంది విద్యార్థులను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోగా.. వారిలో ఇప్పటి వరకు 94,155 మంది చేరారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 20 వరకు గడువును పొడిగిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నేపథ్యంలో మరో 18 రోజుల సమయం ఉన్న నేపథ్యంలో లక్ష్యం చేరడం కోసం ఇంటర్ విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తు న్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొ రేట్, ఎయిడెడ్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 20 వరకు కొనసాగించ నున్నారు. జులై 31 వరకు ఉన్న ఇంటర్ అడ్మిషన్ల రెండో విడత షెడ్యూల్‌ను పెంచుతూ ఇంటర్ బోర్డు గురువారం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మే 31తో మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథనయంలో మే 31 వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30తో పూర్తి చేయాలని మే 1న జారీ చేసిన మొదటి విడత షెడ్యూల్‌లో ఇంటర్ బోర్డు కార్యదర్శి పేర్కొన్నారు. జూన్ 27న ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వెలువడిన నేపథ్యంలో జులై 31 వరకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియకి ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను జారీ చేస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీలు, కంపోజిట్ కాలేజీలు అన్ని కూడా ఈ నెల 20 వరకు అడ్మిషన్లు తీసుకోవచ్చని మరోసారి ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది.

# తెరపై కొత్తగా 'స్విమ్‌స్వాప్' మోసాలు

ఒటిపి లేకుండా డబ్బులు మాయం!.. తాజాగా కోల్‌కతాలో ఘటన

క్రెడిట్‌కార్డు లావాదేవీలపై అప్రమత్తమంటున్న సైబర్ నిపుణులు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కొత్తగా క్రెడిట్‌కార్డు మోసాలు తెరపైకి వస్తున్నాయి. సిమ్‌కార్డులు మార్చి బ్యాంకు ఖాతాల నెంబర్లతో 'స్విమ్ స్వాప్' స్కాంలు చేస్తున్నారు సైబర్ నేరస్తులు. ఒకే తరహాలో కాకుండా భిన్న దోపిడీతో డిజిటల్ మాయకు పాల్పడుతున్నారు. తాజాగా కోల్‌కతాలో ఓ వ్యక్తి క్రెడిట్‌కార్డు వాడకపోయినా, ఒటిపి లేకపోయినా బ్యాంకు నుంచి రూ. 9 లక్షలు లూటీ అయింది. ఇదంతా సైబర్ మోసాగాళ్ల పనే అని సైబర్ పోలీసులు నిర్ధారించారు. ఓటీపీ, సీవీవీ, పిన్ నెంబర్లు ఎవరికి చెప్ప కూడదని, దాంతోనే మనకు తెలియకుండానే ఆర్థిక మోసాలు జరుగుతాయని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోల్‌కతాకు చెందిన పంకజ్‌కుమార్‌కు రెండు క్రెడిట్ కార్డులు ఉన్నాయి. అసలు అతను క్రెడిట్ వాడడం లేదు. అయినా రూ.9 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో కంగుతిన్నారు. బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన ఫోన్‌నెంబర్ వేరే వ్యక్తి వాడడంతోనే ఇలాంటి మోసాలు వెలుగుచూస్తున్నాయి. సెల్‌కంపెనీల నుంచి వచ్చే మనకు సంబంధించిన మెసేజ్‌లపై అప్రమత్తమై కస్టమర్ కేర్‌తో పూర్తి వివరాలను తెలుసుకోవడం మేలని చెబుతున్నారు. ఇ-కామర్స్‌లో సైబర్ నేరస్తులు పెద్దఎత్తున కొనుగోలు చేసినట్లు చూపించి మోసాలు చేయడం స్కీం సీక్రెట్ అని చెబుతున్నారు. అదేవిధంగా పాస్‌వర్డ్స్ కూడా వారానికి ఒకసారి మారుస్తుండాలని సూచిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు సీక్రెట్‌గా చేయాలని పేర్కొంటున్నారు. వ్యక్తిగత చిరునామాలు, సంతకాలు ఉండకుండా చూసుకోవాలని, తెలియకుండా వివరాలు ఉపయోగిస్తే పోలీసు లను ఆశ్రయించాలని చెబుతున్నారు. నగదు లావాదేవీల్లో డౌట్లు ఉంటే బ్యాంకు అధికారులను సంప్రదించాలని వెల్లడించారు.

# నేటితో ఎప్‌సెట్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తి

రెండో విడతలో 83,521 మందికి సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా రెండో విడత కౌన్సెలింగ్ నేటి(శనివారం)తో ముగియ నుంది. రెండో విడతలో భాగంగా 83,521 మందికి సీట్లు కేటాయించగా.. కన్వీనర్ కోటా సీట్లలో మరో 7974 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులు శుక్రవారం వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి .. నేటి(ఆగస్టు 2)తో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి కాలేజీల్లో చేరాల్సి ఉంది. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 96,974 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించగా.. సెకండ్ పేజ్‌లో 68,630 మందికి వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రంలో 91,495 కన్వీనర్ కోటా సీట్లు ఉండగా వారిలో వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 83,521 మందికి సీట్ల కేటాయింపు చేశారు. మరో 7974 సీట్లు ఖాళీగా ఉన్నాయి. 20 యూనివర్సిటీ కాలేజీల్లో 6198 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 4942 సీట్లను (84.30శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 1386 సీట్లు ఉంటే వాటిలో 1380 సీట్లను(99.5 శాతం) కేటాయించారు. 155 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 83,713 సీట్లు అందుబాటులో ఉండగా అందులో 77,158 సీట్లను (92.1 శాతం) కేటాయించారు. మొత్తం 178 కాలేజీల్లో 91,495 సీట్లు అందు బాటులో ఉంటే వాటిలో 83,521 సీట్లను (91.2 శాతం) కేటాయించారు.

# రాష్ట్రంలో అక్రమార్కుల భరతం పడుతున్న ఎసిబి

7 నెలల్లో 148 కేసులు నమోదు..145 మంది అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సర్కారీ విభాగాల్లో అక్రమార్కుల భరతం పట్టడంలో ఎసిబి దూకుడు కొనసాగుతూనే వుంది. ఈ ఏడాది జూలై నెల వరకు రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి వ్యవహారాలకు సంబంధించి 148 కేసులు నమోదుద కాగా ఈ సందర్భంగా 145 మంది ప్రభు త్వ ఉద్యోగులతో పాటు వీరితో పాటు వుండే అవుట్ సోర్సింగ్ సిబ్బంది అరెస్టయ్యారు. ఎసిబి డిజి విజయ్‌కుమార్ దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో అవినీతిని నిర్మూలించేందుకు ఎసిబి తరపున విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని, ప్రజల్లో చైత న్య కార్యక్రమాలు చేబడుతున్నామని ఆయన తెలిపారు. ఎక్కడైనా అవినీతి జరిగితే వెంటనే 1064కు తెలపాలని ఆయన కోరారు. గత జూలై నెల లో రాష్ట్ర వ్యాప్తంగా 22 అవినీతి కేసులు నమోదుకాగా ఈ సందర్భంగా రెడ్ హ్యాండెడ్ ట్రాప్‌కు సంబంధించి 5.75 లక్షల రూపాయల నగదు, 11.50 కోట్ల రూపాయల అక్రమాస్తులు జప్తు చేశామని ఆయన తెలిపారు. దీంతో పాటు రవాణా శాఖ చెక్‌పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద తనిఖీలు చేబట్టామని ఈ సందర్భంగా లెక్కలో రాని లక్షా 49 వేల రూపాయల నగదు జప్తు చేశామని ఎసిబి డిజి తెలిపారు. ఈ ఏడాది జూలై నెలాఖరు వరకు రాష్ట్రంలో అవినీతికి సంబంధించి 148 కేసులు నమోదుద చేయగా 148 మంది అరెస్టయ్యారని ఆయన వెల్లడించారు. ఇదే సమ యంలో రెడ్ హ్యాండెడ్ ట్రాపుల్లో 30.32 లక్షల రూపాయల నగదు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 39 కోట్ల రూపాయల అక్రమాస్తులను జప్తు చేసినట్లు ఎసిబి డిజి తెలిపారు. నీటి పారుదల శాఖలో అవినీతి ఇంజనీర్లు మురళీధర్ రావు, నూనె శ్రీధర్, హరిరాం నాయక్‌లను ఎసిబి అధి కారులు అరెస్టు చేయగా వీరి వద్ద వెయ్యి కోట్ల రూపాయల అక్రమాస్తులున్నట్లు గుర్తించారు. వీరికి సంబంధించిన కేసులను ప్రత్యేకంగా విచారిస్తున్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

నోటీస్ నం. C/C/YTSK/2025, తేది: 30.07.2025

PUB/0937

భారత రాష్ట్రపతి తరపున, సికింద్రాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ గారు రిజర్వ్ మరియు అన్‌రిజర్వ్ టిక్కెట్ల జారీ కోసం వివిధ ప్రదేశాలలో ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా **యాత్రి టికెట్ సువిధ కేంద్రం** (YTSK) స్థాపన మరియు కార్యకలాపాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.
భారతీయ రైల్వేలకు చెందిన రైల్ ట్రావెల్ సర్వీసెస్ ఏజెంట్లు (RTSAs), రైల్ ట్రావెల్ ఏజెంట్లు (RTAs) మరియు జనసాధారణ్ టికెట్ బుకింగ్ సేవకులు (JTBS) సహా అన్ని అధీకృత రైల్వే టికెటింగ్ ఏజెంట్లు మరియు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) నియమించిన టికెటింగ్ ఏజెంట్లు, కనీసం రెండు (2) సంవత్సరాలు పనిచేస్తున్న/ప్రస్తుతం పనిచేస్తున్న వారు YTSK పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
దరఖాస్తులను సూచించిన మరియు సంబంధిత డాక్యుమెంట్లను సీల్డ్ కవర్‌లో జతచేసి "రిజిస్టర్డ్ పోస్ట్ అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ" ద్వారా పంపవచ్చు లేదా సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కార్యాలయం, 1వ అంతస్తు, సంచాలన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, సికింద్రాబాద్ 500025 కి స్వయంగా అందజేయవచ్చు. సీల్డ్ కవర్‌పై "యాత్రి టికెట్ సువిధ కేంద్రం (YTSK) స్థాపన మరియు నిర్వహణ కోసం దరఖాస్తు" అని వ్రాయాలి.
**దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 28.08.2025న 15.00 గంటలకు** లేదా అంతకు ముందు. **28.08.2025న 15.00 గంటల** తర్వాత పోస్ట్ ద్వారా లేదా స్వయంగా అందిన దరఖాస్తులు అంగీకరించబడవు మరియు అలాంటి జాప్యానికి రైల్వే పరిపాలన బాధ్యత వహించదు. దరఖాస్తులు **28.08.2025న 15.30 గంటలకు** తెరవబడతాయి.
ఈ పథకం వివరాలు, దరఖాస్తు ఫారంతోసహా ప్రదేశాలు, ప్రమాణాలు, అర్హత, నిబంధనలు మరియు షరతులు దక్షిణ మధ్య రైల్వే అధికారిక వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో ఉంచబడ్డాయి. మరిన్ని వివరాల కోసం మీరు ఏ పని దినంలోనైనా దిగువ సంతకందారు వారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.
A1156
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్



మిగిలిన షేర్‌హోల్డర్ల యొక్క గమనిక నిమిత్తం ఎగ్జిట్ ఆఫర్
స్కూటర్స్ ఇండియా లిమిటెడ్
(ఒక భారత ప్రభుత్వ సంస్థ), కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : L25111UP1972GOI003599
నమోదిత కార్యాలయం : 3/481, 1వ అంతస్తు, వికల్పఖండ్, గోమ్తీ నగర్, లక్నో, ఉత్తర ప్రదేశ్, ఇండియా-226010: ఫోన్ నం: 0522-3119593
వెబ్‌సైట్ : www.scootersindialimited.com, ఇ-మెయిల్ ID : csscootersindia@gmail.com

ఈ ఎగ్జిట్ ఆఫర్ పబ్లిక్ ప్రకటన ("ఎగ్జిట్ ఆఫర్ PA") ఆగస్టు 17, 2024న BSE లిమిటెడ్ ("BSE") నుండి స్కూటర్స్ ఇండియా లిమిటెడ్ ("కంపెనీ") యొక్క స్వచ్ఛంద డీలిస్టింగ్‌కు సంబంధించి ... రూ. 31.78/ ఎగ్జిట్ ధర ("ఎగ్జిట్ ధర") ... నవంబర్ 16, 2024 మరియు జనవరి 04, 2025 మరియు ఏప్రిల్ 05, 2025 తేదీలలో "ఎగ్జిట్ ఆఫర్ PA"తో పాటు ... జూన్ 05, 2024 నాటి 2024060551 ... జూన్ 20, 2024 నుండి BSE ... BSE ... జూన్ 20, 2024 నుండి జూన్ 19, 2026 వరకు లేదా SEBI ... రూ. 31.78/ ... ఏప్రిల్ 21, 2025 నాటి SEBI లెటర్ నెం. SEBI/HO/CFD/RAC/DCR2/P/OW/2025/11275/1 ప్రకారం, ... జూన్ 19, 2025 వరకు) ...
... www.scootersindialimited.com నుండి ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్‌తో పాటు ("ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్"), రిజిస్ట్రార్ వెబ్‌సైట్ www.skylinerta.com నుండి మరియు ఆఫర్ మేనేజర్ వెబ్‌సైట్ www.corporateprofessionals.com నుండి ...

(ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్ చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
(ఎగ్జిట్ దరఖాస్తు ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
(షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)

ప్రదేశం : లక్నో
తేదీ : ఆగస్టు 02, 2025
ఎక్వైరర్ తరపున మరియు కొరకు
సం/- నవీన్ కౌల్
(అధీకృత సంతకందారులు)

వార్త

ఒక్కొక్కప్పుడు మన సందేహాలే మనలను మోసం చేస్తాయి. సందేహం కలిగినప్పుడు భయం వల్ల మన ప్రయత్నాన్ని విరమిస్తాం. మనం సాధించగలిగే దాన్ని సైతం పోగొట్టుకుంటాం.

-ఫిలిప్స్

# తిలాపాపం తలా పిడికెడు

**కల్తీ కల్లు విషయం ప్రత్యేకంగా నిఘా వేసి, దర్యాప్తు చేయాల్సిన పనిలేదు. ఆ ప్రాంతంలో చెట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత కల్లు వస్తుంది? ఎంత అమ్ముతున్నారు? అని పరిశీలిస్తే తెలుస్తుంది. అయినా పాలకులు కళ్లు మూసుకుంటున్నారు. ఫలితంగా ఎందరో నిరుపేదలను ఈ కల్తీ కబళిస్తున్నది. ఇదే సమయంలో కల్తీకల్లుతోపాటు స్వచ్ఛమైన కల్లును కూడా నిషేధించడం ఏమాత్రం సమంజసం కాదు. కల్లుగీత పరిశ్రమపై తెలుగు రాష్ట్రాల్లోనే లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒక్క కల్లు కల్తీయేకాదు మద్యం, పాలతోసహ ఉప్పు, పప్పు నూనె లాంటి నిత్యావసర సరుకుల్లో కల్తీని మట్టుపెట్టేందుకు పాలకులు త్రికరణ శుద్ధిగా ప్రయత్నం చేయాలి. అన్నింటి కంటె ముఖ్యంగా కల్తీవల్ల జరుగుతున్న అనర్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. ఈ బాధ్యతంతా ప్రభుత్వంపైనే పెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజాసంఘాలు అంతా నడుం బిగించాలి.**

దామెర్ల సాయిబాబ

మాదకద్రవ్యాలు... మా నవజాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాలను పారద్రోలే విషయంలో ఆరాటమే కానీ, త్రికరణ శుద్ధిగా పోరాటం చేయడం లేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలతో మాదకద్రవ్యాలు తోడు కావడంతో దేశంలో కోట్లాది కుటుంబాలు చితికిపోతున్నాయని, లక్షలాది మంది మంచానికే పరిమితమై కృంగికృశించి మరణిస్తున్నారనే విషయం పాలకులకు తెలియంది కాదు. ఇప్పుడు కల్తీకల్లు ఈ వ్యసనాలకు తోడైంది. ఈ కల్తీకల్లు కారణంగా కూడా అనేక మంది రోగాలబారిన పడి చిక్కి శల్యమై ఎందరో అసువులు బాస్తున్నారు. వాస్తవంగా చూస్తే స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందనే విషయం వైద్య నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు. కానీ ఆ స్వచ్ఛమైన కల్లు స్థానంలో కల్తీకల్లు చేరుకొంటున్నది. సాగు విస్తరణ, నగరీకరణతో తాటి ఈత చెట్లు కనుమరుగు కావడంతో ఉత్పత్తి అయ్యే కల్లు తగ్గిపోతుండడంతో కల్తీ కల్లు పెరిగిపోతున్నది. అటు మద్యంలోనూ, కల్లులోనూ కల్తీ జరుగుతున్న విషయం పాలకులకు తెలియందికాదు. నియంత్రించేందుకు చట్టాలు చేస్తున్నారు, ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. కొందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయవచ్చు. అందరిని ఎల్లకాలం మోసం చేద్దామనుకుంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను దగా చేసి ఇబ్బందులపాలు చేసిన ఎందరో చక్రవర్తులు, రాజులు, ప్రజాస్వామ్యంలో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజా అవసరాలను గుర్తించి, ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చి ఆదరాభిమానాలు పొంది, వారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నవారు చిరస్థాయిగా మిగిలిపోతారు. మాదకద్రవ్యాల విషయంలో అటు కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎంత మంది అధికారులను నియమిస్తున్నా నిందితులను పట్టుకొని జైళ్లలో పెడుతున్నా అది ఏమాత్రం ఆగడం లేదు. అంతకంతకు పెరుగుతున్నది. యేటా దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల మత్తుపదార్థాలు పట్టుబడుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏమాత్రం తక్కువ లేదు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, గౌరవప్రదమైన ఉద్యోగాలు చేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ మత్తుకు అలవాటు పడడమే కాదు అందులో కొందరు వ్యాపారం కూడా చేస్తున్నారు. ఈ వారంలో కూడా కోట్లాది రూపాయల మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. ఇక మద్యం విషయంలో పాలకులు పైకి ఏమిచెప్తున్నా ఆదాయం కోసం ప్రోత్సహిస్తున్నారనేది కాదనలేని వాస్తవం. గతంలో దశలవారీగా తగ్గిస్తామని చెప్పుకున్న పెద్దలే అంచెలంచెలుగా పెంచుతున్నారు. ఒకనాడు కేవలం వందకోట్ల ఆదాయంతో ప్రారంభమైన మద్యం వ్యాపారం నేడు రెండు రాష్ట్రాల్లో కలిసి యాభై,అరవై వేల కోట్లకుపైగా చేరుకున్నది. తెలుగు రాష్ట్రాల్లో నాటుసారా, గుడంబా, అక్రమంగా తయారయ్యే చీప్ లిక్కరు అంతా కలిపి ఎనభైవేల కోట్లకు పైగా ఉంటుందని అనధికార అంచనా. ఇది లక్ష కోట్లకు చేరుకోవడానికి ఎంతో కాలం పట్టకపోవచ్చు. కొన్ని రాష్ట్రాలకు మద్యం ఆదాయమే మహాప్రసాదంగా పరిణమించింది. ఇక మద్యం సరే. సారాను నిషేధించారు. కానీ ఏమాత్రం అమలవుతున్నది? మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉండొచ్చు. కానీ సారా దొరకని గ్రామం లేదు. గుడంబ, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా రూపుదిద్దుకున్నది. ఈ అక్రమ సారాను నియంత్రించేందుకు పాలకులే చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ప్రజారోగ్యానికి అత్యంత హాని చేస్తున్నది

## ఒక్క మాట

ఈ చీప్ లిక్కరే. ముఖ్యంగా పేదల జీవితాలు ఈ చీప్ లిక్కర్‌తో చితికిపోతున్నాయి. లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ధూమపానాన్ని నియంత్రించే విషయంలో కూడా పాలకులు విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండెజబ్బులు, మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందువని ఎందరో వైద్యనిపుణుల అధ్యయనంలో వెల్లడయింది. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు అలవాటుపడ్డారు. ఇందులో బీడీలు తాగేవారే అధికంగా ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారుతున్నది. ఇటీవల కాలంలో పదమూడు, పద్నాలుగేళ్ల వయస్సులోనే ఆరంభం కావడం ఆందోళన కలిగించే అంశం. కేవలం ధూమపానం వల్లనే దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనేక రోగాలబారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు. సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిదివందలకుపైగా ప్రమాదకర విషవాయువులు ఉన్నాయి, ఇవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయి. అయితే మరోకపక్క బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది కాదనలేని వాస్తవం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిజన కుటుంబాలకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా బీడీ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం వివేకం అనిపించుకోదు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే జీవనోపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను,వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒక పరిష్కారం లభిస్తుంది. ఇక కల్తీ కల్లు కూడా ప్రజారోగ్యాన్ని కాటు వేస్తున్నది. గత నెలలో తెలంగాణలో కల్తీకల్లుకు తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇరవైమంది వరకు ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకొని బయటపడ్డారు. అటు చీప్ లిక్కర్‌తో కానీ కల్తీ కల్లుకు బలైపోతున్నవారిలో అధికశాతం రెక్కాడితే డొక్కాడని నిరుపేదలే. నీళ్లలో తెల్లగా నురుగు వచ్చేలా రసాయినికాన్ని కలిపి కల్లులా కనపడేలా తయారు చేసి మత్తు కోసం డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి మత్తుపదార్థాలను కలుపుతున్నారు. ఇది సహజ సిద్ధమైన చెట్లనుండి వచ్చే కల్లు కాదని తెలిసినా కల్లుకు అలవాటు పడినవారు సేవిస్తున్నారు. పరిస్థితి ఎలా వచ్చిందంటే ఇదే అసలుసిసలైన కల్లుగా భావించి సేవించేవారు ఎక్కువైపోతున్నారు. ఈ కల్తీ కల్లు తాగకపోతే జీవించలేని పరిస్థితుల్లో కొందరు కొట్టుమిట్లాడుతున్నారు. కరోనా సమయంలో ఈవిషయం బయట పడింది. కల్తీకల్లు దొరకక ఆసుపత్రుల పాలైనవారెందరో ఉన్నారు. ఎలాంటి చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో డాక్టర్ల సలహాలతోనే కల్తీకల్లు తాగిస్తేనే మామూలు మనుషులయ్యారు. కల్తీకల్లు గూర్చి పాలకులకు తెలియంది ఏమి లేదు. చట్టాలెన్నో ఉన్నాయి. అయినా చర్యలు తీసుకోరు. వారికున్న కారణాలు వారికి ఉన్నాయి. సహజ సిద్ధంగా తాటి, ఈత చెట్ల నుండి వస్తున్న స్వచ్ఛమైన కల్లును డాక్టర్లుతోసహా ఎవరు వ్యతిరేకించడం లేదు. గతంలో తాచు పాముల్లా ఉండే ఎక్సైజ్ అధికారులంటే భయభక్తులుండేవి. కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా వారు కూడా తమ చిన్నిపొట్టకు శ్రీరామరక్ష అన్నట్లు వానపాముల్లా మారి కాలక్షేపం చేస్తున్నారు. దీంతో అటు మద్యంలోనూ, ఇటు కల్లులోనూ కల్తీ విజృంభించిపోతున్నది. కల్తీ కల్లు విషయం ప్రత్యేకంగా నిఘా వేసి దర్యాప్తు చేయాల్సిన పనిలేదు. ఆ ప్రాంతంలో చెట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత కల్లు వస్తుంది? ఎంత అమ్ముతున్నారు? అని పరిశీలిస్తే తెలుస్తుంది. అయినా పాలకులు కళ్లు మూసుకుంటున్నారు. ఫలితంగా ఎందరో నిరుపేదలను ఈ కల్తీ కబళిస్తున్నది. ఇదే సమయంలో కల్తీ కల్లుతోపాటు స్వచ్ఛమైన కల్లును కూడా నిషేధించడం ఏమాత్రం సమంజసంకాదు. కల్లుగీత పరిశ్రమపై తెలుగు రాష్ట్రాల్లోనే లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైఉంది. ఒక్క కల్లు కల్తీయేకాదు మద్యం,పాలతోసహఉప్పు, పప్పు నూనె లాంటి నిత్యావసర సరుకుల్లో కల్తీని మట్టుపెట్టేందుకు పాలకులు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయాలి. అన్నింటికంటె ముఖ్యంగా కల్తీవల్ల జరుగుతున్న అనర్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. ఈ బాధ్యతంతా ప్రభుత్వంపైనే పెట్టకుండా స్వచ్ఛందసంస్థలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజాసంఘాలు అంతా నడుం బిగించాలి. ●

# పెరుగుతున్న వైట్‌కాలర్ నేరాలు

కులం,మత వర్గ, లింగ బేధాలు లేకుండా అందరికీ సమానంగా వర్తించే విధంగా మనపెద్దలు రాజ్యాంగాన్ని, శాసనాలను రూపొందించారు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో లేక దక్షిణలకు ప్రలోభపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారేమోననిపిస్తున్నది. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు ప్రజలను వంచించి కోట్లాదిరూపాయలు దోచుకుంటూ తప్పించుకోగలుగుతున్నారు. ప్రధానంగా వైట్‌కాలర్ నేరాలు అంతకంతకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. సమర్థవంతంగా దర్యాప్తు జరిపి పటిష్టరికార్డులు తయారు చేసి తిరుగులేని సాక్ష్యాలతో న్యాయస్థానాల ముందుపెట్టి నేరాన్ని రుజువు చేయడంలో విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా, సకాలంలో ముందుకు నడవకపోతే, మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయే విధంగా రికార్డులు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఎంతోకాలంగా వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అధికారులు సకలఅవస్థలు పడి కోర్టుల ముందు రుజువుకు సర్వంసిద్ధం చేసినప్పుడు కొందరు రాజకీయ నాయకులు మోకాలొడ్డుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తు న్నాయి. ఇలాంటి చర్యలతో సమర్థవంతంగా దర్యాప్తు చేసే అధికారుల్లో నిస్పృహ పెరుగుతున్నది. దీంతోపాటు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలానుగుణంగా సవరించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. తాజాగా కేంద్ర ప్రభుత్వం కొన్ని సంస్కరణలను, సవరణలుచేసి అమలు చేస్తున్నది. ఇంకా ఎన్నో మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆ విషయాన్ని అలా ఉంచితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏ మేరకు నిస్పక్షపాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేద తేడా లేకుండా ఎంతమేరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండాలేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రధానంగా దేశంలో బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాది మంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవిత కాలంపాటు సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదన అరణ్యరోదనగా మారి కొందరు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే గత దశాబ్దకాలంలో దాదాపు ముప్పైఐదువేల కోట్ల రూపాయ లకుపైగా ఫైనాన్స్‌కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో కొన్ని మాత్రమే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. రికవరీల మాట ఎలాఉన్నా నిందితుల్లో పదిశాతం మందిపై కూడా పటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇరవైఐదు లక్షలు మొదలు ఐదువందల కోట్లవరకు మోసం చేసిన ఫైనాన్స్‌కంపెనీల యజమానులపై చర్యలు తీసుకోవడంలో నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలను కొట్టివేయలేం. దేశంలో నిత్యం ఏదోఒకచోట ఈ దగా జరుగుతూనే ఉన్నది. ఇక ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్ల అమ్మకాలలో ఘరానా మోసం చేసిన పెద్దలెందరో నిర్భయంగా తిరు గుతున్నారు. అందుకే ఒకరిని చూసి ఒకరు పోటీపడి ప్రజలను మోసం చేసి కోటీశ్వర్లుఅవుతున్నారు. ఈ విష యంలో బాధితులు కొందరు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా నమోదు చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. మమ్మల్ని అడిగి ఇచ్చావా? ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవాడివా? అంటూ సవాలక్ష ప్రశ్నలు సంధించి బాధితులు మళ్లీ పోలీసు స్టేషన్ మెట్లెక్కకుండా చేసి పంపుతున్నారు. అంతే కాదు మరికొన్ని సందర్భాల్లో ఇది సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీలు లేదని కోర్టుకు వెళ్లి కేసులు పెట్టి పరిష్కరించుకోమని సలహా ఇస్తున్నారు. ఒకవేళ ఏదైనా కారణాలతో కేసు నమోదు చేయాల్సివస్తే సాక్ష్యా ధారాలున్నాయా? లేవా? రికార్డు పరిశీలించి దర్యాప్తులో సంతృప్తి చెందితేనే నమోదు చేసి చర్యలు చేపడుతున్నా రు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పనిచేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసుల బాధ్యతలు కూడా పెరిగిపోయాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా వివిపిల బందో బస్తులో ఎక్కువ సమయం గడపాల్సి వస్తున్నది. ఆయా ప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా, అరాచకశక్తులు విజృంభించడంతోపాటు శాంతిభద్రతలు క్షీణించినా పర్వా లేదు కానీ ఒక్క వివిపి పర్యటనలో ఏమాత్రం పొరపాటు జరిగినా తమ ఉద్యోగానికి ముప్పు తప్పదన్న భావనతోనే ప్రజాసమస్యలు విస్మరించి నేతల సేవ వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు ఇలాంటి ఫిర్యా దులు నమోదు చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఇక నిరుద్యోగులను మోసం చేసే దళారులు ఎక్కువైపోయారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనో, విదేశాలకు పంపిస్తామనో లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటూ పరారవుతున్న దగాకోరులు ఎక్కువవుతున్నారు. ఇలా ఒకటనికాదు. ఎక్కడ వీలైతే అక్కడ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా మోసపోయేది అధికశాతం మధ్యతరగతి ప్రజలే. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాల కులు ఈనేరాలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

దేశాభివృద్ధి అంటే ఎత్తయినఅద్దాల మేడలు నిర్మించడంకాదు. పౌరుని నైతికాభివృద్ధే అసలైన అభివృద్ధి.



మహాత్మా గాంధీ

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలు అన్వేషించాలి.



రాబర్ట్ ఆంథోనీ

# ప్రజావాక్కు



### కృత్రిమ మేధ ప్రభావం ముప్పు తప్పదా!

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్నఒకప్పటి మాట.ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావంతో మారిపోతుంది. ఏరోజు ఉద్యోగం ఉంటుందో,ఏరోజు ఊడుతుందోతెలియని పరిస్థితి నెలకొంది. ఈ మధ్యనే టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టి.సి.ఎస్) దేశవ్యాప్తంగా 12వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నట్లుగా ప్రకటించింది. ఒక్కటి.సి.ఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్.సి.ఎల్, వంటి సంస్థలదీ ఇదే బాట. ఉద్యోగులను తొలగించడంలో ఒక దానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇటువంటి ప్రకటనలతో ఉద్యోగుల్లో కలకలం సృష్టిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం రోజురోజుకు పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్,టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. భారీ లాభాలు వస్తున్నప్పటికీ పలు సంస్థలు ఉద్యోగులపై వేటు చర్యలు చేపడుతున్నాయి. మనదేశంలో కొంత కాలంగా టెక్ రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ప్రాథమిక తరగతులకు వర్ణమాల

ప్రభుత్వం ప్రాథమిక తరగతులకు తెలుగు పాఠ్యాంశంగా వర్ణమాల కనీసం ఐదో తరగతి వరకు ముద్రించాలి. అలాగే తెలుగు హిందీ పాఠ్యాంశంగా ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి దాకా వర్ణమాల,గుణింతాలు పాఠ్యాంశంగా పెట్టడం మంచిది. ఎందుకంటే ఒకటి రెండు తరగతుల్లో విద్యార్థులు పూర్తిగా వర్ణమాల, గుణింతాలు నేర్చుకున్నా మరిచిపోయే అవకాశం ఉంటుంది. కావున ప్రభుత్వం తెలుగు హిందీ సబ్జెక్ట్‌లకు వర్ణమాల ముద్రించాలి.

- డి చాంద్ బాషా,కర్నూలు

### బదలీల తర్వాత పదోన్నతులు ఇవ్వాలి

ఉపాధ్యాయుల పదోన్నతి షెడ్యూల్స్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. గతంలో పదోన్నతి పొంది వివిధ జిల్లాల్లో చేస్తున్న వారికి ఇబ్బందిగా ఉంది. ఎప్పుడైనా బదలీల తర్వాత పదోన్నతి ఇస్తారు. ప్రస్తుతం కేవలం పదోన్నతులు ఇవ్వటం వల్ల జూనియర్ అయిన వారికి అనుకూలం అయిన పాఠశాలలు దొరుకుతాయి. వీనిని దృష్టిలో పెట్టుకొని ముందుగా బదలీల ప్రక్రియ తర్వాత పదోన్నతులు ఇవ్వాలి. బదలీలు కాకముందు ఇవ్వకూడదు.

-కామిడీ సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

### దూరమవుతున్న స్నేహ వాస్తం

పార్లమెంటులో అధిక సమయం ఆపరేషన్ సిందూర్ పై చర్చలు ప్రభుత్వ ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా జరిగాయి. ఫలితం ఏమొచ్చింది? కాలం వృధా అయింది. ప్రతి పక్షాలకు శాంతి లభించింది. పి.ఎమ్. నరేంద్ర మోడీ తన ధోరణితో కాంగ్రెస్‌పై ఆరోపణలు చేసారు. హోమ్‌మంత్రి వర్యులు అమితషా మరొక మెట్టు ఎక్కి కాంగ్రెస్ కాశ్మీర్‌లోని పాకిస్థాన్ అన్యాయంగా ఆక్రమించిన స్థలాన్ని భారత్‌లో కలపలేక పోయిందనీ అన్నారు. ఆ పని మేము చేసి చూపిస్తాం అన్నారు. ఈ పదకొండేళ్ళ కాలంలో ఈ విలీనానికికాలం సరిపోలేదా? డబ్బైఐదేళ్ళ సుదీర్ఘ సర్వసత్తాక ప్రజాస్వామ్యంలో పాక్ నుండి మన భూభాగాన్ని తిరిగి సాధించుకోలేక పోయామంటే పాకిస్థాన్ యీ విషయంలో ఎంత బలమయిన దేశమో చెప్పకనే చెబుతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మొక్కలు నాటాలి

దేశంలో పేదరికం కంటే ఆర్థిక అసమానతలు ప్రధాన సమస్య అనేది విదితమే. అయితే ఈఆర్థిక అసమానతలు పోగొట్టడానికి ఉపాధి హామీ ఏమైనా ప్రయత్నం గత రెండు దశాబ్దాలుగా చేసినదా అంటే అవుననే సమాధానమే వస్తుంది. అది భూమి చదును కార్యక్రమాలవల్ల కావొచ్చు సరిహద్దు కంధకాల ద్వారా కావొచ్చు. అయితే ఉపాధి హామీని పండ్ల తోటల పెంపకంలో విశ్లేషణ చెయాలి. రైతులకు నష్టం జరగకుండా ఉండాలి అంటే అంతర పంటలు వేయాలి. అంటే గేట్ల వెంబడి చెట్లు నాటడం మాత్రమే సరైన చర్య అయితే ఎకరానికి 40 చెట్లు నాటడం ద్వారా రైతులు 3 ఏండ్ల పాటు ఉపాధిని నిరంతరాయంగా చేయగలుగుతారు.అంత మాత్రమే కాదు వాటికి వేసే ఎరువుల ద్వారా కూడా వారికి డబ్బులు వచ్చే అవకాశం ఉంది. కావున పండ్ల తోటలు తెలంగాణకు ఉపయుక్తంగా ఉండగలవు.

-భారత అవినాష్,జనగామ

### బస్సులకు ఫిట్ నెస్ తప్పనిసరి

పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదు. మంచి విద్యాసంస్థ ఎంపికతో పాటు తమ పిల్లల సురక్షిత ప్రయాణం కోసం ప్రైవేట్ సంస్థల వ్యాన్లు, బస్సుల ఫిట్నెస్, అనుభవజ్ఞులైన డ్రైవర్లు,నిబంధనల మేరకు వాహనం ఉన్నదా లేదా కూడా తప్పక ఆరాతీయాలి. విద్యార్థులు కూర్చునేందుకుఅనువైనసీట్లు, ప్రథమ చికిత్స పెట్టె, పిల్లలు బస్సు ఎక్కే, దిగేసందర్భాల్లో బస్సు క్లీనర్ అందుబాటులో ఉండాలి.

-సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'అమృత్ కాలా'నికి అమెరికా నుంచి అపశకునాలు!

డా.డి.వి.జి. శంకరరావు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ వాణిజ్యంపై విరుచుకుపడ్డాడు. భారత్ నుండి తమకు వస్తున్న దిగుమతులపై ఇరవై ఐదు శాతం పన్ను విధించడంతోబాటు అదనంగా పెనాల్టీ కూడా వేస్తానంటున్నాడు. అది కూడా తక్షణమే అమలులోకి తీసుకు వచ్చాడు. భారత్ తాను అమెరికా ప్రయోజనాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా రష్యా, ఇరాన్‌లతో వాణిజ్య సంబంధాలు కొనసాగించడం ఈ నిర్ణయాలకు కారణాలుగా చెప్తున్నా, అంతకు మించిన కడుపుమంట, కంటగింపు నేపథ్యంగా ఉన్నట్టున్నాయి. అందుకనే పన్నులు పెంచడంతో బాటు మన దేశపు ఆర్థిక వ్యవస్థని ప్రాణం లేనిదిగా అభివర్ణించాడు. ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్న పెద్ద ఆర్థికవ్యవస్థ, జీడీపీ వృద్ధిఆరు శాతం పైగా కొనసాగుతున్న వేళ అలా అభివర్ణించడం పిచ్చితనమే. వీటి వెనుక అసలు కారణం భారత్ తన దేశ ప్రయోజనాల కోణంలో స్వతంత్రంగా వ్యవహరించడమే. అమెరికా కోరుకున్నట్లు వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతులకు సుంకాలు తగ్గిస్తే,అవి వెల్లువెత్తి మన దేశవాళీ పంటలు, పాలు నష్టపోతాయి.రక్షణ కొరవడుతుంది. అక్కడ ఆ దేశం వాటికి భారీ రాయితీలు సమకూర్చి ప్రోత్సహించడం వల్ల, అంత చౌకగా ఇక్కడ రైతు పోటీకి నిలువలేడు. ఒకసారి వాడు మార్కెట్ ఆక్రమించుకున్నాక, మోనోపలీ సాధించి తర్వాత తనప్రతాపం చూపిస్తాడు.అప్పటికి ఇక్కడి స్వయం సమృద్ధి ధ్వంసం అవుతుంది.అందుకనే ఈ విషయంలో బేరసారాలకు తావులేదు.రష్యా నుండి ఆయుధాలు,ఇంధనం కొనుగోలు చెయ్యడం. అది భారత్ ఇష్టం.పైగా ఒకప్పటి కన్నా ఇప్పుడు ఆదేశం నుండి కొనుగోళ్లు కూడా తగ్గాయి. పోనీ అమెరికా చెప్పినట్టు మన లాభం వదులుకొని అమెరికాతోనే అంటకాగితే ఫలితం ఏమైనా ఉందా? అమెరికాలో భారతీయుల ఉద్యోగాలతో సహా అన్నింట్లో కోత.పక్కన శత్రువుగా తయారైన పాకిస్థాన్‌ని పెంచి పోషించడం,దాని భారత వ్యతిరేక విధానాన్ని సమర్థించడం. ఏదేమైనా అమెరికా సుంకాలు,ఆంక్షలు భారత్‌ని కలవరపెట్టరాదు. మరింత బలం పొందడానికి, ప్రపంచ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోడానికి కారణం కావాలి. ఈ మధ్య బ్రిటన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రీతిలోమిగతా దేశాలతో ప్రయత్నించాలి. దేశంలోని వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలి. స్వతంత్ర భారతానికి అమృత కాలం అని భావిస్తున్న 2047లోగా అభివృద్ధి యాత్రలో, రాగల అడ్డంకుల్ని ఊహించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.ముఖ్యంగా అమెరికాతో వాణిజ్యంలో సమాన స్థాయిలో బేరసారాలు సాగించాలి. బెదిరింపులకు, వడ్డింపులకు సై అంటే సై అనాలి.ఎందుకంటే ట్రంప్ దంతా మేకపోతు గాంభీర్యమే. చైనాని ఇలానే బెదిరించి వెనక్కు తగ్గలేదా! ●

# మహిళలకు వెలుగు దారి చూపే 'ఉచిత బస్సు'



వాసంశెట్టి సుభాష్

ఆడపడుచులకు ఆయనే పెద్దన్న..మహిళలు కన్న స్వప్నాలను నిజం చేస్తున్న కుటుంబ పెద్ద. వనితలకు చేయి అందించితోడుగా నిలిచే బంధువు ఆయన. నిన్నటి కష్టాలు మరచిపోయి చిరునవ్వులతో హాయిగా తమ కాళ్ల మీద తాము నిలబడేటట్టు చేయాలనే తపన పడే నాయకుడు. ఆయనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఉచితబస్ ప్రయాణం హామీ అమలు దిశగా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళా సాధికారతకు మార్గమన్న ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. నాలుగు గోడల మధ్య ఇంటికే బందీ అయిన మహిళలకు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే స్వేచ్ఛఉచిత ఆర్టీసీ బస్సు వల్ల లభించనుంది.గ్రామీణ, పేద, మధ్య తరగతి మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండదు. బాల్యంలో తండ్రి, పెళ్లి అయ్యాక భర్త, వృద్ధాప్యంలో కన్న బిడ్డలపై ఆధారపడి ఉండాలి. ఏ అవసరానికి ఎక్కడికి వెళ్లాలన్నా, ముందే మొరపెట్టుకోవాల్సిందే. ఆర్థిక పరిస్థితి అనుకూలించి అవసరమైన డబ్బులు ఉంటేనే మహిళలు ఇంట్లో నుంచి వెళ్లగలుగుతారు. ఈ బానిస బంధాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా బద్దలుకొట్టారు. ప్రయాణం చైతన్యానికి మొదటి మెట్టు. స్త్రీలు స్వేచ్ఛగా ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం వారి జీవితాల్లో అనేక ఆశలు రేకెత్తిస్తోంది. రాష్ట్రంలోని మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచితబస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇంకా 50 శాతం ఆడవాళ్లు వంటింటికే పరిమితమై ఉన్నారు. బయట సమాజం గురించి అభివృద్ధి చెందుతున్న విజ్ఞానం గురించి, ప్రపంచంలో జరుగుతున్న సరికొత్త మార్పుల గురించి తెలియని మహిళలు నేడు జనాభాలో సగం మంది ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటు విజ్ఞాన విహారాన్ని కూడా మహిళలకు ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకం దరి చేరుస్తుంది. అడ్డకూలీలు, వ్యవసాయ కూలీలు, నిరుపేద మహిళలు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలు తమ సంపాదనలో ఎక్కువ శాతం ప్రయాణినికే ఖర్చు పెట్టేవారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రస్తుతం వీరికి ఉపశమనం కలిగిస్తుంది. మంచి కూలి దొరుకుతుందంటే దూరం పోవడానికి ఇక వెనుకాడరు. అదే విధంగా పేద మహిళలు ఉచిత బస్సుసౌకర్యంతో ఆర్థికంగా ఎంతో మేలు పొందుతారు. పేద,మధ్య తరగతి మహిళలకు ఉపాధి మార్గాలు తెరచే విధంగా చంద్రబాబు నాయుడు చేశారని చెప్పవచ్చు. ఉచిత బస్సు ఫథకం అమలు చేయాలనే కూటమి ప్రభుత్వం లక్ష్యం ప్రశంసనీయమైన చొరవే. ఎందుకంటే ఇది



మహిళల ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం కోసం దోహదపడుతుంది. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి గణనీయమైన ఆర్థిక చిక్కులు కలిగిస్తుంది. కాని ఆ చిక్కులను అధిగమించే దిశగా ఆలోచన చేయడమే చంద్రబాబు నాయుడు రాజకీయ చతురతకు అద్దం పడుతుంది.ఆర్టీసీకి భారం కాకుండా ఇతర మార్గాలను అన్వేషించే విధంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నందున చంద్రబాబు ధైర్యంగా ముందడుగు వేయగలిగారు. ఈ పథకం విధివిధానాలపై దాదాపు ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ప్రయాణ దూరం కేటాయింపు బస్సులపైన ఆర్టీసీ అధికారుల నుంచి ప్రభుత్వం వివరాలు సేకరించింది. జిల్లా పరిధిలో మాత్రమే మహిళలు ఉచితంగా ప్రయాణించేలా ఈ పథకం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో ప్రస్తుతం ఏ కేటగిరి బస్సులు ఎన్ని తిరుగుతున్నాయి,ఎంత మంది ప్రయాణం చేస్తున్నారనే వివరాలను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు, అల్ట్రాపల్లె వెలుగుతోపాటు విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో తిరిగే సిటీ ఆర్డినరి బస్సుల్లో 88శాతం ప్రయాణీకులు ఉమ్మడి జిల్లాల పరిధిలోనే రాకపోకలు సాగిస్తున్నట్టు తేలింది. 12శాతం బస్సులు మాత్రమేపొరుగున ఉన్న జిల్లాలకు తిరుగుతున్నాయి.ఉమ్మడి జిల్లాల్లో ఈ లెక్కలు పరిశీలించిన తర్వాత ఉమ్మడి జిల్లా పరిధి ప్రాతిపదికగా ఈపథకం అమలు చేయాలనే నిర్ణయానికి కూటమి సర్కారు వచ్చినట్టు సమాచారం.ఆర్టీసీలో ప్రస్తుతం11,449 బస్సులున్నాయి.ఇందులో పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటిఆర్డినరీ బస్‌లు కలిపి 6,561ఉన్నాయి.ఇవన్నీ ఎక్కువ ఉమ్మడి జిల్లాల్లోనే రాకపోకలు సాగిస్తున్నాయి. 1,897 ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. ఈ లెక్కన పొరుగు జిల్లాలకు 8.5శాతం మంది మాత్రమే ప్రయాణిస్తున్నారు. కాగా 91.5శాతం ఉమ్మడి జిల్లాలోనే ప్రయాణిస్తున్నట్టు తేలడంతో ఉమ్మడి జిల్లాల పరిధిలోనే ఈపథకం అమలు కానుంది. అలాగే ఈ పథకం అమలు గ్రామీణ, సిటీ ఎక్స్‌ప్రెస్ బస్సులకు పరిమితం చేయనున్నారు. ఈ బస్సుల్లో రోజుకు 16.11లక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈపథకం అమలు చేస్తే వారి సంఖ్య 26.95 లక్షలకు చేరుతుందని అంచనా. అంటే నిత్యం సగటున 10.84 లక్షల మంది ప్రయాణీకులు పెరుగుతారని భావిస్తున్నారు. విజయవాడ,విశాఖపట్నం తిరిగే సిటి బస్సుల్లో మాత్రం వారానికి 4 సార్లు రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా పరిధిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు ద్వారా ఆర్టీసీకి నెలకు రూ.242 కోట్లు భారం పడుతుందంటున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల నష్టపోయిన ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి భర్తీచేయాల్సి ఉంటుంది.కార్పొరేషన్ నిర్వహణ ఖర్చులలో ఇంధనం, నిర్వహణ సిబ్బంది జీతాలు ,ఇతర ఓవర్ హెడ్ ఖర్చులుంటాయి. ప్రయాణీకులు బస్సు ఛార్జీలు చెల్లించకపోయినా వీటిని భరించాలి.ఇప్పటికే ఆర్టీసీ ఆదాయ నష్టాలను కూడబెట్టుకుందనేది నిర్వివా దాంశం. రాష్ట్రంలోని అన్ని ప్రయాణికుల ప్రాంగణాల్లో కొత్త రూపులు దిద్దుకుంటున్నాయి. ఉచిత ప్రయాణంలో ప్రయాణికులు ఇబ్బందిపడకుండా ముందస్తు సన్నహాలు చేస్తున్నారు.ఆర్టీసీ బస్ ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. రద్దీ తరుణంలో పారిశుధ్యం, మరుగుదొడ్ల అవసరాలు, లైటింగ్, గాలిపంకాలు అదనంగా ఏర్పాటు, తాగునీటిసౌకర్యంపై దృష్టి పెట్టారు. వీటన్నింటిని ఆగస్టు 15కంటే ముందుగా అందుబాటులోకి తేనున్నారు.అదనపు సర్వీసులు తిప్పనున్న నేపథ్యంలో ఆ మేరకు డ్రైవర్లను, కండక్టర్లను సర్దుబాటు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రయాణించే మహిళలకు ఉచిత టికెట్ జారీచేస్తారు. వారిలో చైతన్యాన్ని పెంచుతుంది. ఆంధ్రప్రదేశ్ మహిళా లోకంలో కొత్త వెలుగు కనిపించబోతోంది. ●

(రచయిత: కార్మిక శాఖ మంత్రి)






"త్రివర్ణ పతాక కీర్తిని నిలబెట్టడంలో హర్ ఘర్ తిరంగ అభియాన్ ఒక ప్రత్యేకమైన పండుగగా మారింది"

- నరేంద్ర మోడీ
ప్రధానమంత్రి

## అతిపెద్ద దేశవ్యాప్త జన్ భాగీదారీ ఆందోళన్‌లో గర్వించదగ్గ స్వచ్ఛంద సేవకులం అవుదాం.

# హర్ ఘర్ తిరంగా

**2వ-15వ ఆగస్టు 2025**

### హర్ ఘర్ తిరంగలో పాల్గొని ఉత్సాహాన్ని రెట్టింపు చేయండి

- ఐక్యత అనే దారంలో ప్రజలను ఏకం చేయండి
- ఇంట్లో జాతీయ జెండాను ఎగురవేయడానికి వారిని ప్రేరేపించండి
- harghartiranga.com లో తిరంగాతో సెల్ఫీని అప్‌లోడ్ చేయండి

### వాలంటీర్‌గా మారడానికి ఈ దశలను అనుసరించండి

- దశ 1: harghartiranga.comని సందర్శించండి
- దశ 2: 'వాలంటీర్ అవ్వండి' పై క్లిక్ చేయండి
- దశ 3: వివరాలను నమోదు చేయండి
- దశ 4: 'రిజిస్టర్'పై క్లిక్ చేయండి

**వాలంటీర్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: 2వ ఆగస్టు 2025**

ప్రతి ఇంట్లో హర్ ఘర్ తిరంగ క్షణాన్ని తిరిగి ఆస్వాదిద్దాం!

మరింత సమాచారం కోసం దీన్ని స్కాన్ చేయండి

CBC 09101/13/0012/2526

# 1,950 ఇందిరమ్మ ఇళ్లు రద్దు

## కేటాయించిన సెక్రటరీలపై వేటు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి ప్రభుత్వం భారీ షాకి చ్చింది. 1,950 మంది ఇళ్లను రద్దు చేసింది. వీరంతా బెస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తిచేసి, తొలివిడత ఆర్థిక సాయం రూ.లక్ష కోసం దరఖాస్తుచేసుకున్న సమయంలో ప్రభుత్వం వీరి ఇళ్లను రద్దు చేసింది. వీరి స్థానంలో కొత్త వారికి ఇళ్లను కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పేదవారి సొంతింట కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించగా ప్రస్తుతం అవన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయి. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఒకేసారి పెద్ద సంఖ్యలో గృహ ప్రవేశం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం ఎంత పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా. కొన్నిచోట్ల అనర్హులకు ఇళ్లు దక్కుతున్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్య దర్శులు చేస్తున్న తప్పులతో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నట్లు అధికారులు గుర్తించారు. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 1,950 మందిఅనర్హులు ఇందిరమ్మ ఇళ్లు పొందినట్లు వెల్లడైంది. బెస్‌మెంట్ పూర్తయిన తరువాత.. మొదటి విడతలో భాగంగా రూ. లక్ష చెల్లించే సమయంలో ఈ 1,950 మంది అనర్హులను గుర్తించారు. దీనిపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ మాట్లాడుతూ.. వెంటనే వీరికి మంజూరు చేసిన ఇండ్లను రద్దు చేసి..వీరికి బదులు కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు బాధ్యులైన సెక్రటరీలను సస్పెండ్ చేశాలని తెలిపారు. ఈ పథకానికి సంబందించి మొదడి విడతలో. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నామని ఏండీ గౌతమ్ తెలిపారు. అయితే తాజాగా చేపట్టిన తనిఖీల్లో అనర్హులుగా గుర్తించిన ఈ 1950 మంది గతంలోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి. బెస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేసిన వారని తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు వీరి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దశల వారీగా పలువురు అధికారులు. ఆపై కలెక్టర్ ఆమోదం తెలిపిన తర్వాతే .. లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఐనప్పటికి కొన్ని చోట్ల తప్పులు జరిగి.. అనర్హులు కూడా ఇళ్లు పొందారన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి తప్పులు జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని గౌతమ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనల గురించి ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో ఫొటో క్యాప్చర్ సమయంలో సెక్రటరీలు తప్పులు చేస్తున్నారని దీనిలో పేర్కొన్నారు. ఇందరిమ్మ ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో జరగాలని.. కచ్చితంగా రెండు రూమ్‌లు, కిచెన్, బాత్రూం నిర్మించాలని సూచించారు. పునాదికి ముందు వైపు, పక్కల వెంట, పై నుంచి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు దశల వారీగా హౌసింగ్ ఏఈలు తనిఖీ చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

## బనకచర్లను తాకట్టు పెట్టింది గత ప్రభుత్వమే

### వారి తప్పలు బయటపడతాయనే సర్కారుపై ఆరోపణలు

### బిఆర్ఎస్‌పై పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మండిపాటు

**పరిగి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు, కెటిఆర్ లపై టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు.. జనహిత పాదయాత్ర లో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో కార్యకర్తలతో సమావేశం అనంతరం పిసిసి మహేష్ కుమార్ గౌడ్ పత్రికా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన బీసీల రిజర్వేషన్లకూ, బిఆర్ఎస్ పార్టీకి, కవితకు సంబంధం ఏంటని అన్నారు. రిజర్వేషన్లు, కులగణనలతో దేశానికి రోల్‌మోడల్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందని, సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధతను చాటాడని, చారిత్రా త్మక నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. బనకచర్ల విషయంలో ముమ్మాటికీ గత పాలకులదే తప్పిదమని స్పష్టం చేశారు. కేసీఆర్, హరీశ్‌రావులు కలిసి బనకచర్లను ఆంధ్ర కు తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాజకీయాలు చేసి ఆంధ్ర పాలకులకు మేలు చేశారని, వారు చేసిన తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు... తాకట్టు పెట్టిన వాటాను వెనక్కి తేవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు బురదజల్లుతున్నారుని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో 2014 నుండి మొన్నటి వరకు గత పాలకులు చేసిన తప్పిదాలు స్పష్టంగా వివరించాడని మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు.. బనకచర్ల ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ నేపథ్యంలో కేంద్రానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుకట్ట వేశామన్నారు.. బీఆరెస్స్ నాయకుల తప్పిదాలు బయటకు వస్తాయనే, ప్రభుత్వంపై ముందే ఆరోపణలు చేస్తున్నారని, బిఆర్ఎస్ నేతల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. బనకచర్ల విషయంలో బీఆరెస్స్ ప్రభుత్వం తప్పు చేసిందని, సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలిపారు.

## భూదాన్ కేసులో తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా నాగారంలో భూదాన్ భూముల వివాదంపై కమిషన్ వేయాలా...? వద్దా...? అనేదానిపై తా ము త్వరలో తేలుస్తామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు దీనిపై తీర్పురు రిజర్వ్ చేసింది. మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నంబర్ 181, 182, 194, 195 నంబర్లలో గల భూదాన్ భూములు అన్యక్రాంతం అయ్యాయని ఇప్పటి కే హైకోర్టులో వేరు వేరుగా పిటిషన్లు దాఖలవడం తెలిసిందే. ఈ సర్వే నంబర్లలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు కొందరు వ్యాపారులు అ క్రమంగా తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ విచారించి భూదాన్ భూము ల్లో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించడంతో పాటు ఈ మేరకు హైకోర్టుకు నివేదిక కూడా ఇచ్చింది. అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేష్, పడమటి తాండ నివాసి రాములు భూదాన్ భూముల్లో అక్రమాలపై చాలా కాలం నుంచి పోరాడుతూ ఇదే విషయమై న్యాయస్థానాలను ఆశ్రయించడం తెలిసి ందే. ఇక్కడ జరుగుతున్న భూకబ్జాలపై అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటి షన్లపై జస్టిస్ లక్ష్మణ్ విచారించి దీనిపై తీర్పును రిజర్వ్ చేశారు. ఇక్కడ అక్రమాలు జరుగుతున్న దానిపై ఎలా చేయాలనే దానిపై తాము త్వ రలో నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు.

## బిల్డింగ్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (కెపిహెచ్‌బికాలనీ), ఆగస్టు 1, ప్రభాతవార్త:** పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థిని సరిగా చదవడం లేదని ఉపాధ్యాయులు సిబ్బంది మందలించడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని బిల్డింగ్‌పై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కెపిహెచ్బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కెపిహెచ్బి కాలనీలోని మంజీర ట్రినిటీహోమ్స్‌లో నివాసముంటున్న ఆకుల హరి నారాయణమూర్తి కుమార్తె లాస్య ప్రియ (13) కాలనీలోని అడ్డగుట్టలోని నారాయణ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతోంది. ఆమె ఎప్పటిలాగే గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లిం దని, ఆ తర్వాత పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు ఫోన్ చేసి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం గురించి నాలుగు గంటలకు తెలియజేసిందని పేర్కొన్నారు. లాస్య ప్రియ తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యారు. పేరెంట్స్ మీటింగ్‌లో పాఠశాల ఉపాధ్యాయులు లాస్య ప్రియ బాగా చదవడం లేదని చదువుపై దృష్టి పెట్టడం లేదని సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులను ఆమెకు కౌన్సెలింగ్ ఇవ్వమని కోరారు. పాఠశాల నుండి వచ్చిన తర్వాత లాస్య తీవ్ర మనస్థాపానికి గురైంది. అదేరోజు తల్లిదండ్రులు నిద్రించగా మధ్యరాత్రి 17వ అంతస్తు నుండి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విద్యార్థిని పైనుంచి పడడంతో శరీర భాగాలు రెండు ముక్కలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కెసిఆర్‌లా మోసం చేయడం లేదు

### ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** గతంలో కెసిఆర్ ప్రభుత్వం లాగా మేము మోసం చేయడం లేదు, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రజా పాలనాలో ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రజలతో ముఖాముఖీ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై వినతులు స్వీకరించి సంబం ధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్ళానని తెలిపారు. నా నియోజకవర్గంలో కూడా పల్లె బాట కార్యక్రమం మొదలు పెట్టానని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకునేలా ఇప్పటికే 20 గ్రామాలు తిరిగానని వివరించారు. రాజకీయ ఎత్తులు, జిత్తులు అట్లాంటివి పట్టించుకోనని ఆమె తెలిపారు. నా టార్గెట్ మొత్తం ప్రజలకు మేలు చేయా లనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నా అని అన్నారు. పాలకుర్తి కోడల్నీ, ఆడపడుచురాలిని ప్రజలకు ఎల్లవేళలా సేవ చేయడమే నా టార్గెట్. విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు.



శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ పిసిసి చీఫ్ విహెచ్

## బిసి రిజర్వేషన్‌తో ముస్లింలకు లబ్ధి ప్రచారం పచ్చిఅబద్ధం

### ఢిల్లీలో ఆగస్టు 5 నుంచి 7 వరకు జరిగే ధర్నాకు ముఖ్యమంత్రి రేవంత్ హాజరు

### పిసిసి మాజీ ఛీఫ్ హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ తో ముస్లింలకు మాత్రమే లబ్ది అనేది పచ్చి అబద్ధమని మాజీ పిసిసి చీఫ్, మాజీ ఎంపి హనుమంతరావు అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇంకెంతకాలం ఇందిర పార్క్ వద్ద ధర్నాలు, ప్రెస్ మీట్‌లు తాడోపేడో తేల్చుకొనేందుకు డిల్లీకి వెళ్దాం రండి అని బిసి సంఘాల నేతలను కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాలకు పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా జంతర్ మంతర్ వద్ద బిసి ధర్నా జరగాలి. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తీసుకుందాం ఇప్పుడు విస్మరిస్తే ఎప్పటికీ కాదు. ఈ అదృష్టాన్ని బీసీలు చేతులారా చెడగొట్టు కోవద్దు అందుకే అందరం కలసి పోరాటం చేయాలి. దేశ వ్యాప్తంగా బిసి రిజర్వేషన్ నినాదం కావాలి తెలంగాణలో 42శాతం రిజర్వేషన్ ఎట్లాగైనా అమలు అవుతుంది. ఈ నెల 5,6,7 తేదీలలో బిసి రిజర్వేషన్ కోసం డిల్లీలో పోరాటం చేస్తున్నామని ప్రకటించారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఆ ధర్నాలో పాల్గొంటారు. బిసి సంఘాలు కూడా పెద్ద ఎత్తున డిల్లీకి రావాలని కోరారు. రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారని పునరుద్ఘాటించారు.

## భూపాలపల్లి బైపాస్‌రోడ్డు వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు

### కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరిన వరంగల్ ఎంపి కడియం కావ్య

### త్వరలో డిపిఆర్‌ను తయారుచేసి టెండర్ పనులు పూర్తి



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న వరంగల్ ఎంపి కడియం కావ్య

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పలు మార్లు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరడంతో ఎట్టకేలకు నిధులు మంజూరు చేశారు. భూపాల పల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్ ప్లాంట్ యాక్టివిటీల వల్ల ఎన్ హెచ్ 353సి మీద తీవ్ర వాహన రద్దీ పెరగడంతో పట్టణమధ్యలో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఎంపి కావ్య కేంద్ర మంత్రికి వివరించారు. గత మూడు సంవ త్సరాల్లో 576 రోడ్డు ప్రమాదాలు జరగడంతో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించ డానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే ప్రత్యేక బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రిని ఎంపీ కోరారు. రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డులో, రూ.175 కోట్లు నిర్మాణ పనులకు, రూ.75 కోట్లు భూసేకరణకు విని యోగించలని ఈ నిధులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని ఎంపి కడియం కావ్య విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు ఇస్తామని తెలియజేసారు. అందుకు సంబంధించిన డిపిఆర్ ను తయారు చేసి టెండర్ పనులు పూర్తి చేస్తామని వివరణాత్మక లేఖ ద్వారా కేంద్ర మంత్రి... వరంగల్ ఎంపీ కడియం కావ్యకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణ ప్రజల ఎన్నో యేళ్ల సమస్య తీరనుందని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య, ప్రజల భద్రతో పాటు ప్రయాణ దూరంలో లాభం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్

### మొదటిరోజు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 93 శాతం హాజరు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి శుక్రవారం నుంచి పేస్ రికగ్నేషన్ అటెండెన్స్ (ముఖ గుర్తింపు హాజరు) ప్రారంభమైంది. ఇప్పటికే దీనిని గత ఏడాది డిసెంబర్‌లో పైలట్ ప్రాజెక్టుగా పెద్దపల్లి జిల్లాలో ప్రారం భించగా.. ఆగస్టు 1(శుక్రవారం) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. ఆగస్టు 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ముఖ గుర్తింపు హాజరును ప్రారంభించినట్టు పాఠశాల విద్య శాఖ అధికారులు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ తన పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులతోపాటు బోధనేతర సిబ్బందికి శుక్రవారం నుండి ముఖ గుర్తింపు హాజరును అమల్లోకి తీసుకొచ్చిందని అధికారులు స్పష్టం చేశారు.

విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 24973 ఉండగా .. అందులో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కలిపి 1,28,760 మంది ఉన్నారని తెలిపారు. వారిలో శుక్రవారం ముఖము గుర్తింపు హాజరు ఆప్ ద్వారా 96,327 (75శాతం) మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 89,922 (93.3శాతం) మంది తమ హాజరును ముఖ గుర్తింపు హాజరు యాప్ ద్వారా నమోదు చేయడం జరిగిందని అధికారులు ప్రకటించారు.

## అనుముల అన్నదమ్ముల కోసమే ఫార్మా భూముల్లో ఫ్యూచర్ సిటీ: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 1:** కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అన్న నిజం ఫార్మా సిటీ భూముల వ్యవహారంతో మరోసారి తెలిసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దుచేసి భూములను తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర అవసరాలకు వాటిని మళ్లించడం అత్యంత నీచమైన చర్య అని మండిపడ్డారు. అధికారం ఉందన్న అహంకారంతో ప్రజల అనుమతి లేకుండా భూముల సర్వే జరపాలనుకోవడం ఫాసిస్టు చర్య అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మా భూములు మాగ్గావాలె అని మర్లవడ్డ రైతులపై అక్రమ కేసులు పెడుతున్న రేవంత్ రాక్షసత్వాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫార్మా రైతులను నిలువునా ముంచి అనుముల అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్ సిటీని రేవంత్‌రెడ్డి నిర్మిస్తు న్నారని కెటిఆర్ విమర్శించారు. అడుగడుగునా అన్నదాతలు మర్లవడుతున్నా, ఏకంగా ఎంఎల్ఎల ఇళ్లు ముట్టడిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌కి బుద్ధి రావడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. చట్టప్రకారం భూములను తిరిగి పొందే హక్కు ఉన్న రైతులతో ప్రభుత్వం ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు.

ఓవైపు ఫార్మా సిటీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, మరోవైపు కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రేవంత్ ప్రభుత్వం, అటు ప్రజలను, ఇటు న్యాయ స్థానా లను మోసం చేసిందని అన్నారు. ఫార్మా సిటీ రద్దయితే తమ భూములు తిరిగి వస్తాయని ఆశ పడ్డ రైతుల నోట్లో మట్టికొడుతున్న రేవంత్ రెడ్డికి కర్రుగాల్చి వాతపెట్టేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారని కెటిఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది.

లగచర్ల గిరిజన రైతుల భూములు, కంచె గచ్చిబౌలి అటవీ భూములు, అనుముల బ్రదర్స్ కోసం ఇప్పుడు ఫార్మాసిటీ అన్నదాతల భూములను చెరబట్టే పన్నాగాల దాకా.. రేవంత్ పాపాల పుట్ట రోజురోజుకూ పెరిగిపోతూనే ఉందని కెటిఆర్ అన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వడం, యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించడం, ప్రశ్నించిన వారిని వేధించడం, సిగ్గులేకుండా భూ కబ్జాలు చేయడమే మూల స్తంభాలుగా రేవంత్ ప్రభుత్వ పాలన నడుస్తుందని మండిపడ్డారు. అంతరించి పోయాయని అనుకున్న రాబందులు కాంగ్రెస్ నేతల రూపంలో తెలంగాణ ప్రజలను పీక్కు తింటున్నాయని చెప్పారు. దోస్తులకు దోచి పెట్టేందుకు చీకటి ఒప్పందాలతో తెరపైకి తెచ్చిన ఫ్యూచర్ సిటీకి అక్రమంగా భూములు కేటాయిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భూములు తిరిగి ఇచ్చేవరకు రైతుల పక్షాన బిఆర్ఎస్ ఉద్యమిస్తుందని కెటిఆర్ స్పష్టం చేశారు.

## పటిష్ట మేధోసంపత్తి హక్కులతో రైతుల ఆవిష్కరణలను కాపాడుకోవాలి

### తెలంగాణ ఉద్యాన వర్సిటీ విసి డాక్టర్ దండా రాజిరెడ్డి

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 1, ప్రభాతవార్త:** రైతుల ఆవిష్కరణలను బల మైన మేధోసంపత్తి హక్కులతో కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. నెలకు కనీసం ఒక పేటెంట్ దాఖలు చేయాలని విశ్వ విద్యాలయం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులను కోరారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ (టిజిసిఓఎస్‌టి), తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐపిఆర్ విభాగం సంయుక్తంగా 'ఉద్యాన రంగంలో ఆవిష్కరణలు, మేధో సంపత్తి హక్కుల'పై జాతీయ వర్క్‌షాప్‌కు శుక్రవారం రాజేంద్రనగర్ లోని కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్‌లో జరిగింది. భారత ప్రభుత్వ పర్యావరణం, అడవులు, సైన్స్ టెక్నాలజీ విభాగం, తెలంగాణ ప్రభుత్వ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆర్థికంగా మద్దతు ఇస్తున్నాయి. వర్సిటీ ఆధ్వర్యంలో బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపు భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ జరుగుతుందని ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. ఉద్యాన పురోగతి నైతిక రక్షణ లో మేధో సంపత్తి హక్కులు ప్రధాన పాత్ర వహిస్తాయని సైన్స్, చట్టం, సమాజ జ్ఞానాన్ని అనుసం ధానించడానికి పేటెంట్లని మరింతగా ప్రోత్సహించాలని ఆయన తెలిపారు.

విశ్వ విద్యా లయం పరిధిలోని పరిశోధకులు, విద్యార్థుల పేటెంట్‌యోగ్యమైన ఆవిష్కర ణలకు ఆర్థిక సహాయాన్ని వర్సిటీ అందిస్తుందని ప్రకటించారు. ఆవిష్కం ణలను రక్షించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. దీనివల్ల రైతులకు సాధికారత లభిస్తుందనిఖి అని డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఐపీ రిజల్యూట్ గ్రూప్ లీగల్, ఐపీఆర్ హెడ్ శుభజిత్ సాహా పేటెంట్లు, భౌగోళిక సూచికలు, ఉద్యాన రంగంలో వాటి ప్రయోజ నాలపై జాతీయ సదస్సులో కీలకోప న్యాసం చేశారు. భారతదేశంలో విజయవంతమైన భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ పంటలు, ఉత్పత్తుల కేస్ స్టడీలను ఆయన వివరించారు. మేధోమదన ఆధా రిత రక్షణ విధానాలు, గ్రామీణ ఆర్థిక అభ్యున్నతి, జీవ వైవిధ్య పరిరక్షణ, సాంప్రదాయ పంటలకు బ్రాండ్ గుర్తింపునకు ఎలా దోహదపడతాయో వివరించారు.

## మిగిలిపోయిన భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

### ప్రభుత్వానికి పండితుల అసోసియేషన్ల విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండి తులకు పదోన్నతులు కల్పించాలని భాషా పండితుల అసోసియేషన్స్ డిమాండ్ చేస్తున్నాయి. పాఠశాల విద్య శాఖ రాష్ట్రం లోని ఉపాధ్యాయులకు పదోన్నతుల కోసం షెడ్యూల్ జారీ చేసిన నేపథ్యంలో గతంలో భాషా పండితుల నుంచి స్కూల్ అసిస్టెంట్స్‌గా ఉన్నతీకరించగా.. వారిలో మిగిలిపోయిన మరో 1000 మందికి పదోన్నతులు కల్పించాలని సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించినందుకు ప్రభుత్వానికి స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎస్ఎల్‌టిఏ) తెలంగాణ కృతజ్ఞతలు తెలిపింది. 2024లో పదోన్నతి పొందలేక మిగిలిపోయిన భాషా పండితులందరికీ పదోన్నతి కల్పించాలని ఎస్‌ఎల్‌టిఏ టిజి రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి గౌరీ శంకర్ రావు డిమాండ్ చేశారు. మిగిలిన సబ్జెక్ట్స్ పరంగా కొన్ని సమస్యలు తలెత్తినా, మనోవేదనకు గురయ్యే భాషా పండితులకు మాత్రం తక్షణమే పదోన్నతి కల్పించాలన్నారు. విభజనకు ముందున్న జిల్లా కేంద్రాల్లో ఏర్పడ్డ ఇబ్బందులను సరిచూసి మిగిలిపోయిన భాషా పండితులకు వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు వివిధ స్థాయిలలో పదోన్నతులకు పచ్చజెండా ఊపుతూ షెడ్యూల్ విడుదల చేయడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యుపిపి టిజి) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 1000 మంది భాషాపండితుల పోస్టుల ఉన్నతీకరణకు సంబంధించిన ఫైల్‌ను త్వరగా పరిష్కరించి.. ఇదే షెడ్యూల్‌లో తెలుగు, హిందీ, ఉర్దూ భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్‌అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల కాంతికృష్ణ డిమాండ్ చేశారు.

## అడ్వాన్స్ పేమెంట్.. 'డిస్కౌంట్ల' మోసం

### నిజామాబాద్ జిల్లాలో ఓ ఫర్నిచర్ దుకాణం నిర్వాకం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఉత్పత్తుల విక్రయాల్లో ఎన్నో రకాల మోసాలు వెలుగుచూస్తున్నాయి. జిమిక్కులతో అమాయకులను బురిడీ కొట్టించి లాభపడుతున్నారు. అయితే ఇలాంటి మోసమే శుక్రవారం నిజా మాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. ఆర్మూర్‌టౌన్ నిజాంసాగర్ కెనాల్ పక్కన జిరాయత్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో ఓ ఫర్నిచర్ దుకాణం ఉంది. అడ్వా న్స్ పేమెంట్ చేసిన వారికి ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్ తదితర గృహోపకరణాలు 40 శాతం డిస్కౌంట్ అని బ్యానర్లు, కరపత్రాలతో కొంతకాలంగా ప్రచారం చేశారు. దీంతో ఆకర్షితులైన ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి డబ్బులు చెల్లించి ఆర్డర్ చేశారు. డెలివరీ తేది వచ్చిన సామాగ్రి రాకపోవడంతో కస్టమర్లు గందరగోళంలో పడ్డారు. దీంతో దుకాణం వద్దకు వచ్చేసరికి తాళం వేసి ఉంది. ఓనర్‌కు ఫోన్ చేసిన స్విచ్ఛాఫ్ ఉంది. రోజులు గడిచిన షాప్ తెరవకపోవడంతో బాధితులందరు కలిసి ఆర్మూర్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన్నట్లు సిఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

## ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన బిఆర్ఎస్

### ఉపఎన్నికలు వస్తాయని హరీశ్, కెటిఆర్ కొత్తనాటకం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేసిన చరిత్ర బిఆర్ ఎస్ పార్టీదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. శుక్రవారం విలేఖరులతో సిఎల్‌పిలో మాట్లాడుతూ కాంగ్రెస్, టిడిపి, వై ఎస్ ఆర్ సిపి, బిఎస్‌పి చివరికి కమ్యూనిస్ట్ పార్టీ ఎంఎల్ ఏ లను బెదిరించి, ప్రలోభ పెట్టి అవినీతి డబ్బు తో కొనుగోలు చేసిన నీచులు బిఆర్ఎస్ నేతలు అని మండిపడ్డారు. కెటిఆర్, హరీష్ రావు రాష్ట్రం లో కొత్త డ్రామాకు తెర తీశారని విమర్శించారు ఉప ఎన్నికలు వస్తాయి అని అంటున్నారు రాష్ట్రంలో ఉపఎన్నికలు రావు బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల లో 60 మంది ప్రతిపక్ష ఎంఎల్ఏ లను కొనుగోలు చేసిన నీచచరిత్ర కెసిఆర్ ది.. అప్పుడు రాని ఉపఎన్నికలు ఇప్పుడు ఎలా వస్తాయి? అని మేడిపల్లి సత్యం సందేహం వ్యక్తంచేశారు. పార్టీ పిరాయింపు లకు బ్రాండ్ అంబాసిడర్ బిఆర్ ఎస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత ఆపార్టీకు లేదని అన్నారు. మీరు చేసిన ఫిరాయింపుల పైన ముందు కెసిఆర్ ముక్కు నేలకు రాసి మరీ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఒక వేళ ఉప ఎన్నికలు వచ్చినా అన్ని సీట్లు మేమే గెలుస్తామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ లు పోయినట్లు ఉప ఎన్నికలు వస్తే బిఆర్ ఎస్‌కు అదే జరుగుతుంది. మా సిఎం రేవంత్ రెడ్డి గేట్లు ఓపెన్ చేస్తే మీ కుటుంబం లోని ముగ్గురు నలుగురు తప్ప ఎవరూ బిఆర్ఎస్‌లో మిగలరని అన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట మాట్లాడుతున్న జి.చెన్నయ్య

## రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం

### మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపులో మాలలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఆనేక మంది మాలలు శు క్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా సు ప్రీం కోర్టు దళితులను, గిరిజనులను ఆర్థిక వెనుకబాటు పరంగా విభజించుకోవచ్చునని తీర్పు ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను సిఎం రేవంత్‌రెడ్డి పాటించకుండా ఆగమేఘాలపై వర్గీకరణ చేసి మాలలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. గ్రూపు-3లో ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంతోపాటు, రోస్టర్ పాయింట్లు కేటాయించ కుండా మాలల గొంతు కోశారని ఆయన ధ్వజమెత్తారు. తక్షణమే రోస్టర్ పాయింట్లు సవరించి మాలలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ సాయం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజన నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. దీంతో తెలంగాణ రైతులకు కేంద్ర సాయం కూడా అందనుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత విడుదలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. పీఎం కిసాన్ యోజన నిధులను ఈ నెల 2వ తేదీన విడుదల చేయనున్నట్లుగా తెలిపింది. ఆరోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారని, అక్కడి నుంచే రైతుల ఖాతాల్లో నిధుల విడుదల చేస్తారని పేర్కొంది. పీఎం కిసాన్ యోజన పథకం కింద రైతుల ఖాతాల్లో రూ. 2 వేల చొప్పున జమ కానున్నాయి. అయితే పీఎం కిసాన్ యోజనలో రిజిస్టర్ చేసుకున్న రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది. పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఓటీపీ ఆధారిత (మొబైల్ నంబర్) ఈ కేవైసీ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపింది. బయోమెట్రిక్ ఆధారిత ఈ కేవైసీ కోసం సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాలను సంప్రదించాలని పేర్కొంది. ఇక, ప్రధానమంత్రి కిసాన్ యోజన (ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన) కింద కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 6,000ను అర్హులైన రైతుల ఖాతాలలో జమ చేస్తుంది. ఈ సొమ్మును రూ.2000 చొప్పున మూడు విడతలుగా విడుదల చేస్తున్నారు.

## బిసి డిక్లరేషన్ అమలు చేయాలంటూ నేడు ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

### రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటుందని తప్పుడు ప్రచారం: ఎంపి ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కామారెడ్డి బిసి డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిందని, కానీ వాటిలో ఒక్కదాన్ని కూడా నెరవేర్చకుండా బిసిలకు అన్యాయం చేసిందని ఎంపి ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ప్రస్తుతం 42 శాతం బిసి రిజర్వేషన్లను అమలు చేయలేక, కేంద్రంపై నింద మోపుతూ తప్పుడు ప్రచారం కపటనాటకం ఆడుతుందని మండిపడ్డారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్, వాటి అమలుపై తాత్సారం చూపుతుందన్నారు. 42శాతం బిసి రిజర్వేషన్ల అమలును బిజెపి అడ్డుకుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా అసత్యం అన్నారు. బిజెపి 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ప్రకటించిందని, బిసిలకు హామీల అమలును కాంగ్రెస్ పార్టీకే చిత్తశుద్ధి లేదని అన్నారు. రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణల ప్రకారం, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదేనని, 243డి(6) క్లాజ్‌లో దీనిని స్పష్టంగా పేర్కొన్నారని, ఈ విషయంపై తాము అనేకసార్లు వివరించాం అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే పూర్తి అవకాశం ఉందని, అసెంబ్లీలో బిల్లు పాస్ అయింది, ఇప్పుడు జిఓ జారీ చేయాల్సిన పని మాత్రమే మిగిలిందన్నారు.

# 16 నుంచి 'ప్రైమ్ వాలీబాల్ లీగ్'

### పోటీలో తలపడనున్న 50 జట్లు



లీగ్ వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ జట్టు యజమాని కంకణాల అభిషేక్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** దేశంలోని మూడో అతి పెద్ద స్పోర్ట్స్ లీగ్ అయిన ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) తమ ఫ్రాంఛైజ్ హైదరాబాద్ బ్లాక్ హాక్స్ (హెచ్‌బీహెచ్), వర్సిటీ స్పోర్ట్స్ సంస్థతో కలిసి స్కూల్ వాలీబాల్ లీగ్‌కు శ్రీకారం చుట్టింది. పాఠశాల స్థాయిలోని క్రీడాకారులకు వాలీబాల్ ఆడేందుకు ఒక వేదిక కల్పించడంతో పాటు ఈక్రీడ వైపు పిల్లలను ఆకర్షించడానికి పీవీఎల్‌హెచ్‌బీహెచ్ వర్సిటీ వాలీబాల్ లీగ్‌ను నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు. దేశంలో లీగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తున్న తొలి వాలీబాల్ లీగ్ ఇదేనని అభిషేక్ తెలిపారు. ఐదు వారాల పాటు జరిగే ఈ లీగ్‌లో 32 బాలుర, 19 బాలికల జట్లు మొత్తం 50 టీమ్‌లు బరిలోకి దిగుతున్నాయి. ఈనెల 16 నుంచి వచ్చే సెప్టెంబరు 28వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా ఈ లీగ్ జరగనుంది. అంతర్జాతీయ ప్రమా ణాలతో పూర్తి ప్రొఫెషనల్ విధానంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నాం. వాలీ బాల్‌ను కెరీర్‌గా ఎంచు కోవాలనే వర్థమాన క్రీడా కారులను ప్రోత్సా హించే దుకు ఈ లీగ్‌ను రూప కల్పన చేశాం. యువ క్రీడాకారుల్లోని ప్రతిభ, ఉత్సాహం, నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ లీగ్ ఉపయోగపడనుంది అని అభిషేక్ తెలిపారు. తాను స్కూల్ స్థాయిలో వాలీబాల్ ఆడేందుకు ఇలాంటి లీగ్స్ లేకపోవ డంతో ప్రాక్టీసు చేయడా నికి చాలా కష్టపడాల్సి వచ్చేదని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు స్టార్ క్రీడాకారుడు గురు ప్రశాంత్ చెప్పాడు. దేశంలోనే తొలిసారిగా జరుగుతున్న ఈ లీగ్‌ను యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంత్ కోరాడు. ప్రైమ్, హైదరాబాద్ బ్లాక్ హాక్స్, బైస్కైల్, కైజెన్, సిక్స్‌సిక్స్, సంస్థలు ఈ లీగ్ నిర్వహణకు సహకారం అందిస్తున్నారని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు స్పోర్ట్స్ డైరెక్టర్ సంజయ్ తెలిపారు. భావి క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చిన సంస్థలకు సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ, ఈశాన్య భారత సాంకేతిక సాంస్కృతిక మహోత్సవ పోస్టర్ లోగో ఆవిష్కరణకు రాజ్‌భవన్ దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** తెలంగాణ, ఈశాన్య భారత సాంకేతిక సాంస్క ృతిక మహో త్సవం నిర్వహించాలని రాజ్‌భవన్ నిర్ణయిం చింది. హైదరాబాద్‌లో నవంబరు 25 నుంచి 27 వరకు. డిసెంబరు 2 నుంచి 4 వరకు రెండు విడతల్లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వేడుకకు లోగో, ట్యాగ్ లైన్, పోస్టర్ రూపొందించాలని రాజ్‌భవన్ దరఖాస్తు లను ఆహ్వానించింది. ఈ నెల 15 వరకు మూడు కేటగిరీల్లో దరఖాస్తులు పంపించాలని గవర్నర్ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తెలిపారు.
తెలంగాణ, ఈశాన్య భారత రాష్ట్రాల మధ్య సాంస్క ృతిక ఐక్యత, సాంకేతిక ఆవిష్కరణల పరస్పర మార్పిడి భావనలను ప్రతిబింబించేలా లోగో, పోస్టర్, ట్యాగ్‌లైన్ ఉండాలన్నారు. లోగో సొంతంగా తయారు చేసి.. ఎడిట్ చేసుగలిగే హై రిజల్యూషన్ పీఎన్జీ ఫార్మాట్లో ఉండాలని దానకిశోర్ చెప్పారు.
ట్యాగ్‌లైన్ ఇంగ్లిష్ లో 10 పదాలకు మించకుండా ఉండాలన్నారు. పోస్టర్.. థీమ్‌కు అనుగుణంగా పీడీఎఫ్ లేదా పీఎన్ ఫార్మాట్లో కనీసం 300 డిపిఐ రిజల్యూషన్‌తో సమర్పించాలని సూచించారు. ఎంపికైన ఉత్తమ పోస్టర్‌కు రూ.20వేలు, లోగోకు రూ.15వేలు, ట్యాగ్ లైన్‌కురూ.5వేలు బహుమతిగా ఇవ్వ నున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను పంపిం చాలని.. పూర్తి పేరు, మొబైల్ నంబరు ఇతర వివరాలు జతపరచాలన్నారు. పూర్తి వివరాలు రాజ్‌భవన్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో ధర వ్యత్యాస చెల్లింపు పథకం

### వరంగల్, ఆదిలాబాద్, నల్లగొండ ఎంపిక

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ధర వ్యత్యాస చెల్లింపు పథకం అమలు చేసేందుకు మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది. తొలుత ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా కేంద్రం నిర్ణయించిన కనిష్ఠ మద్దతు ధర (ఎంఎస్పీ)కు, వ్యాపారి కొనుగోలు చేసిన ధరకు ఉన్న వ్యత్యాసాన్ని రైతులకు ప్రభుత్వం చెల్లించనుంది. ఇందుకోసం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ తన యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. కేంద్రం ధర నిర్ణయించి, రైతులు పండించిన పంటలను దళారుల దోపిడీ నుంచి రక్షించే ఉద్దేశంతో రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించింది.

## ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్.. నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) నలుగురు నేరగాళ్లను అ రెస్టు చేసింది. ఇందులో ఒకడు ప్రధాన నేరగాడు కాగా మిగతా ముగ్గురు అతని అనుచరులు. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. గత జూన్ నెల 28వ తేదీన నగరంలోని లాలాగూడకు చెందిన ఓ వ్యక్తికి ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌చేసి తాను ఢిల్లీకి చెందిన ప్రముఖ కంపెనీ మెంటర్‌గా పరిచయం చేసుకున్నాడు. దీని తరువాత బాధితుడిని తమ కంపెనీలో చేర్చుకుని పె ట్టుబడుల విభా గం గ్రూపులో నియమించాడు. దీని తరువాత బాధితు డిని షేర్ల కంపెనీలో పెట్టుబడులు పెట్టాలని కోరి బలవంతంగా మూడు కోట్ల రూపాయలు కొల్ల గొట్టారు. ఇదంతా వాట్సాప్ చాటింగ్ వల్ల జరిగిం ది. దీని తరువాత బాధితుడు తాను మోస పోయినట్లు గ్రహించి సైబర్ పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. దీనిపై వెంటనే కేసు నమోదు చేసిన టిజిసిఎస్‌బి అధికారులు బాధితుడిని మోసం చేసింది మొహదీ పట్నంకు చెందిన మను బోతుల శ్రీనివాస్ (45)గా తేలింది. ఇతను డ్రోన్ల వ్యాపారం చేబట్టి నష్టాలు రావడంతో సైబర్ నేరాలకు పాల్పడసాగాడు. ఇతనికి నాంపల్లికి చెందిన సయ్యద్ యూసుఫ్ (45). బంజారా హిల్స్‌కు చెందిన చెక్క యేసయ్య (54), మొహదీపట్నం నివాసి మహమ్మద్ జుబేర్ అహ్మద్ (42) బ్యాంకు ఖా తాలు ఇచ్చి సహకరించారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు జప్తు చేశారు. కాగా ఈ తరహా మోసాల పట్ల అందరు జాగ్రత్తగా వుండాలని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ కోరారు.

## బెట్టింగ్ యాప్‌లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు1:** బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఏ పాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 18కి వాయిదా వేసింది. అయితే,గత విచారణలో కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర వైఖరి తెలుసుకునేందుకు మరొక అవకాశం ఇస్తున్నామని సుప్రీంకోర్టు చెప్పింది. బెట్టింగ్ యాప్‌ల నిషేధంపై కేంద్రం సమర్థిస్తుందా? వ్యతిరేకిస్తుందా? ఎలాంటి యంత్రాం గాన్నీ ఏర్పాటు చేస్తుందో చూద్దామంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణలో మధ్యంతర ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## సెక్రటేరియట్ సందర్శకులకు ఇ-పాస్ విధానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 1:** రాష్ట్ర సచివాలయంలోకి సందర్శకుల ఎంట్రికి ఈ పాస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విధానం విజిటర్ ఇ-పాస్ మేనేజ్ మెంట్ సిస్టమ్ శుక్రవారం నుంచి అమలులోకి వచ్చింది. ఇకపై సచివాలయంలోకి నిత్యం ఎంత మంది సందర్శకులు ప్రవేశిస్తున్నారు, ఏఏ ప్రభుత్వ శాఖల వద్దకు ఎంత మంది సందర్శకులు వెళ్తున్నారనే వివరాలు స్పష్టం అయ్యే అవకాశం ఉంది. కొత్త సచివాలయం నిర్మాణం పూర్తి అయ్యాక గత ప్రభుత్వం సచివాలయంలోకి సందర్శకులను, మీడియా ప్రతినిధులను అనుమతించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం రోజు నుంచి సచివాలయంలో మీడియాను, సందర్శకులను అనుమతిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో సచివాలయంలోకి సందర్శకుల తాకిడితో పాటు వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. వాహనాలను భద్రతా తనిఖీలు నిర్వహించడం కూడా గగనంగా మారింది. సచివాలయంలో మంత్రులఅ వద్దకు వచ్చే పెద్దలు కొందరు వాహన భద్రత ప్రమాణాలు పాటించకపోవడం గమనార్హం. ఎవ్వరిని నొప్పించకుండా భద్రతా సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు మంత్రుల పేషీల నుంచి వారికి మందలింపులు ఎదుర్కొనక తప్పడంలేదు. సచివాలయంలో పార్కింగ్ స్థలానికి మించి వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల సచివాలయం భద్రతాసిబ్బందికి కూడా ఇబ్బందికరంగా మారింది.

## సినీనటుడు మోహన్‌బాబు, కుమారుడిపై దాఖలైన కేసు సుప్రీం కోర్టు కొట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** సినీ నటుడు మంచు మోహన్ బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణుకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం గతంలో ధర్నా చేసినందుకు వారిపై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన కేసును హైకోర్టులో స్వీకరించి వాదనలు వినిపించింది. కొట్టేయాలని వారు అభ్యర్థించడంతో నిరాకరించింది. దీంతో ఈ ఏడాది మార్చి3న సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో శుక్రవారం కేసును కొట్టేసింది. 2019లో ఎన్నికల కోడ్ కేసులో తిరుపతి జిల్లాలో ఉన్న తమ విద్యా సంస్థ శ్రీవిద్యానికేతన్‌లోని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం మార్చి 22న సినీ నటుడు మంచు మోహన్ బాబు, మంచు విష్ణు ఆందోళన నిర్వహించారు. దాంతో తండ్రీకొడుకులపై కేసు నమోదయింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలంటూ మోహన్ బాబు, ఆయన కుమారులు మంచు విష్ణు, మంచు మనోజ్ సహా శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల సిబ్బంది నేతృత్వంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆ నిరసనలో అప్పటి ఏపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు కూడా చేశారు. అయితే అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల మోడల్ కోడ్ అమల్లో ఉండగా.. అప్పటి ఎన్నికల అధికారి హేమలతకు ఫిర్యాదు అందింది. మోహన్ బాబు, విష్ణు తదితరుల ఆందోళనతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడిందని ఆరోపిస్తూ, పోలీసులు వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# ఒక్క రన్ లేకుండా ఔట్

## జాబితాలో 9వ స్థానంలో రోహిత్



**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్ ధనాధన్ పరుగులు చేస్తూ అలరిస్తుంటారు. అయితే, కొందరు ఆటగాళ్లు మాత్రం ఒక్క పరుగు కూడా చేయకుండా సున్నా పరుగులకే ఔట్ అయి వెనుదిరిగిన స్టార్ ప్లేయర్లు కూడా ఉన్నారు. అసలు డకౌట్ అంటే ఒక్క పరుగు కూడా చేయకుండా అవుట్ కావడమే, ఇది ఏ బ్యాట్స్‌మెన్‌కైనా చాలా ఇబ్బందికరమైన విషయం. టీ20 క్రికెట్‌లో చిన్న దేశాల ఆటగాళ్లతో పాటు, అంతర్జాతీయ స్థాయిలోని అనుభవజ్ఞులైన ఆటగాళ్లు కూడా ఈ లిస్టులో ఉన్నారు. టీ20 ఇంటర్నేషనల్‌లో అత్యధిక సార్లు డకౌట్ అయిన ఆటగాళ్ల జాబితాలో భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఉండటం విశేషం. ఈ డకౌట్ల జాబితాలో టాప్‌లో ముగ్గురు రువాండా ప్లేయర్లు ఉన్నారు. రువాండాకు చెందిన కెవిన్ ఇరాకోజ్ 75 టీ20 మ్యాచ్‌లలో 56 ఇన్నింగ్స్‌లు ఆడి, ఏకంగా 13 సార్లు సున్నా పరుగులకే అవుటయ్యాడు. అతని బ్యాటింగ్ సగటు కేవలం 10.17 మాత్రమే. అలాగే అతని సహచర ఆటగాడు జాపి బిమెనిమనా కూడా ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఇతను 91 మ్యాచ్‌లలో 327 పరుగులు చేసినప్పటికీ, 13 సార్లు డకౌట్ అయ్యాడు. మార్టిన్ అకాయేజు 95 టీ20 మ్యాచ్‌లలో 590 పరుగులు చేసినప్పటికీ, ఇతను కూడా 13 సార్లు సున్నాకే పెవిలియన్ చేరాడు. బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ సౌమ్య సర్కార్ 87 టీ20 మ్యాచ్‌లలో 13 సార్లు డకౌట్ అయ్యాడు. అతను తన కెరీర్‌లో ఇప్పటివరకు 1462 పరుగులు చేసినప్పటికీ, అతని నిలకడ లేని ఫామ్ కారణంగా ఈ జాబితాలో చేరిపోయాడు. శ్రీలంక మాజీ కెప్టెన్ దసున్ షనక పేరు కూడా ఈ జాబితాలో ఉంది. అతను 105 మ్యాచ్‌లలో 1511 పరుగులు చేసినప్పటికీ, 13 సార్లు డకౌట్ అయ్యాడు. షనక ఈ జాబితాలో ఐదవ స్థానంలో ఉన్నాడు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, ఇటీవల టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్ అయ్యాడు. అతను కూడా ఈ జాబితాలో భాగమే. అయితే, రోహిత్ శర్మ ఈ జాబితాలో 9వ స్థానంలో ఉన్నాడు. తన కెరీర్‌లో మొత్తం 159 టీ20 మ్యాచ్‌లు ఆడిన రోహిత్, 151 ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్ చేసి 4231 పరుగులు చేశాడు. అతని పేరిట 5 సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలు ఉన్నప్పటికీ, అతను 12 సార్లు సున్నా పరుగులకే అవుటయ్యాడు. భారత ఆటగాళ్లలో రోహిత్ శర్మ డకౌట్ల జాబితాలో చేరడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. అయితే, అతని భారీ పరుగులు, సెంచరీల రికార్డును బట్టి చూస్తే ఇది ఒక చిన్న ప్రతికూలత మాత్రమే అని చెప్పొచ్చు.



## తొలి టీ20లో పాకిస్థాన్ గెలుపు

### 14 పరుగుల తేడాతో వెస్టిండీస్ చిత్తు

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** పాకిస్థాన్ వెస్టిండీస్‌లో పర్యట నను ఘనంగా ఆరంభించింది. ఫ్లోరిడా వేదికగా శుక్రవారం జరిగిన తొలి టీ20లో 14 పరుగుల తేడాతో పాక్ విజయం సాధించింది. దీంతో మూడు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 178 పరుగులు చేసింది. పాక్ బ్యాటర్లలో సైమ్ ఆయుబ్ (57) హాఫ్ సెంచరీతో చెలరేగగా, హసన్ నవాజ్ (24), ఫఖార్ జమాన్ (28) రాణించారు. విండీస్ బౌలర్లలో షెమార్ జోషఫ్ 3 వికెట్లు పడగొట్టగా, హోల్డర్, షెఫర్డ్, అకిల్ హోస్సేన్ తలా వికెట్ సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనలో వెస్టిండీస్‌కు ఓపెనర్లు జాన్సెన్ ఛార్లెస్ (35), జ్యువెల్ ఆండ్రూ (35) 72 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. స్వర్ణంతో మెరిసిన రచన, అశ్విని

### భారత్ ఖాతాలో ఒకేరోజు 5 పతకాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** అండర్ 17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత మహిళా రెజ్లర్లు అదరగొట్టారు. ఏథెన్స్‌లో భారత్ కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో 5 పతకాలు జమ అయ్యాయి. వీటిలో రెండు బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. టోర్నమెంట్‌లో మహిళల ఫ్రీస్టైల్‌లో రచనా భారత్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించిపెట్టి, 43 కిలోల విభాగంలో ఛాంపియన్‌గా నిలిచింది. ఆమె తుది ప్రదర్శనలో చైనాకు చెందిన జిన్ హువాంగ్‌ను ఓడించి, మహిళల ఫ్రీస్టైల్ విభాగంలో భారతదేశానికి శుభారంభం ఇచ్చింది. ఆ తర్వాత వెంటనే, అశ్విని విష్ణోయ్ 65 కిలోల ఫైనల్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముఖయ్యో ర ఖిమ్జోనోవాపై విజయం సాధించి, భారత్ ఖాతాలో రెండవ స్వర్ణాన్ని జోడించింది. అలాగే 57 కిలోల విభాగంలో, మోని రజతంతో సంతృప్తి చెందింది. కేవలం ఒక పాయింట్ తేడాతో ముగిసిన ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన మధ్లియా ఉస్మానోవా చేతిలో ఓడిపోయి అగ్రస్థానాన్ని తృటిలో కోల్పోయింది. భారతదేశం యొక్క రెండవ రజతం కాజల్ నుండి వచ్చింది, ఆమె 73 కిలోల ఫైనల్‌లో ధైర్యంగా పోరాడి, చైనాకు చెందిన వెంజిన్ క్యూ చేతిలో ఓడిపోయింది. కాజల్ ఫైనల్‌కు చేరుకునే మార్గంలో చెప్పుకోదగ్గ విజ యాలు ఉన్నాయి. ఆమె ఫైనల్ హర్డిల్‌లో విఫల మైనప్పటికీ, రజత పతకాన్ని కైవసం చేసు కోవడంలో మరో ముఖ్యమైన ముగింపుగా నిలి చింది. ఇక 49 కిలోల విభాగంలో పోటీ పడు తున్న కోమల్ వర్మ కాంస్య పతకాన్ని సాధించడం ద్వారా భారతదేశం యొక్క ఖాతాలో చేరింది. ఆమె పతక పోరులో యూడబ్ల్యూ డబ్ల్యూకి చెందిన అన్నెలినా బుర్కినాను ఓడించింది.







## విద్యారంగంలో నూతన సంస్కరణలను నారాయణ శ్రీకారం

### సాంకేతిక సహకారానికై గూగుల్ క్లౌడ్ ఇండియాతో అవగాహన ఒప్పందం



**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** విద్యారంగంలో నవ శకానికి నాంది పలికే విధంగా ఆసియాలో అతి పెద్ద విద్యాసంస్థలలో ఒకటైన నారాయణ విద్యాసంస్థ, గూగుల్ క్లౌడ్ ఇండియాతో సాంకేతిక సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తాజా జనరేటివ్ ఏఐ, క్లౌడ్ పరిజ్ఞానంతో విద్యారంగంలో నూతన సంస్కరణలు చేపట్టేం దుకు, విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నారాయణ విద్యాసంస్థ గూగుల్ క్లౌడ్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, అద్భుతమైన ఫలితాలు సాధించేలా విద్యను అందించడంలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఒప్పందం ప్రకారం, నారాయణ సంస్థ తమ మొత్తం డిజిటల్ మౌలికసదుపాయాలను గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫ్లామ్ (జిసిపి)తో అనుసంధానం చేయనుంది. దీనివల్ల విద్య మరింత మెరుగు పడుతుంది. ముఖ్యంగా భారత్‌లోని చిన్న పట్టణాలు, గ్రామాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా విద్య రంగంలో కొత్త ఆవిష్కరణలకు దోహదపడేలా గూగుల్ క్లౌడ్‌కి అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించనుంది. నారాయణ సంస్థ గూగుల్ క్లౌడ్ అస్టేటెడ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ జెమినీ 2.5 ప్రొ, జెమినీ ఫ్లాష్ లను వెర్టెక్స్ ఏఐ ద్వారా వినియోగించబోతున్నారు. దీని ద్వారా ప్రతి విద్యార్థి అవసరాలకు అనుగుణమైన సౌకర్య వంతమైన లెర్నింగ్ సిస్టమ్స్ అభివృద్ధి చేయబడతాయి. ప్రతి విద్యార్థి ప్రతిభ, నేర్చుకునే వేగం, విద్యాశైలి ఆధారంగా ఏఐ ఆధారిత విద్యా ప్రయాణాలు రూపొందించబడతాయి. నారాయణ సంస్థ గూగుల్ భాగస్వామ్యం, భారత విద్యా రంగాన్ని ప్రస్తుతానికి తగ్గట్టుగా కొత్త మార్గాల్లో ముందుకు తీసుకెళ్లబోతోంది. నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ గూగుల్ క్లౌడ్ ఇండియాతో కలిసి విద్యను కొత్త దిశగా తీసుకెళ్తుంది. కొత్త ఒప్పందం ద్వారా విద్యార్థులకు వ్యక్తిగత అవసరాలపై దృష్టి పెట్టే, అందరికీ ఉపయోగపడే విధంగా ఫలితాలను ఆవిష్కరించే విద్యావిధానాలను అభివృద్ధి చేయనుంది. నారాయణ గ్రూప్ తమ డిజిటల్ వ్యవస్థను పూర్తిగా గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫ్లామ్‌తో అనుసంధానించనుంది. దీని వల్ల నారాయణ విద్యను మరింత మెరుగుపరిచేందుకు, ప్రత్యేకించి చిన్న పట్టణాలు, గ్రామాల్లోని విద్యార్థులకు మంచి విద్య అందించేందుకు మార్గం సుగమమవుతుంది. గూగుల్ క్లౌడ్ ఆధునిక ఏఐ టెక్నాలజీతో విద్యా రంగంలో కొత్త సాధనాలు అభివృద్ధి చేయటానికి అవసరమైన సాంకేతిక మద్దతును అందిస్తుంది. నారాయణ, గూగుల్ క్లౌడ్ రూపొందించిన పెద్ద లాంగ్వేజ్ మోడల్స్ (జెమిని 2.5 ప్రో, జెమిని ఫ్లాష్) ఆధారంగా స్టూడెంట్లకు అనుగుణంగా పనిచేసే స్మార్ట్ లెర్నింగ్ టూల్స్ తయారు చేయనుంది. నారాయణ విద్యాసంస్థల అధ్యక్షుడు పునీత్ కొత్తవ మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి ప్రత్యేకం. అందుకే అతని చదువూ ప్రత్యేకంగా ఉండాలి. ఈ భాగస్వామ్యం ద్వారా నారాయణ డిజిటల్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు అవసరమైన విధంగా ఏఐ ద్వారా సహాయం అందించబోతున్నామన్నారు. ఈ టెక్నాలజీ అంతా నారాయణ గ్రూప్‌కి చెందిన ఎన్ లెర్న్, ఎన్ కాన్సెప్ట్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా అందించబడతాయన్నారు.

## రాష్ట్రంలో ఆపరేషన్ ముస్కాన్..

### 7,678 బాలల సంరక్షణ

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** సిఐడి ఆధ్వర్యంలో రాష్ట్రంలో గత జూలై నెల ఒకటవ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగిన ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా వీధి బాలలు, బాల కార్మికులు మొత్తం 7,678 మంది బాలలను పోలీసులు రక్షించారు. ఇందులో 7149 మంది బాలలు వుండగా 529 మంది బాలికలు వున్నారు. వీరిలో ఒడిషా, బిహార్, ఎంపి, రాజస్థాన్‌తో పాటు నేపాల్‌కు చెం దిన 3783 మంది వున్నారు. వీరిలో 6718 మంది బాల కార్మికులు, 357 మంది వీధి బాలలు, 42 మంది యాచక బాలలు, ఇద్దరు వెట్టి చాకిరిలో వున్న వారు వున్నారు. వీరితో పాటు 559 మంది ఇతర చోట్ల పనిచేస్తున్న వారు వున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
వేములవాడ మునిసిపల్ కౌన్సిల్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
1) E1/580/VMD/LAF/CARTING/2025, ఎ) భూసేకరణ నిధుల క్రింద వేములవాడ మునిసిపాలిటీలో మహాంకాళిగుడి శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం వద్ద ఉన్న RCC, కచ్చా ఇళ్ళు కూల్చివేసిన మెటీరియల్ యొక్క బండిపై తొలగింపు. బి) మొత్తం అంచనా ధర రూ.22.00 లక్షలు. 2) పనుల సంఖ్య-(1). 3) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 02.08.2025, బిడ్స్ స్వీకరణ కొరకు చివరి తేది: 11.08.2025 సా.04.30గం. వరకు. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం : 11.08.2025 సా.04.45గం. తరువాత.
సం/-. కమిషనర్, వేములవాడ మునిసిపాలిటీ.
DIPR.NO. 5862-PP/CL/ADVT/1/2025-26 తేది: 01.08.2025

మిగిలిన షేర్‌హోల్డర్ల యొక్క గమనిక నిమిత్తం ఎగ్జిట్ ఆఫర్
స్కూటర్స్ ఇండియా లిమిటెడ్
(ఒక భారత ప్రభుత్వ సంస్థ), కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : L25111UP1972GOI003599
నమోదిత కార్యాలయం : 3/481, 1వ అంతస్తు, వికల్పఖండ్, గోమ్తీ నగర్, లక్నో, ఉత్తర ప్రదేశ్, ఇండియా-226010: ఫోన్ నం: 0522-3119593
వెబ్‌సైట్ : www.scootersindialimited.com, ఇ-మెయిల్ ID : csscootersindia@gmail.com
ఈ ఎగ్జిట్ ఆఫర్ పబ్లిక్ ప్రకటన ("ఎగ్జిట్ ఆఫర్ PA") ఆగస్టు 17, 2024న BSE లిమిటెడ్ ("BSE") నుండి స్కూటర్స్ ఇండియా లిమిటెడ్ ("కంపెనీ") యొక్క స్వచ్ఛంద డీలిస్టింగ్‌కు సంబంధించి ... ఈక్విటీ షేర్లకు రూ.31.78/ ఎగ్జిట్ ధర ("ఎగ్జిట్ ధర") ... నవంబర్ 16, 2024 మరియు జనవరి 04, 2025 మరియు ఏప్రిల్ 05, 2025 తేదీలలో "ఎగ్జిట్ ఆఫర్ PA"తో పాటు ... జూన్ 05, 2024 నాటి 2024060551 నంబరు నోటీసు ద్వారా ... జూన్ 20, 2024 నుండి BSE నుండి డీలిస్ట్ చేయబడిందని BSE తెలియజేసింది. ... జూన్ 20, 2024 నుండి జూన్ 19, 2026 వరకు లేదా SEBI అనుమతించే అంతకు ముందు తేదీ ("ఎగ్జిట్ విండో") ... రూ.31.78/ చొప్పున ... ఏప్రిల్ 21, 2025 నాటి SEBI లెటర్ నెం. SEBI/HO/CFD/RAC/DCR2/P/OW/2025/11275/1 ప్రకారం, ... (అంటే జూన్ 19,2025 వరకు) తగ్గించారు. దయచేసి గమనించండి. ...
దయచేసి కంపెనీ వెబ్‌సైట్ www.scootersindialimited.com నుండి ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్‌తో పాటు ("ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్"), రిజిస్ట్రార్ వెబ్‌సైట్ www.skylinerta.com నుండి మరియు ఆఫర్ మేనేజర్ వెబ్‌సైట్ www.corporateprofessionals.com నుండి యాక్సెస్ చేయండి లేదా క్రింది లింక్ను స్కాన్ చేయండి:
(ఎగ్జిట్ లెటర్ ఆఫ్ ఆఫర్ చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
(ఎగ్జిట్ దరఖాస్తు ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
(షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారం చదవడానికి ఈ QR కోడ్‌ను దయచేసి స్కాన్ చేయండి)
ప్రదేశం : లక్నో
తేదీ : ఆగస్టు 02, 2025
ఎక్వైరర్ తరపున మరియు కొరకు
సం/- నవీన్ కౌల్
(అధీకృత సంతకందారులు)

# తెర

## సైంటిఫిక్ సెన్సేషన్ థ్రిల్లర్ 'మాతృ'



హీరో శ్రీరామ్ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'మాతృ' ఇందులో సుగి విజయ్, రూపాలీ భూషణ్ జంటగా నటించారు అలీ, ఆమనీ, రవి కాలే, పృథ్వీ రాజ్, దేవి ప్రసాద్, నందినీ రాయ్ ముఖ్య భూమికలు పోషించారు ఈ చిత్రాన్ని శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్ పై బూర్లె శివ ప్రసాద్ ప్రతిష్ఠాతకంగా నిర్మించారు. సైంటిఫిక్ త్రిల్లర్ కథనం తో దర్శకుడు జాన్ జాక్కి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మాతృ చిత్రం ఆగస్ట్ 8 న మీ అభిమాన థియేటర్ లో ప్రదర్శింపబడుతుంది ఈ చిత్రం లోని సంగీతంకు ఆదిత్య మ్యూజిక్ లో మంచి వచ్చింది. నిర్మాత బి. శివప్రసాద్ మాట్లాడుతూ మా బ్యానర్ లో నిర్మించిన మాత్రు సినిమాను ఈ నెల 8వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. వీలైనన్ని ఎక్కువ థియేటర్స్ లో గ్రాండ్ గా రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నాం. ఒక డిఫరెంట్ సైంటిఫిక్ థ్రిల్లర్ మూవీగా మాత్రు మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన మా సినిమా కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. శేఖర్ చంద్ర మ్యూజిక్ ఆకర్షణగా నిలుస్తుంది. సినిమాకు కూడా థియేటర్స్ లో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం మని అన్నారు.

## మెహర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బన్ బటర్ జామ్' టీజర్..

ఆగస్ట్ 8న మూవీ గ్రాండ్ రిలీజ్ రాజు జెయమోహన్, ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ హీరో హీరోయిన్లుగా రాఘవ్ మిర్‌దత్ దర్శకత్వంలో.. సురేష్‌సుబ్రమణియన్ సమర్పకుడిగా రెయిన్ ఆఫ్ ఎరోస్, సురేష్ సుబ్రమణియన్ నిర్మించిన ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనం 'బన్ బటర్ జామ్' ఔట్ అండ్ ఔట్ కామెడీగా తమిళం లో రిలీజ్ అయ్యి సూపర్ హిట్ అయ్యింది. ఈ మూవీని తెలుగులో ఆగస్టు 8న శ్రీ విఘ్నేశ్వర ఎంటైన్మెంట్స్ బ్యానర్ పైన సిహెచ్ సతీష్ కుమార్ ఆగస్ట్ 8న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.



ఈ నేపథ్యంలో గురువారం టీజర్‌ను టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మెహర్ రమేష్ విడుదల చేసి సినిమా పెద్ద సక్సెస్ కావాలని చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. 'బన్ బటర్ జామ్' టీజర్‌ను గమనిస్తే తల్లిదండ్రులైన చార్లి, శరణ్య పొన్‌వనన్ తమ కొడుకు గొప్పతనం గురించి మరొకరితో ఫోన్‌లో చెబుతుంటారు. మరో వైపు హీరో క్యారెక్టర్‌ను ఫన్నీగా ప్రజెంట్ చేశారు. అలాగే హీరో, హీరోయిన్ మధ్య లవ్ ట్రాక్‌ను కూడా ఎంటర్‌టైనింగ్ వేలోనే చూపించటం కొస మెరుపు. సునిశితమైన ఎమోషన్, అన్‌స్టాపబుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మూవీ ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టమవుతోంది. రాఘవ్ మిర్‌దత్ ఫన్నీగా సినిమాను తెరకెక్కించిన తీరు, నివాస్ కె.ప్రసన్న సంగీతం, బాబు కుమార్ సినిమాటోగ్రఫీతో పాటు ప్రొడక్షన్ వేల్యూస్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఆగస్ట్ 8న రిలీజ్ కాబోతున్న ఈ సినిమాను తెలుగులో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సి.హెచ్.సతీష్ కుమార్ విడుదల చేస్తున్నారు. నటీనటులు: రాజు జెయమోహన్, ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ, చార్లి, శరణ్య పొన్‌వన్నన్, దేవదర్శిని, మైకేల్ తంగదురై, విజె.పప్పు తదితరులు. సాంకేతిక వర్గం:రచన, దర్శకత్వం: రాఘవ్ మిర్‌దత్, నిర్మాతలు: రెయిన్ ఆఫ్ ఎరోస్, సురేష్ సుబ్రమణియన్, సంగీతం: నివాస్ కె.ప్రసన్న, సినిమాటోగ్రఫీ: బాబు కుమార్, ఎడిటర్: జాన్ అబ్రహం, వి.ఎఫ్.ఎక్స్ ప్రొడ్యూసర్: స్టాలిన్ శరవణన్‌ఆర్ట్: శశికుమార్, ప్రాజెక్ట్ డిజైనర్: సతీష్ కె, కొరియోగ్రఫీ: బాబి, స్టంట్: ఓం ప్రకాష్, సౌండ్ డిజైన్: సింక్ సినిమా, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: ఎం.జె.భారతి, పి.ఆర్.ఓ: నాయుడు సురేంద్రకుమార్, ఫణి కందుకూరి బియాండ్ మీడియా .

## 'వచ్చిన వాడు గౌతమ్' బర్త్ డే పోస్టర్ రిలీజ్

యంగ్ ట్యాలెంటెడ్ హీరో అశ్విన్ బాబు మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి మామిడాల ఎం .ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్‌నెంబర్ 3గా రూపొందు తున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి. గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో ప్రొడ్యూసర్.



ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇంటెన్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది.

ఇటివలే భారీ బడ్జెట్‌తో హైవోల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు. హై టెక్నాలజీని వాడి ఈ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేశారు. నిర్మాత గణపతి రెడ్డి ఎలాంటి రాజీ లేకుండా, పెద్ద చిత్రాలకు ఏమాత్రం తీసిపోని ప్రొడక్షన్ విలువలతో సినిమాను తెరకెక్కిస్తున్నారు.

రియా సుమన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీశర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్, విటివి గణేష్, కీలక పాత్రలు పోహిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎన్. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ. ఆయన విజువల్ ప్రెజెంటేషన్ ఈ క్లైమాక్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్తుంది. చిత్రానికి గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు. వర్మా ఎడిటర్.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు. నటీనటులు: అశ్విన్ బాబు, రియా సుమన్, అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్, విటివి గణేష్, యెష్నా చౌదరి, సుదర్శన్, శకలక శంకర్, రాఘవ, అభిత్ భూషణ్, నాగి, అభినయ, సాయి రోనక్, విద్యుల్లేఖ. సాంకేతిక నిపుణులు :

స్టోరీ – స్క్రీన్ ప్లే – డైరెక్షన్ : మామిడాల ఎం. ఆర్. కృష్ణ నిర్మాత :టి. గణపతి రెడ్డి
కో ప్రొడ్యూసర్ : ప్రవల్లిక యోగిలైన్ ప్రొడ్యూసర్ :టి. బద్రి నాథ్ రెడ్డి
బ్యానర్ : అరుణ శ్రీ ఎంటర్టైన్మెంట్స్‌డీవోపీ : ఎం. ఎన్ బాల్ రెడ్డి,
మ్యూజిక్ : గౌరహరిఎడిటింగ్ : ఎమ్.ఆర్. వర్మా ఫైట్స్ : పృథ్వీ, రామకృష్ణ ఆర్ట్ : సురేష్ భీమగని
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎ.దుర్గేష్‌కో – డైరెక్టర్ : యు. కృష్ణ కిషోర్ పబ్లిసిటీ డిజైన్: అనిల్ భాను
పీఆర్వో : తేజస్వి సజ్జా.

## ఆగస్టులో కొత్త చిత్రాల వెల్లువ..

ఆ 2 సినిమాలే మేజర్‌గా ఈ మధ్య కాలంలో సరిగ్గా సినిమాలు పెద్దగా రావడం లేదనే కంప్లైంట్స్ మూవీ లవర్స్ లో ఉన్నాయి. జూలైలో ఒక్క హరిహర వీరమల్లు నోటెడ్ గా కనిపించింది. దాని తర్వాత కింగ్డమ్. ఇక నెక్స్ట్ ఆగస్ట్ ఇపుడు రానే వచ్చింది. ఈ రావడంతోనే నెలాఖరు వరకు పాన్ ఇండియా లెవెల్లో మంచి స్టార్ కాస్ట్ తో కూడిన సినిమాలే లైన్ లో వేచి ఉన్నాయి. వీటితో పాటుగా పలు రీరిలీజ్ లు కూడా అవన్నీ ఏంటో డేట్స్ వారీగా చూద్దాం.



**సర్ మేడమ్ – ఆగస్టు 1**

మక్కల్ విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మెయిన్ లీడ్ లో నటించిన తమిళ చిత్రం 'తలైవన్ తలైవి' గత వారమే తమిళ్ లో విడుదల అయ్యింది. తెలుగులో కూడా అప్పుడే విడుదల కావాల్సి ఉంది కానీ ఆగింది. ఇప్పుడు తెలుగులో 'సర్ మేడమ్'గా విడుదల అయ్యింది.

**సన్ ఆఫ్ సర్దార్ 2 – ఆగస్టు 1**

బాలీవుడ్ స్టార్ నటుడు అజయ్ దేవగన్ మన తెలుగు సూపర్ హిట్ మర్యాద రామన్నకు రీమేక్ గా చేసిన సన్నాఫ్ సర్దార్ కి సీక్వెల్ ఇది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమా నేడు థియేటర్స్ లో హిందీలో విడుదల అయ్యింది.

**ధడక్ 2 – ఆగస్టు 1**

'సన్ ఆఫ్ సర్దార్ 2' తో పాటు విడుదల అవుతున్న ఈ యువ ప్రేమకథ, తమిళ చిత్రం 'పరియేరుమ్ పెరుమాళ్'కు హిందీ రీమేక్. అనిమల్ ఫేమ్ త్రిప్తి డిమ్రి, అలాగే యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది నటించిన ఈ చిత్రానికి షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహించారు.

బకాసుర రెస్టారెంట్ – ఆగస్టు 8

నటుడు ప్రవీణ్ హీరోగా మారి చేసిన ఈ ఫుడ్ జానర్ సినిమా బకాసుర రెస్టారెంట్ ఆగస్ట్ 8న విడుదల కాబోతుంది.

**అతడు – రీరిలీజ్ – ఆగస్టు 9**

సూపర్ స్టార్ మహేష్ బాబు బర్త్ డే కానుకగా మేకర్స్ ఈ సినిమాని రీరిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ లలో మహేష్ కి మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఇది మరిన్ని రికార్డులు సాధిస్తుంది అని అభిమానులు నమ్ముతున్నారు. త్రివిక్రమ్ తెరకెక్కించిన సినిమాకి మణిశర్మ సంగీతం అందించారు.

**కూలీ – ఆగస్టు 14**

సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ'తో వస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో స్టార్ నటులతో వస్తున్న ఈ సినిమా స్వాతంత్ర దినోత్సవం కానుకగా ముందే విడుదల కాబోతుంది. **వార్ 2 – ఆగస్టు 14**

ఇక ఇదే డేట్ లో బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, కియారా అద్వానీ అలాగే జూనియర్ ఎన్టీఆర్ లతో అయన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం వార్ 2. దీనిపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా కూడా ఆరోజే బిగ్ స్క్రీన్స్ ని హిట్ చేయనుంది.

**పరదా – ఆగస్టు 22**

ఇది ఒక స్ట్రెయిట్ తెలుగు సినిమా, ప్రదీప్ కాండ్రేగుల దర్శకత్వం వహించారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించగా, దర్శనా రాజేంద్రన్, సంగీత సహాయక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం మంచి ప్రమోషన్స్ ఈ సినిమా చేసుకుంటుంది.

**స్టాలిన్ రీరిలీజ్ – ఆగస్టు 22**

మెగాస్టార్ చిరంజీవి నటించిన పవర్ఫుల్ మెసేజ్ యాక్షన్ డ్రామా ఈ స్టాలిన్. దర్శకుడు ఏ ఆర్ మురుగదాస్ తెలుగులో చేసిన మొదటి సినిమా ఇదే కాగా మెగాస్టార్ పుట్టినరోజు కానుకగా రీరిలీజ్ కి రాబోతుంది. దీనిపై మంచి బజ్ ఉంది.

సుందరకాండ – ఆగస్టు 27 ఈ ఫీల్‌గుడ్ తెలుగు డ్రామాలో నారా రోహిత్ నటించగా, వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించారు. భావోద్వేగంగా కథనాన్ని ఆశించే ప్రేక్షకులను ఈ సినిమా ఆకట్టుకుంటుందని భావిస్తున్నారు.

హృదయపూర్వం – ఆగస్టు 28

బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తో ఫామ్ లో ఉన్న మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నుంచి ఈ ఏడాదిలో వస్తున్న మూడో సినిమానే 'హృదయపూర్వం'. దీనికి సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించారు. ఇది మోహన్ లాల్ కి హ్యాట్రిక్ గా నిలుస్తుందో లేదో చూడాలి.

**రివాల్వర్ రీటా – ఆగస్టు 29**

స్టార్ నటి కీర్తి సురేష్ నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్ సినిమానే ఈ 'రివాల్వర్ రీటా' ఎప్పుడో తెరకెక్కించిన ఈ ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమా ఆగస్టు ఆఖరుకి లాక్ అయ్యింది.

**పరం సుందరి – ఆగస్టు 29**

దేవర బ్యూటీ జాన్వీ కపూర్, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా కలయికలో తుషార్ జలోటా దర్శకత్వం వహించిన సినిమానే పరం సుందరి.. బ్లాక్ బస్టర్ ప్రొడక్షన్ హౌస్ మడాక్ ఫిల్మ్స్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా పట్ల కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇలా ఆగస్టు ఒకటో తారీఖు నుంచే ప్రతీ వారం మినిమమ్ ఒక్క నోటెడ్ సినిమా అయినా ఆడియెన్స్ ని పలకరించేందుకు సిద్ధంగా ఉంది. మరి వీటి ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి .

## చిరు బర్త్ డే రోజున డబుల్ ట్రీట్ ప్లాన్: అనిల్ రావిపూడి..

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను అనిల్ తనదైన మార్క్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నాడు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి త్వరలోనే రెండు భారీ అప్డేట్స్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోందట.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు కానుకగా ఆగస్టు 22న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌తో పాటు ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించబోతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ త్వరలోనే చేయబోతున్నారట మేకర్స్. ఇక ఈ సినిమాలో చిరు పాత్ర అభిమానులకు ఫుల్ మీల్స్ పెట్టడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ సినిమాలో స్టార్ బ్యూటీ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



## నార్త్‌లో మహావతార్ నరసింహా సెన్సేషన్..!



అసలు ఎలాంటి స్టార్ కాస్ట్ లేకుండా ఒక యానిమేషన్ సినిమా ఇపుడు పాన్ ఇండియా లెవెల్లో దుమ్ము లేపుతుంది. మరి ఆ చిత్రమే "మహావతార్ నరసింహా". దర్శకుడు అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమా ఒక ఊహించని బ్లాక్ బస్టర్ అని చెప్పాలి. తెలుగు, హిందీ భాషల్లో ఈ యానిమేషన్ సినిమా భారీ వసూళ్లు అందుకుంటుంది.

ఇక నార్త్ లో అయితే వీక్ డేస్ లోకి వచ్చినప్పటికీ అదే నిలకడతో దూసుకెళ్తుండడం విశేషం. సోమవారం నుంచి నిన్న గురువారం వరకు కూడా ఒకో రోజుకి గ్రాఫ్ పెరుగుతూనే వెళ్ళింది తప్పితే ఈ చిత్రం ఎక్కడా తగ్గింది లేదు. ఇలా 3.8 కోట్ల నెట్ వసూళ్ల నుంచి నిన్న గురువారానికి 5.9 కోట్ల నెట్ వసూళ్ల మార్క్ ని ఈ చిత్రం సొంతం చేసుకోవడం విశేషం.

దీనితో మొత్తం 32.8 కోట్ల నెట్ వసూళ్లు ఒక్క హిందీ వెర్షన్ లోనే ఈ సినిమా రాబట్టడం అనేది సెన్సేషన్ అని చెప్పాలి. ఇక వీక్ డేస్ లోనే ఇలా ఉంటే నేడు రేపు వీకెండ్ హాలిడేస్ ఏ లెవెల్లో ఉంటాయో కూడా అర్థం చేసుకోవచ్చు. సో ఈ రెండు రోజుల్లో ఈ చిత్రం ఎలాంటి వసూళ్లు రాబడుతుంది అనేది వేచి చూడాలి.

## ఒటిటికి వచ్చిన లేటెస్ట్ మూవీ '3 బిహెచ్‌కె'

తమిళ సహా తెలుగు ఆడియెన్స్‌కి బాగా దగ్గరైన కోలీవుడ్ హీరోస్ లో టాలెంటెడ్ నటుడు సిద్ధార్థ్ కూడా ఒకరు.

మరి సిద్ధార్థ్ నటించిన రీసెంట్ చిత్రమే చి3 బి హెచ్ కె". దర్శకుడు సాయి గణేష్ తెరకెక్కించిన ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా డీసెంట్ రన్ అందుకుంది.

నటుడు శరత్ కుమార్, దేవయాని, చైత్ర జె ఆచార్ తదితరులు నటించిన ఈ చిత్రం ఎట్టకేలకి ఒటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసింది.

మరి ఈ చిత్రం కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వారు నేటి నుంచి అందుబాటులోకి తీసుకొచ్చేసారు. ఇందులో నేటి నుంచి తమిళ్ సహా తెలుగులో ఈ చిత్రం అందుబాటులోకి వచ్చింది. మరి అప్పుడు మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునే వారు ఈ చిత్రాన్ని చూడొచ్చు. ఇక ఈ సినిమాకి అమృత్ రామ్ నాథ్ సంగీతం అందించగా అరుణ్ విశ్వ నిర్మాణం వహించారు.



### 'మిత్ర మండళ్లి' నుంచి మరో సరదా గీతం



ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండళ్లి'. అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భానుప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగలనిర్మిస్తున్నారు. ప్రియ దర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడియా సంచలనంనిహారికఎన్. ఎం. తెలుగుతెరకు పరిచయ మవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, 'కత్తందుకో జానక్షి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా స్వేచ్ఛ స్టాండు. విడుదలైంది. 'మిత్ర మండళ్లి' నుంచి మొదటి గీతంగా విడుదలైన 'కత్తందుకో జానక్షి' అందరూ సరదాగా పాడుకునేలా ఉండి, సోషల్ మీడియాలో ఒక ఊపు ఊపింది. ఇప్పుడు రెండవ గీతంగా వచ్చిన 'స్వేచ్ఛ స్టాండు' కూడా అంతే సరదాగా ఉంది. ఆర్.ఆర్. ధృవన్ స్వరపరిచిన ఈ పాటకు ఆర్.ఆర్. ధృవన్, విజయేందర్ ఎస్ సంయుక్తంగా సాహిత్యం అందించారు. తేలికైన ఇంగ్లీష్ పదాలతో సరదా సరదాగా ఈ గీత రచన ఉంది.. కథానాయిక దృష్టిలో పడటం కోసం కథానాయకులు వచ్చీరాని ఇంగ్లీష్ పదాలతో పాట పడటం భలే సరదాగా ఉంది. ముఖ్యంగా ఈ తరం శ్రోతలకు నచ్చేలాస్వేచ్ఛ స్టాండుగీతం సాగింది. వెన్నెలకిషోర్, సత్య, వి.టి.వి. గణేష్ ముఖ్యపాత్రలుపోషిస్తున్న ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందంపని చేస్తోంది. ఛాయా గ్రాహకుడిగా సిద్ధార్థ్ఎస్. జె, కళాదర్శకుడిగా గాంధీనడికుడికర్ వ్యవహరిస్తున్నారు .పీకేఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సహనిర్మాతగా సోమరాజుఎన్మెత్స, ఎగ్జిక్యూటివ్‌ప్రొడ్యూసర్‌గా రాజీవ్‌కుమార్‌రామా వ్యవహరి స్తున్నారు. టీజర్, 'కత్తందుకో జానక్షి' గీతం ఆకట్టుకొని 'మిత్ర మండళ్లి' చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడేలా చేశాయి. థియేటర్లలో మనస్ఫూర్తిగానవ్వుకునేలా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.

ప్రేక్షకులకు సరికొత్తవినోదాన్ని అందించడానికి త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో అడుగుపెట్టనుంది.



## 'అరేబియా కడల్లి' లో ఆసక్తి రేపుతున్న సత్యదేవ్!

మత్స్యకారుల బతుకుపోరాటం: 'అరేబియా కడల్లి' ట్రైలర్తో ఆసక్తి రేపుతున్న సత్యదేవ్!

కొన్ని కథలు వినడానికే ఆసక్తిగా ఉంటాయి. మరికొన్ని తెరపై చూస్తే మనసును కదిలిస్తాయి. అలాంటి ఒక బలమైన కథతో వస్తున్నారు సత్యదేవ్! ఆయన నటించిన ప్రైమ్ వీడియో ఒరిజినల్ సిరీస్ 'అరేబియా కడలి' ట్రైలర్ తాజాగా విడుదలై, సినీ ప్రియుల్లో చర్చకు దారితీసింది.

క్రిష్ జాగర్లమూడి సమర్పణలో, వి.వి. సూర్య కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్, సముద్రంలో చేపల వేటపైఆధారపడి జీవించే కొందరు మత్స్యకారుల హృదయవిదారక కథను ఆవిష్కరించనుంది. అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటి, విదేశీ గడ్డపై బందీలుగా మారిన వారి పోరాటం, బంధాలు, ఆశల గురించి ఈ సిరీస్ వివరంగా చూపించనుంది. ట్రైలర్లో కనిపించిన దృశ్యాలు, సంభాషణలు, నేపథ్య సంగీతం సిరీస్కు హైఇంటెన్సిటీ డ్రామాను అందిస్తున్నాయి. సత్యదేవ్ 'బద్రి' పాత్రలో, ఆనంది 'గంగ' పాత్రలో ఒదిగిపోయినట్లున్నారు.

ఇతర నటులైన నజర్, రఘు బాబు వంటివారు కూడా సిరీస్కు మరింత బలం చేకూర్చారు. దర్శకుడు సూర్య కుమార్ మాట్లాడుతూ, 'ఇది కేవలం బ్రతకడం గురించి కాదు, మనుషులు కష్టాల్లో ఎలా ఒకరికొకరు అండగా నిలబడతారో చూపిస్తుంది' అని చెప్పడం సిరీస్ థీమ్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తుంది. సత్యదేవ్ కూడా తన కెరీర్లోనే ఇదొక ఛాలెంజింగ్ రోల్ అని పేర్కొన్నారు

.సత్యదేవ్ తన పాత్ర గురించి మాట్లాడుతూ, ఇది తనకెరీర్లో అత్యంత తీవ్రమైన మరియు సంతృప్తినిచ్చిన ప్రయాణాలలో ఒకటి అని అన్నారు. కష్టాలు, త్యాగాల మధ్య చిక్కుకున్న ఒక పాత్రను పోషించడం చాలా సవాలుతో కూడుకున్నదని చెప్పారు. ఆనంది కూడా తన 'గంగ' పాత్ర గురించి మాట్లాడుతూ, అందులో చాలా ఎమోషన్స్ ఉన్నాయని, అన్యాయంపై పోరాడేమహిళగా నటించడం సంతృప్తి నిచ్చిందని తెలిపారు.

ట్రైలర్లో కనిపించిన నటీనటుల అద్భుతమైన నటన, నేపథ్య సంగీతం సిరీస్కు మరింత బలం చేకూర్చాయి.

## మదరాసినుంచి సెలవికకన్నమ్మా



శివకార్తికేయన్, అనిరుధ్ రవిచందర్, మురుగదాస్, శ్రీ లక్ష్మి మూవీస్ 'మదరాస్' నుంచి లవ్ ఫెయిల్యూర్ యాంథమ్ సెలవిక కన్నమ్మా రిలీజ్ సెప్టెంబర్ 5న థియేటర్స్ లో రిలీజ్‌వెరీ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ ఇద్దరూ తొలిసారి కలిసి చేస్తున్న సినిమా మదరాసి. అద్భుతమైన థ్రిల్ తో పాటు మాస్ ఎంటర్టైనర్స్‌కి కొత్త డైమెన్షన్ ఇచ్చేలా ఈ సినిమా తెరకెక్కుతోంది. శ్రీ లక్ష్మి మూవీస్ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. టాలెంటెడ్ హీరోయిన్ రుక్మిణీ వసంత ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లిమ్స్ భారీ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది.

ఈ చిత్రానికి రాకింగ్ స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ కంపోజ్ చేశాడు. ఫస్ట్ సింగిల్ సెలవిక కన్నమ్మా తో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. టీజర్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండగా, ఈ పాట మాత్రం వెరీ డిఫరెంట్ గా వుంది. లవ్ ఫెయిల్యూర్ సాంగ్ అయినప్పటికీ, డ్యాన్స్ తో ప్రజెంట్ చేయడం ఆకట్టుకుంది.

అనిరుధ్ కంపోజిషన్ డిఫరెంట్ వైబ్ ని క్రియేట్ చేసింది. శ్రీనివాస మౌళి లిరిక్స్ మరింతగా ఆకట్టుకున్నాయి. ధనుంజయ్ సీపాన వోకల్స్, గ్రూవీ మ్యూజిక్, శివకార్తికేయన్ ఎఫర్ట్‌లెస్ స్క్రీన్ ప్రెజెన్స్ – ఇవన్నీ కలిసి బ్రేకప్ జెనరేషన్‌కి ఇది లవ్ ఫెయిల్యూర్ యాంథమ్ గామారిపోయింది. ఈ చిత్రంలో విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీసుదీప్ ఎలమోన్ అందిస్తున్నారు. మదరాసి సెప్టెంబర్ 5న థియేటర్లలో రిలీజ్ కానుంది .

# ట్రంప్‌కు నోబెల్‌శాంతి ఇవ్వాల్సిందే

## వైట్‌హౌస్ తాజా డిమాండ్

## ట్రంప్ ఆధ్వర్యంలో నెలకోశాంతి ఒప్పందం



**వాషింగ్టన్,ఆగస్టు 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలనే డిమాండ్‌ను వైట్‌హౌస్ పునరుద్ఘాటించింది. ట్రంప్ నెలకు సగటున ఒకటి చొప్పున శాంతి ఒప్పందాలు కుదుర్చుతున్నారని చెప్పింది. దీంతోపాటు భారత్ పాక్ కాల్పుల విరమణపై మరోసారి వైట్‌హౌస్ ప్రకటించింది. ట్రంప్ అనేక ప్రాంతాల్లో కాల్పుల విరమణలకు మధ్యవర్తిత్వం వహించారు. ఇటీవల థాయిలాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణకు సాయం చేశారు. ఘర్షణలు ఆపకపోతే వాణిజ్య చర్చలు ఉండవని ట్రంప్ చెప్పారు. భారత్ పాక్ మధ్య యుద్ధాన్ని ట్రంప్ ఆపారు. ఇజ్రాయెల్ ఇరాన్, రువాండా కాంగో యుద్ధాన్ని ట్రంప్ ఆపారు. సెర్బియా కొసావో, ఈజిప్ట్ ఇథియోపియా మధ్య విభేదాలను ట్రంప్ ముగించారని తెలిపిన వైట్‌హౌస్ ఇప్పటికే ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి రావాల్సిందని పేర్కొంది. గతంలో పాకిస్తాన్ కూడా తీర్మానంచేసి అమెరికాకు నార్వేలోని నోబెల్ అకాడమీకి పంపిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. భాగస్వామ్య దేశాలపై కొత్త సుంకాలు విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. కాగా ఆగస్టు 7 నుంచి కొత్త సుంకాలు అమల్లోకి రానున్నాయి. 10 శాతం నుంచి 41 శాతం వరకు పరస్పర సుంకాలను ఉత్తర్వులపై సంతకాలు చేశారు. దాదాపు 70 దేశాలపై ఉన్న సుంకాలను పెంచగా, ఇందులో సిరియాపై అత్యధికంగా 41శాతం టారిఫ్‌ను విధించారు. ఇంకా కెనడా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాన్ని 25 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై ఇప్పటికే ఉన్న 10 శాతం సుంకాలకు అదనంగా 40శాతం జత చేశారు. ఇక జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం సుంకం ఉంటుందని ట్రంప్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే భారత్‌పై విధించిన 25శాతం సుంకాలు మాత్రం ఆగస్టు 1 నుంచే అమల్లోకి రానున్నాయి. ట్రంప్ విధించిన ఆగస్టు 1 గడువుకు ముందే వివిధ దేశాలు, కూటములు అమెరికాతో ఒప్పందాలు ఖరారు చేసుకున్నాయి. ఆయా దేశాలపై కొత్త టారిఫ్‌లు అమలు కానున్నాయి. ఈ ఉత్తర్వు ట్రంప్ వాణిజ్య అజెండాలో కీలకదశగా భావిస్తున్నారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాలను పరీక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా టారిఫ్‌ల మోతకు భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందనే ఊహాగానాలను అధికార వర్గాలు కొట్టిపడేశాయి. ఇరుదేశాల ప్రయోజనాలకు అనుగుణంగా జరిగే చర్చల్లో నిర్ణయాలు తీసుకుంటామని తెలిపాయి. ట్రంప్ సుంకాలపై భారత్ ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోదని అధికార వర్గాలు వెల్లడించాయి. మోనమే సరైన సమాధానమని, ఏదైనా చర్చల ద్వారానే పరిష్కరిస్తామని చెప్పాయి. అయితే, ట్రంప్ టారిఫ్‌లు భారత ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## రూ.1.96 లక్షలకోట్లకు పెరిగిన జీఎస్టీ వసూళ్లు

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** దేశంలో వస్తుసేవలపన్ను వసూళ్లు నెలనెలా గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రతినెల కూడా లక్షన్నరకోట్లకుపైగానే జీఎస్టీ వసూళ్లవుతుండటంతో పన్ను వసూళ్లలో ప్రగతి కనిపిస్తున్నట్లు జిఎస్టీ డైరెక్టరేట్ పేర్కొంటున్నది. ఇక జులై నెల వసూళ్ల డేటాను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. గత ఏడాది జులైతో పోలిస్తే, ఈ జులై మాసంలో జీఎస్టీ వసూళ్లు 7.5 శాతం పెరిగి రూ. 1.96 లక్షల కోట్లకు చేరాయి. దేశీయ లావాదేవీలు, దిగుమతుల నుంచి వచ్చిన ఆదాయం ఈ పెరుగుదలకు కారణం. అయితే, ఇటీవలి నెలలతో పోలిస్తే వృద్ధి కాస్త తక్కువగా ఉంది. 2025 ఏప్రిల్‌జులై మధ్య జీఎస్టీ వసూళ్లు రూ. 8.18 లక్షల కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది రూ. 7.39 లక్షల కోట్లతో పోలిస్తే 10.7 శాతం పెరిగాయి. జులైలో సెంట్రల్ జీఎస్టీ రూ. 35,470 కోట్లు, స్టేట్ జీఎస్టీ రూ. 44,059 కోట్లు, సమీకృతజీఎస్టీ రూ. 1,03,536 కోట్లు, సెస్ రూ. 12,670 కోట్లు వసూలయ్యాయి. జులైలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.8 లక్షల కోట్లకు పైగా ఉన్నప్పటికీ, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో సగటు రూ. 2.1లక్షల కోట్లతో పోలిస్తే తక్కువ. ఏప్రిల్‌లో రూ. 2.37 లక్షల కోట్లు, మేలో రూ.2.01లక్షల కోట్లు వసూలయ్యాయి. రీఫండ్‌ల తర్వాత జులై నికర జీఎస్టీ ఆదాయం రూ. 1,68,588 కోట్లుగా ఉంది, గత ఏడాదితో పోలిస్తే 1.7శాతం మాత్రమే పెరిగింది. రీఫండ్‌లు రూ. 27,147 కోట్లకు పెరగడం దీనికి కారణం. ఏప్రిల్‌జులైలో నికర జీఎస్టీ ఆదాయం 8.4 శాతం పెరిగి రూ. 7.11 లక్షల కోట్లకు చేరింది.రాష్ట్రాల వారీగా త్రిపురా 41 శాతం, మేఘాలయ 26 శాతం వృద్ధి సాధించాయి. మధ్యప్రదేశ్ 18శాతం, బీహార్ 16 శాతం, ఆంధ్రప్రదేశ్ 14శాతం పెరిగాయి. మహారాష్ట్ర రూ.30,590 కోట్లతో 6 శాతం వృద్ధి నమోదుచేసింది. కర్ణాటక 7 శాతం, తమిళనాడు 8శాతం, గుజరాత్ 3శాతం పెరిగాయి. మణిపూర్‌లో 36శాతం,మిజోరంలో 21శాతం వసూళ్లు తగ్గాయి. జులైలో తయారీ రంగం 16 నెలల గరిష్ఠ స్థాయికి చేరి ఆర్థిక గతిని బలపరిచింది.

# భారత్ కారణంగా రెచ్చిపోతున్న పుతిన్

## యుఎస్ విదేశాంగ మంత్రి రూబియో సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఆగస్టు 1:** భారత్, రష్యా చమురు కొనుగోలు విషయమై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా దగ్గర భారత్ కొంటున్న చమురుతోనే పుతిన్ ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇదే భారత్‌తో చర్చల్లో తమను ఇబ్బందిపెట్టే అంశమని వ్యాఖ్యలు చేశారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో గురువారం ఫాక్స్ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'అన్ని దేశాల్లాగే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు చమురు, బొగ్గు, గ్యాస్ కొనగలిగే శక్తి భారత్‌కు ఉంది. అయితే, భారత్ తమ అవసరాల దృష్ట్యా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. భారత్‌కు భారీగా ఇంధన అవసరాలు ఉన్నాయి. రష్యాపై పలు దేశాల ఆంక్షల వల్ల అక్కడ భారత్‌కు చమురు చౌకగా లభిస్తోంది. దురదృష్టవశాత్తూ భారత్ చమురు కొనుగోలు చేస్తున్న కారణంగానే రష్యాకు నిధులు సమకూరుతున్నాయి. వాటిని రష్యా..ఉక్రెయిన్‌తో యుద్ధం చేయడంతో వాడుకుంటోంది. అదే యుద్ధంలో మనగలగడానికి రష్యాకు ఉపయోగపడుతోందన్నారు. అలాగే, ఇదే భారత్‌తో చర్చల్లో అమెరికాను ఇబ్బంది పెట్టే అంశం. ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాదారు. వ్యూహాత్మక భాగస్వామి. అయితే అన్ని అంశాల్లో మాదిరిగా విదేశాంగ విధానంలోని ప్రతి విషయంలో 100 శాతం సమయం కేటాయించడం సాధ్యం కాదు' అని పేర్కొన్నారు. ఇక, అంతకుముందు.. భారత్, రష్యా బంధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. తనకేం సంబంధం లేదంటూనే శాపనార్థాలు పెట్టారు. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చుకోనీయండని, కలిసి మునగనీయండని వ్యాఖ్యానించారు. బుధవారం భారత్‌పై 25 శాతం సుంకాలతోపాటు పెనాల్టీ విధిస్తూ ప్రకటన చేసిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్ ఏం చేస్తుందన్న విషయాన్ని అసలు పట్టించుకోబోమని, వారిద్దరూ మునిగిపోతుంటే మాకెందుకని, మిగిలిన అందరి గురించి పట్టించుకుంటామని స్పష్టం చేశారు. 'మనకు భారత్ స్నేహితురాలే అయినా ఆ దేశంతో స్వల్ప లావాదేవీలే ఉన్నాయి. ఆ దేశం సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో దాడులు ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తి అరుస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి ఆయుధాలను, ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## బీజింగ్‌లో వరదల బీభత్సం: 80వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు



**బీజింగ్, ఆగస్టు 1:** చైనాలో గత వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు అనేక ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలకు బీజింగ్‌లో జనజీవనం స్తంభించిపోయింది. వేలాది మంది తమ నివాసాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రాజధాని గ్రామీణ శివారులోని ప్రాంతాలు ఎక్కువగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. బీజింగ్ లోని ఉత్తర పర్వత జిల్లాలైన మియున్, యాంకింగ్‌ల్లో శనివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అధిక సంఖ్యలో జనం మరణించారని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలకు దాదాపు 44 మంది మృతి చెందారని, మరో తొమ్మిది మంది గల్లంతయ్యారని స్థానిక అధికారిక మీడియా ప్రకటించింది. వరద దాటికి రోడ్లు దెబ్బతిన్నాయని, కరెంట్ స్థంబాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం సహాయ చర్యలను ముమ్మరం చేసింది. 80 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపుమరో వైపు వర్షాల కారణంగా ప్రభావితమయ్యే ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్. ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారి ఆస్తులకు భద్రత కల్పించాలన్నారు. అయితే కేవలం బీజింగ్‌లోనే 80 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు తెలిపారు. వరద ఉధృతికి 31 రోడ్లు దెబ్బతిన్నాయని, 136 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని చైనా మీడియా కథనాలు పేర్కొన్నాయి. వరదల నేపథ్యంలో చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ, అత్యవసర నిర్వహణ మంత్రిత్వ శాఖ సమావేశం ఏర్పాటు చేసింది. తొమ్మిది ప్రాంతాలకు కేంద్ర విపత్తు సహాయ నిధులను కేటాయించింది. చైనా జాతీయ అభివృద్ధి సంస్థ కూడా సహాయ చర్యలకోసం నిధులను కేటాయించింది. వరద బాధిత ప్రాంతాల్లోని గ్రామస్థులు అక్కడి మీడియాతో మాట్లాడారు. వరద ప్రవాహానికి ఇళ్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయని అన్నారు. ఖినా 40 ఏళ్ల జీవితంలో ఇలాంటి వరదలను ఎన్నడూ చూడలేదని బీజింగ్ జిల్లా హుయిరో గ్రామస్తుడు అన్నారు.

# 70 దేశాలకు సుంకాలు పెంచిన ట్రంప్

## పాకిస్థాన్‌కు తగ్గింపు

**వాషింగ్టన్, ఆగస్టు 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకు పడ్డారు. దాదాపు 70 దేశాలపై ఉన్న సుంకాలను పెంచారు. 10 శాతం నుంచి 41 శాతం వరకు పరస్పర సుంకాలను విధించే కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఇందులో సిరియాపై అత్యధికంగా 41 శాం టారిఫ్‌ను విధించారు. కెనడా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాన్ని 25 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. బ్రెజిల్‌పై ఇప్పటికే ఉన్న 10 శాతం సుంకాలకు అదనంగా 40 శాతం జత చేశారు. ఇక, భారత్‌పై 25 శాతం టారిఫ్ విధించారు. అయితే, పాకిస్థాన్ దిగుమతులపై 29 శాతంగా ఉన్న టారిఫ్‌లను 19 శాతానికి తగ్గించడం గమనార్హం. ఇక జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం సుంకం ఉంటుందని ట్రంప్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఆగస్టు 1 వరకు ట్రంప్ గడువు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన సుంకాలను సవరించారు. ఈ సవరించిన టారిఫ్‌లు ఏడు రోజుల్లో అమల్లోకి రానున్నాయి. అయితే, భారత్, కెనడా దిగుమతులపై విధించిన టారిఫ్‌లు మాత్రం ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తాయని అధ్యక్షుడు ఇప్పటికే స్పష్టం చేశారు.

# రష్యాతో వ్యాపారం మీరు చేయొచ్చా?

## అమెరికాపై చైనా విసుర్లు



**బీజింగ్, ఆగస్టు 1:** రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానంటూ అమెరికా పదేపదే హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ హెచ్చరికలపై తాజాగా మరోసారి చైనా స్పందించింది. వాస్తవానికి రష్యాతో అమెరికానే వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నదని ఐక్యరాజ్య సమితిలోని బీజింగ్ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి గెంగ్ షువాంగ్ పేర్కొన్నారు. అమెరికా హెచ్చరికలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐరాస భద్రతా మండలిలో ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాల అంశంపై చర్చ సమయంలో అమెరికా ప్రతినిధి చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. అనేక సందర్భాల్లో చెప్పినట్టే.. రష్యాకు ఎలాంటి ఆయుధాలను అందించలేదని స్పష్టం చేశారు. రష్యాతో పాటు ఉక్రెయిన్‌తో కూడా సాధారణ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నామన్నారు. అవి అంతర్జాతీయ చట్టాలకు లోబడే ఉన్నాయని, ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదన్నారు. వాస్తవానికి అమెరికానే ఇప్పటివరకు రష్యాతో వాణిజ్యం కొనసాగించిందని విమర్శించారు. ఇతరులు వాణిజ్య సంబంధాలు కొనసాగించకూడదు కానీ మీరు చేయొచ్చా అని ఆయన యుఎస్‌ను ప్రశ్నించారు.

ప్రస్తుతం ఉక్రెయిన్‌లో సంక్షోభం కీలక దశలో ఉందని, దాని పరిష్కారానికి ఇది సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఇతరులపై నిందలు వేసి బలిపశువులను చేయడం మాని.. కాల్పుల విరమణ, కీవ్‌లో శాంతి నెలకొల్పడం అనే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. మాస్కోతో వాణిజ్య సంబంధాలు కొనసాగించడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతుంది. దీని కారణంగా ఉక్రెయిన్‌తో యుద్ధం సాగించేందుకు రష్యాకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతోంది. ఆ దేశం నుంచి ఇంధనం కొనుగోలు చేసే భారత్, చైనాలతో సహా ఇతర దేశాలపై పెద్దఎత్తున సుంకాలు విధిస్తానని పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలో భారత్‌పై 25 శాతం సుంకంతోపాలు జరిమానాలు కూడా విధించింది.

## పార్లమెంటులో ఆగని నిరసనలు, సోమవారానికి వాయిదా

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై 10 రోజులవుతున్నా లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగాయి. బీహార్‌లో భారత ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేశారు.

స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ప్రతిపక్ష సభ్యులు పట్టించుకోకపోవడంతో సభను ముందుగా మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2గంటలకు లోక్‌సభ తిరిగి ప్రారంభమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదు. ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రత్యేక చర్చ చేపట్టాలని నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ ఓంబిర్లా సభను సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ పునఃప్రారంభం కానుంది.

అయితే లోక్‌సభలో 10వ రోజూ కూడా ఎలాంటి చర్చ జరగకపోయినా కేంద్ర ప్రభుత్వం మాత్రం మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో రిప్రజెంటేషన్ ఆఫ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఇన్ అసెంబ్లీ కాన్‌స్టిట్యెన్సీస్ ఆఫ్ ద స్టేట్ గోవా బిల్లు - 2024, ఇండియన్ పోర్ట్స్ బిల్లు - 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు - 2024 ఉన్నాయి.

# శాసనసభలో రమ్మీ ఆడిన మంత్రిపై సర్కారు వేటు



**ముంబయి,ఆగస్టు 1:** శాసన మండలిలో ఫోన్‌లో రమ్మీ ఆడుతూ కెమెరాకు చిక్కిన మహారాష్ట్ర మంత్రి, ఎన్సీపీ నేత మాణిక్‌రావ్ కోకాటేపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా కోకాటేను వ్యవసాయ శాఖ నుంచి తప్పించి క్రీడలు, యువజన సంక్షేమ శాఖ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత క్రీడామంత్రి దత్తాత్రేయ భర్నేకు వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగిస్తూ సాధారణ పరిపాలన శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. కోకాటే నాసిక్ జిల్లా సిన్నార్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. శాసన మండలి వర్షాకాల సమావేశాలకు హాజరైన సమయంలో తన ఫోన్‌లో ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడారు. దానికి సంబంధించిన వీడియోను ఎన్సీపీనాయకులు రోహిత్ పవార్, జితేంద్ర అవ్హాద్ సోషల్ మీడియాలో షేర్ చేయగా కోకాటేపై తీవ్రవిమర్శలు వచ్చాయి. మహారాష్ట్రలో రోజుకు 8మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నా పట్టించుకోకుండా వ్యవసాయ మంత్రి మాణిక్‌రావు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారని మండిపడ్డారు. దీనిపై స్పందించిన ప్రతిపక్షాలు కోకాటెను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలోనే మాణిక్‌రావ్‌పై వేటు వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలోనూ రైతులను బిచ్చగాళ్లతో పోల్చి ఆయన విమర్శల పాలయ్యారు. అంతకుముందు ఈ వీడియోపై మంత్రి కోకాటె స్పందించారు. తను గేమ్ ఆడలేదని, పని చేస్తున్నానని, ప్రతిపక్షాలకు తన పని కనిపించదని పేర్కొన్నారు. తాను సభలో ఆటలు ఆడటం లేదు. నేను అసెంబ్లీలో ఏం జరు గుతుందో అని యూట్యూబ్ లైవ్ చూస్తున్నా. వీడియో ఓపెన్ చేయగానే ప్రకటనలు వస్తాయి కదా. అలాగే ప్రకటన వచ్చింది. నేను దానిని స్కిప్ చేసి వీడియో చూసే సయమంలో రికార్డ్ చేశారు. ఇది కేవలం 18 సెకన్ల వీడియో మాత్రమే. ఇందులో ప్రకటనను స్కిప్ చేస్తున్న దృశ్యం చూపించలేదు. కానీ వీడియోను వైరల్ చేశారు. నేను వ్యవసాయ మంత్రిని. నా బాధ్యత నాకు బాగా తెలుసు. నేను ఇప్పటివరకు రైతుల కోసం చాలా మంచి నిర్ణయాలు తీసుకున్నా. కానీ రోహిత్ పవార్ దాని గురించి ఎప్పుడూ మాట్లాడడు. నా పనిని చూడడు. అతను ఖాళీ పరిశ్రమలను చూస్తున్నాడని వ్యవసాయ మంత్రి మాణిక్‌రావ్ కోకాటె కూడా ఆరోపించారు.



అత్యాచారం కేసు

## మాజీ ప్రధాని మనవడు మాజీ ఎంపి రేవణ్ణ దోషి, నేడు శిక్ష ఖరారు


**బెంగళూరు,ఆగస్టు 1:** లైంగిక వేధింపులు, అత్యాచారం కసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవెగౌడ మనవడు, జేడీఎస్ యువ నేత మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. రేవణ్ణ ఇంట్లో సహాయకురాలిగా పని చేసిన వారి బంధువైన మహిళపై అత్యాచారం కేసులో ఆయనను దోషిగా తేల్చింది. ఎంపీల/ఎంఎల్ఏల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం రేవణ్ణకు శనివారం శిక్షను ఖరారు చేయనున్నది. ఈ కేసులో విచారణ ముగియడంతో కొంత స్పష్టత అవసరం ఉందని పేర్కొంటూ జులై 30న తీర్పును వాయిదా వేసింది. శుక్రవారం (ఆగస్టు1న) తీర్పును వెలువరించింది. గతేడాది పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దోపిడీలు, దారుణాలు వెలుగులోకి రాగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ చివరి వారంలో తన దురాగతాలు వెలుగులోకి రావడానికి రెండు రోజుల ముందే ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. తీవ్ర ప్రయత్నాలు అనంతరం రెండు నెలల తర్వాత స్వదేశానికి తిరిగివచ్చిన ప్రజ్వల్‌ను బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలోనే అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయన జైలులో ఉన్నారు. బాధితురాలు ప్రజ్వల్ రేవణ్ణ తల్లి భవానీకి స్వయానా మేనత్త కుమార్తె. కాంగ్రెస్‌జేడీఎస్ ప్రభుత్వంలో రేవణ్ణ మంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు పాల కేంద్రంలో పని ఇప్పించారు. ఆ తర్వాత బీసీఎం హాస్టల్‌లో వంట మనిషిగా, 2015లో ఆమెను వారి ఇంట్లో పనికి చేర్పించారు. ఆ ఇంటిలో పనికి చేరిన నాలుగు నెలల తర్వాత నుంచి ప్రజ్వల్ ఆమెపై లైంగిక దోపిడీకి పాల్పడుతూ వచ్చాడు. పండ్లు ఇచ్చే వంకతో స్టోర్‌రూమ్‌కు పిలిచి వేధించేవాడని, వంట గదిలో ఉన్నప్పుడు అసభ్యంగా తాకేవాడని, ఒంటికి నలుగు, నూనె పెట్టి స్నానం చేయించాలని బాత్‌రూమ్‌కి తీసుకువెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఆక్రోశించింది.

## 8 పెళ్లిళ్లు చేసుకున్న మహిళ..తొమ్మిదో పెళ్లికి సిద్ధమవుతుండగా అరెస్టు

### మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఘటన

**ముంబయి, ఆగస్టు 1:**పెళ్లికాని డబ్బున్న వ్యక్తులే ఆమె లక్ష్యం. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో వారి వివరాలు సేకరిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతుంది. ఆ తర్వాత తనకు విడాకులయ్యాయని, ఓ బిడ్డ కూడా ఉన్నట్లు అవతలి వాళ్లకు ఎమోషన్‌గా దగ్గరవుతుంది. చివరికి వివాహం చేసుకుంటుంది. ఇలా ఒకటి, రెండు కాదు, ఏకంగా 8 పెళ్లిళ్లు చేసుకుంది. తొమ్మిదో పెళ్లి కోసం పావులు కదుపుతూ పోలీసులకు చిక్కింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఆమె బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం సమీరా ఫాతిమా ఉపాధ్యాయిని. ఎక్కువగా డబ్బు సంపాదించేందుకు ఆమె తప్పుడు మార్గాన్ని ఎంచుకుంది. వయసు మీదపడుతున్నా పెళ్లికాని ధనవంతులను లక్ష్యంగా చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో వారికి దగ్గరై విధిలేని పరిస్థితుల్లో విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఓ బిడ్డతో కలిసి ఒంటరిగా ఉంటున్నట్లు చెబుతుంది. చివరికి ముగ్గులోకి దించి పెళ్లి చేసుకుంటుంది. కొన్ని రోజులు గడిచాక పథకం ప్రకారం వారి నుంచి డబ్బు డిమాండ్ చేస్తుంది. అవసరమైతే బెదిరించి బలవం తంగా వసూలు చేసేందుకు ఆమెకు ప్రత్యేక గ్యాంగ్ కూడా ఉంది. ఇలా గత 15 ఏళ్లల్లో 8 పెళ్లిళ్లు చేసుకుని వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు లాగింది. సమీర త నుంచి రూ.50 లక్షలు బలవంతంగా వసూలు చేసిందని ఆమె భర్తల్లో ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఆమె బాధితుల్లో రిజర్వ్‌బ్యాంక్ సీనియర్ అధికారులు కూడా ఉండటం గమనార్హం. అయితే 8 మంది భర్తల నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితురాలు మరో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో జులై 29న నాగ్‌పూర్‌లోని ఓ టీ దుకాణం వద్ద ఆ వ్యక్తిని కలిసేందుకు వచ్చిన ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## జీతం రూ.15వేలే అయినా రూ.30 కోట్లకుపైగా ఆస్తులు!



**బెంగళూరు,ఆగస్టు 1:** కర్ణాటక లో భారీ అవినీతి తిమింగలం అధికారులకు చిక్కింది. రాష్ట్రంలోని కొప్పల్ జిల్లాలో కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లిమిటెడ్ (కెఆర్ఐడిఎల్)లో క్లర్క్‌గా పనిచేసిన వ్యక్తిపై లోకాయుక్త దాడులు నిర్వహించింది. లోకాయుక్త అధికా రుల ప్రకారం కలకప్ప నిడగుండి కొప్పల్ జిల్లాలోని కర్ణాటక గ్రామీణమౌలిక సదుపాయాల అభివృద్ధి లిమిటెడ్ (కెఆర్ఐడిఎల్)లో గుమాస్తాగా పనిచేశారు. ఆ సమయంలో రూ.15వేల జీతం తీసుకునే అతడు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ కేఆర్ ఐడీఎల్ ఇంజినీర్ చిన్చోల్కర్‌తో కలిసి నిడగుండి నకిలీ పత్రాలు, బిల్లులు సృష్టించి రూ.75 కోట్లకు పైగా దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో లోకాయుక్తా దాడులు నిర్వ హించింది. ఈ దాడుల్లో దాదాపు రూ.30కోట్లకు పైగా విలువైన ఆస్తులు బయటపడ్డాయి. దాదాపు 24 ఇళ్లు, 40ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆస్తులు నిడగుండి, ఆతని భార్య,సోదరుడి పేర్లతో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, ఆయన నివాసం నుంచి 350 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.5కేజీల వెండి ఆభరణాలు, నాలుగు వాహనాలను (రెండుకార్లు, రెండుబైక్‌లు) అధికారులు స్వాధీనంచేసు కున్నారు. ఈ మేరకు నిడగుండిని అదుపులోకి తీసుకున్న లోకాయుక్త అధికారులు విచారణ చేస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### ఇమ్రాన్ పార్టీకి చెందిన 166 మందికి పదేళ్ల జైలు



**లాహోర్, ఆగస్టు 1:** పదవీచ్యుత పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సారథ్యంలో తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇమ్రాన్‌ఖాన్ ఇప్పటికే వివిధ ఆరోపణలపై జైలు జీవితం అనుభవిస్తున్న విషయం విదితమే. ఖాన్ నిర్బంధాన్ని నిరసిస్తూ 2023 మే 9న ఐటిఐ శ్రేణులు దేశవ్యాప్త నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు డజను వరకు సైనిక కార్యాలయాలపై దాడులకు పాల్పడ్డారు. ఈ చర్యలపై ఫైసలాబాద్‌లోని యాంటీ టెర్రరిజం కోర్టు (ఎటిసి) ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఫైసలాబాద్‌లోని ఐఎస్ఐ కార్యాలయ భవనంపై జరిగిన దాడికి సంబంధించి 108 మందికి, పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడిన 58 మందికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. శిక్ష పడిన వారిలో నేషనల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఒమర్ అయూబ్, సెనేట్‌లో ప్రతిపక్ష నేత షిబ్లి ఫరాజ్, కీలక నేతలు జర్తాజ్‌గుల్, సాహిబ్‌జాదా హామీద్‌రజా ఉన్నారు. దోషులుగా ప్రకటించిన వారిలో ఆరుగురు నేషనల్ అసెంబ్లీ సభ్యులు కాగా ఒకరు పంజాబ్ అసెంబ్లీ సభ్యుడు, ఒక సెనేటర్ ఉన్నారు.

### యేడాదిలో సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.23 వేల కోట్ల నష్టం



**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** భారత పౌరులు 2024 ఏడాదికిగాను సైబర్ నేరగాళ్ల చేతిలో మొత్తం రూ.23 వేల కోట్లు నష్టపోయారు. ఢిల్లీ కి చెందిన మీడియా, టెక్ కంపెనీ డేటా లీడ్స్ తన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు భారతీయులు ఈ ఏడాది రూ.1.2 లక్షల కోట్లు మోసపోయారని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటం తెలిపింది.2024లో సైబర్ నేరగాళ్ల చేతిలో భారతీయులు పోగొట్టుకున్న సొమ్ము 2023లో పోగొట్టుకున్న సొమ్ముతో పోల్చితే మూడింతలు ఎక్కువని, అదే సమయంలో 2023లో ఇండియన్స్ మోసపోయిన సొమ్ముతో పోల్చితే 10 రెట్లు ఎక్కువని డేటాలీడ్స్ వెల్లడించింది. 2023లో సైబర్ క్రిమినల్స్ భారతీయుల నుంచి రూ.7,465 కోట్లు దోచుకున్నారని, 2022లో రూ.2,306 కోట్లు దోపిడీ చేశారని తెలిపింది. సైబర్ నేరాలకు సంబంధించి 2024లో మొత్తం 20 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయని డేటాలీడ్స్ ప్రకటించింది.

### 100 రోజుల్లో 12మంది ఉగ్రవాదులు హతం



**శ్రీనగర్ , ఆగస్టు 1:** పహల్గాం దాడి తర్వాత భద్రతా బలగాలు వరుసఆపరేషన్లతో ఉగ్రవాదులను మట్టుపెడుతున్నాయి. ఆదాడి జరిగి 100 రోజులు కాగా ఇప్పటివరకు 12 మంది ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. వారిలో ఆరు గురు పాకిస్తానీ ఉగ్రవాదులు ఉన్నారని సం బంధిత వర్గాలు వెల్లడించాయి. మిగిలిన ఆరుగురికి కూడా జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులతో సంబంధం ఉందని పేర్కొన్నాయి. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగింది. దానికి భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో ధీటుగా బదులిచ్చింది. అది మే 7న ప్రారంభమైంది. ఉగ్రవాదులను జల్లెడ పట్టేందుకు పలు ఆపరేషన్లను నిర్వహించింది. వాటిలో మహదేవ్ ఎంత కీలకమైందో తెలిసిందే. ఆ ఆపరేషన్‌లోనే పహల్గాం ఘటన బాధ్యులు హతమయ్యారని కేంద్రం ప్రకటించింది. మరోవైపు జరిగిన శివశక్తి ఆపరేషన్‌లో మరో ఇద్దరు హతమయ్యారు. ఎన్ని ఆపరేషన్లు జరుగుతున్నాయో చెప్పడం కష్టం. జమ్మూకశ్మీర్‌లోని అన్ని యూనిట్లు ఉగ్రవాద వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి అని ఆ వర్గాలు వెల్లడించాయి.

### రాహుల్ వ్యాఖ్యలపై సొంతపార్టీ ఎంపీల్లోనే నిరసన

**న్యూఢిల్లీ,ఆగస్టు 1:** భారత్, రష్యా సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంతపార్టీకి చెందిన ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో తాను విభేదిస్తున్నానని ఆయన స్పష్టంచేశారు. వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుతూ, భారత్ రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతన మయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోవద్దని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత ఆర్థికవ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ వాస్తవం చెప్పారంటూ రాహుల్ సమర్థించారు. ఆయన తీరుపై అధికారపక్షం తీవ్రఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు సొంత పార్టీనేతలనుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు.




**SHOWROOM: TELANGANA:** RENAULT **NIZAMABAD** Ph: 9311700672.


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.